డిమాండ్ కాదు.. డౌట్‌తోనే!

ఎరువులు పుష్కలం.. సరిపడా యూరియా నిల్వలు

'జిల్లాలో ఎరువుల కొరత లేదు.. ప్రస్తుతం అంత డిమాండ్ కూడా లేదు. పంటల సాగుకు అనుగుణంగా చూస్తే ఇప్పుడు ఎరువుల వాడకం పెద్దగా అవసరం ఉండదు. జిల్లాలో రబీ సాగులో యూరియా వాడకం ఎక్కువగా ఉంటుంది. అప్పుడు ఎలాంటి ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. నిరంతరం ఎరువుల దుకాణాలపై దాడులు కొనసాగిస్తూ నియంత్రణ చర్యలు చేపడతాం. ఇటీవల జిల్లాలో



నిర్వహించిన దాడులలో గుర్తించిన అక్రమాలపై చర్యలు తీసుకున్నాం. ఇదే తరహాలో తనిఖీలు కొనసాగుతాయి' అని జిల్లా వ్యవసాయాధికారి (డీఏవో) సీహెచ్ శ్రీనివాసరావు స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎరువులు.. ప్రత్యేకించి యూరియా కొరత, రైతుల ఆందోళన, ప్రభుత్వ చర్యల నేపథ్యంలో జిల్లాలో పరిస్థితిని ఆయన 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. ఆవివరాలు ఆయన మాటల్లోనే..

- ఆంధ్రజ్యోతి, ఒంగోలు

"ఎరువులు పుష్కలంగా ఉన్నాయి. ఈ సీజన్‌కు 54,468 మెట్రిక్ టన్నులు అవసరమని గుర్తించాం. ఏప్రిల్ 1 నాటికి జిల్లాలో 27,111 టన్నుల నిల్వలు ఉన్నాయి. తర్వాత ఇప్పటివరకు మరో 41,367 మెట్రిక్ టన్నులు జిల్లాకు వచ్చాయి. మొత్తం 68,478 మెట్రిక్ టన్నులు చేరుకోగా 36,856 మెట్రిక్ టన్నులను రైతులు కొనుగోలు చేశారు. మరో 31,622 టన్నుల నిల్వలు ప్రస్తుతం ఉన్నాయి.

- నిరంతర తనిఖీలతో మరింతగా నియంత్రణ
- తాజా దాడుల్లో గుర్తించిన అక్రమాలపై చర్యలు
- నెలవారీ అవసరాలకు అనుగుణంగా సరఫరా
- రబీలో ఎలాంటి కొరత రాకుండా చర్యలు
- జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

జిల్లాలో వ్యవసాయశాఖ పరిధిలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్ సాధారణ సాగు విస్తీర్ణం లక్షా 29వేల హెక్టార్లు. అందులో అత్యధికంగా 68,287 హెక్టార్లలో కంది, 26,981 హెక్టార్లలో పత్తి, 12,826 హెక్టార్లలో వరిసాగు చేస్తారు. ఈ సీజన్‌లో పంటల సాగు విస్తీర్ణం చూస్తే ఇప్పటివరకు 41,607 హెక్టార్లలో సాగైంది. కంది 17,450 హెక్టార్లు, పత్తి 10,206 హెక్టార్లలో వేశారు. వరి నాట్లు ఇప్పుడిప్పుడే వేస్తున్నారు. ఇప్పటివరకు సుమారు 2,253 హెక్టార్లలో నాట్లు వేశారు. ఖరీఫ్ సీజన్‌లో 54,468 మెట్రిక్ టన్నుల ఎరువులు

మిగతా 6వ పేజీలో



కొత్తపట్నంలోని ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ, డీఏవో శ్రీనివాసరావు (ఫైల్)

అక్రమాలపై నిగ్గుతేల్చిన విజిలెన్స్

- చర్యలకు ఉపక్రమిస్తున్న అధికారులు
- బిల్లులు లేకుండా నిల్వ ఉన్న యూరియాపై కీలక సమాచారం
- సిద్ధమవుతున్న నివేదికలు

దర్శి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ఎరువులు, విత్తనాల విక్రయాల్లో పలు అక్రమాలను విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గుర్తించారు. అక్రమార్కులపై చర్యలకు ఉపక్రమిస్తున్నట్టు సమాచారం. వారం రోజులుగా దర్శి పొదిలి ప్రాంతాలతోపాటు జిల్లావ్యాప్తంగా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వ్యవసాయాధికారులతో కలిసి ఎరువులు, విత్తనాల దుకాణాలపై దాడులు చేస్తున్న విషయం విదితమే. ఈ సందర్భంగా అనేకచోట్ల దుకాణ యజమానులు అక్రమంగా విక్రయాలు చేస్తున్న విషయాన్ని రికార్డుల ఆధారంగా గుర్తించారు. కురిచేడులోని పలు షాపుల్లో తనిఖీలు చేయగా 7.65 మెట్రిక్ టన్నుల యూరియాను బిల్లులు లేకుండా అమ్ముతున్నట్లు బయటపడింది. విత్తనాలను కూడా

మిగతా 6వ పేజీలో

గజాననా నమో నమః



వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గణనాథునికి భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. విద్యుత్ వెలుగుల మధ్య మండపాల్లో విభిన్న రూపాల్లో విఘ్నేశ్వరుడు ఆకట్టుకుంటున్నాడు. ఒంగోలులోని సీఆర్పీ క్వార్టర్స్‌లో 24 అడుగుల ఉమాపుత్ర వరసిద్ధి వినాక విగ్రహం, రాజాపానగల్ రోడ్డులో బాల వినాయకుడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. - ఆంధ్రజ్యోతి, ఒంగోలు



మార్కాపురం జిల్లాలో శ్రీశైలం ప్రతిపాదన లేదు

- మంత్రి డాక్టర్ శ్రీబాలవీరాంజనేయ స్వామి
- పుణ్యక్షేత్రంపై దుష్ప్రచారం చేయొద్దని సూచన



టంగుటూరు (కొండపి), ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలాన్ని మార్కాపురం జిల్లాలో కలపాలన్న ప్రతిపాదన ప్రభుత్వం వద్ద లేదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి స్పష్టం చేశారు. ఈ విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. శనివారం ఆయన టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం ప్రకాశం జిల్లాలోని పశ్చిమప్రాంతంలో ఉన్న మార్కాపురం, ఎర్రగొండపాలెం, గిద్దలూరు, కనిగిరి, దర్శి నియోజకవర్గాలను కలిపి మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటుకు ప్రతిపాదించామని మంత్రి చెప్పారు. ఇందుకు సంబంధించి మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం తీసుకుంటుందన్నారు. అయితే కొంతమంది వ్యక్తిగత ప్రయోజనాల కోసం రెండు జిల్లాల మధ్య చిచ్చు పెట్టాలని ప్రయత్నిస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజలు ఈవిషయాన్ని గుర్తించి ఎలాంటి ఆందోళన చెందవద్దని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి ఊహాగానాలను మీడియాలో, సోషల్ మీడియాలో ప్రచారం చేయవద్దని సూచించారు.

అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటాం

- డ్వామా పీడీ జోసఫ్‌కుమార్



దర్శి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ స్పష్టం చేశారు. 'ఉపాధి అక్రమాలపై ఉదాసీనత' శీర్షికన శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఒక ప్రకటనను విడుదల చేశారు. దర్శి మండలంలో 2024-25లో జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక రెండు రోజులపాటు నిర్వహించామన్నారు. సామాజిక తనిఖీ బృందం ఇచ్చిన నివేదిక ప్రకారం నిధుల దుర్వినియోగానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకునేందుకు నివేదికను కలెక్టర్‌కు సమర్పించామని చెప్పారు. సామాజిక తనిఖీ బృందం సమర్పించిన నివేదిక, సిబ్బంది సమర్పించిన ఇతర ఆధారాలను పరిగణనలోకి తీసుకొని తీవ్రతను బట్టి కొంతమంది నుంచి రికవరీ, పెనాల్టీలు విధించాలని నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు.

టీచర్ల ప్రమోషన్లలో దొంగాట

ఆరుగురికి అడ్డగోలుగా ఉద్యోగోన్నతులు

ఉమ్మడి జిల్లాలో ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతుల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఆరుగురు సెకండరీ గ్రేడ్ టీచర్లకు నిబంధనలకు విరుద్ధంగా సోషల్ స్టడీస్ స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ కల్పించారు. ఈ విషయమై ఒక టీచర్.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఫిర్యాదు చేయడంతో అధికారుల దొంగాట బయటపడింది. ఆరుగురికి అక్రమంగా ఉద్యోగోన్నతులు ఇవ్వడం వల్ల తాను నష్టపోయానని ఆ టీచర్ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ముఖ్యమంత్రి కార్యాలయం, విద్యాశాఖ మంత్రి పేషీ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల విద్య డైరెక్టర్‌ను కూడా ప్రశ్నించారు. దీంతో ఆ ఆరు సోషల్ స్టడీస్ స్కూలు అసిస్టెంట్ పోస్టులకు రీ కౌన్సెలింగ్ నిర్వహించాలని డైరెక్టర్ ఆదేశించడంతో అధికారులు ఆప్రక్రియను పూర్తి చేశారు. నలుగురు సీనియారిటీలో ఉద్యోగోన్నతుల పరిధిలోకి రాకపోవడంతో వారికి తిరిగి ఎస్‌జీటీలుగా రివర్షన్ ఇచ్చారు.

- సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌కు ఫిర్యాదులు
- విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాలతో రీ కౌన్సెలింగ్
- నలుగురికి ఎస్‌జీటీలుగా రివర్షన్!



ఒంగోలు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో ఇటీవల నిర్వహించిన టీచర్ల బదిలీలకు ముందు సెకండరీ గ్రేడ్‌లకు స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతులు కల్పించారు. ఈ క్రమంలో 17 సోషల్ స్టడీస్ స్కూలు అసిస్టెంట్ పోస్టులకు ఒక్కోదానికి ముగ్గురు చొప్పున 51 మందిని కౌన్సెలింగ్‌కు పిలిచారు. వారిలో 11 మంది మాత్రమే సోషల్ స్టడీస్ స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్ తీసుకున్నారు. మిగిలిన వారు ముందుకు రాలేదు. దీంతో ఆరు పోస్టులు మిగిలిపోయాయి. నిబంధనల ప్రకారం ఈ పోస్టులకు మళ్లీ ప్రమోషన్ కౌన్సెలింగ్ తేదీ ప్రకటించి సీనియారిటీ జాబితాలోని తదుపరి టీచర్లను ఆహ్వానించాల్సి ఉంది. అయితే ఆ నిబంధనలకు అధికారులు నీళ్లొదిలారు. ప్రభుత్వ మార్గదర్శకాలను పక్కనబెట్టి అందుబాటులో ఉన్న జాబితాలకు ఉద్యోగోన్నతులు కట్టబెట్టారు. మొదటి కౌన్సెలింగ్‌కు సీనియారిటీ జాబితాలోని 120వ నంబరు వరకు పిలవగా ఆ తర్వాత సీనియారిటీని విస్మరించి జాబితాలో

మిగతా 6వ పేజీలో

అర్హులకు భరోసా

- నోటీసు ఇచ్చినా అప్పీలు చేసుకున్న వారికి పింఛన్ అందజేయనున్న ప్రభుత్వం
- జిల్లాలో 2,84,625 మంది లబ్ధిదారులు
- రూ.124.52 కోట్లు విడుదల
- రేపు ఇంటింటికీ తిరిగి పంపిణీ చేయనున్న సచివాలయ సిబ్బంది

ఒంగోలు నగరం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పథకం కింద నెలవారీ పింఛన్లు పొందుతున్న వారిలో నెలకొన్న ఆందోళనకు కూటమి ప్రభుత్వం తెరదించింది. అర్హులకు ఒక్కనెల కూడా లబ్ధిని ఆపబోమంటూ స్పష్టం చేసింది. సెప్టెంబర్ ఒకటో తేదీన ఇచ్చే పింఛన్లు అర్హులందరికీ అందుతాయని ప్రభుత్వం భరోసా ఇచ్చింది. సచివాలయాల ద్వారా నోటీసులు అందుకున్న వారికి సెప్టెంబర్‌లో పంపిణీ చేసే పింఛన్ నిలిపివేస్తారంటూ ప్రచారం జరగటంతో లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. అయితే పింఛన్ పొందుతున్న వారిలో అనర్హులు, బోగస్ పింఛన్‌దారులను ఏరివేసేందుకే ఇలా నోటీసులు ఇచ్చామని ప్రభుత్వం పేర్కొంది. వికలత్వం 40శాతం కంటే తక్కువ ఉన్నవారికి, మంచానికి, వీల్‌చైర్‌కు పరిమితం అయ్యామంటూ నెలవారీ రూ.15వేలు లబ్ధి పొందుతున్న పూర్తి ఆరోగ్యవంతులకు మాత్రమే ప్రభుత్వం సచివాలయాల ద్వారా నోటీసులు జారీచేసింది. ప్రస్తుతం దివ్యాంగుల కేటగిరీ కింద రూ.6వేలు పింఛన్ పొందుతూ

మిగతా 6వ పేజీలో





లాటరీ తీసి లైసెన్స్ దక్కించుకున్న వారిని ప్రకటిస్తున్న డీఆర్వో ఓబులేశు, పక్కన ఎక్సైజ్ డీసీ హేమంత్ నాగరాజు, ఏసీ విజయ

లాటరీ పద్ధతిన బార్లు

- 26కుగాను 18కే ప్రక్రియ
- గీత కార్మికులకు మూడు
- ఐదింటికి తిరిగి నోటిఫికేషన్

ఒంగోలు క్రైం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నిబంధనల ప్రకారం నాలుగు ఆపైన దరఖాస్తులు వచ్చిన బార్లకు లాటరీ నిర్వహించారు. ప్రకాశం భవన్‌లోని స్పందన సమావేశం మందిరంలో శనివారం జరిగిన లాటరీ ప్రక్రియలో డీఆర్వో ఓబులేశు, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు, అసిస్టెంట్ కమిషనర్ విజయ, జిల్లా ఎక్సైజ్ అధికారి ఆయేషా బేగం పాల్గొన్నారు. వారి సమక్షంలో ఒంగోలులో 11, మార్కాపురంలో 2, చీమకుర్తి, దర్శి పొదిలి, కనిగిరి, గిద్దలూరులో ఒక్కో బార్‌కు లాటరీ తీసి ఎంపికైన వారికి కేటాయించారు. మొత్తం 78 అప్లికేషన్లు రాగా 18 బార్లకు లాటరీ తీశారు. అదేవిధంగా గీత కార్మి కులకు కేటాయించిన ఒంగోలు బార్‌కు 6 దరఖాస్తులు, మార్కాపురంలో బార్లకు 8 అప్లికేషన్లు అందాయి. వాటిలో ముగ్గురికి

మిగతా 6వ పేజీలో



ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలులో రావిచెట్టు రగడ

- వందేళ్లకుపైగా చరిత్ర కలిగిన వృక్షం తొలగింపు
- ఆందోళనకు దిగిన వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్
- ఎమ్మెల్యే దామచర్ల చొరవతో సమస్యకు పరిష్కారం
- పదికాలాలు గుర్తుండేలా గాంధీ పార్కులోకి మార్పు

7

బర్లీకి బైబై!

రానున్న సీజన్ సాగుపై నిషేధం

- అమలుకు మూడు స్థాయిల్లో టాస్క్‌ఫోర్స్ కమిటీలు
- జిల్లా యంత్రాంగానికి చేరిన ప్రభుత్వ ఉత్తర్వులు
- ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన



ఒంగోలు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : బర్లీ (నాటు) పొగాకుపై ప్రభుత్వం నిషేధం విధించింది. రానున్న వ్యవసాయ సీజన్‌లో రైతులు ఆ పంట సాగు చేయకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. ఈమేరకు ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ అధికారులతో సంయుక్తంగా కమిటీలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించింది. జిల్లాలో బర్లీ పొగాకు సాగు పరిమితంగానే ఉంది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ప్రత్యేకించి గతంలో ఉమ్మడి జిల్లాలో ఉండి ప్రస్తుతం బాపట్ల జిల్లాలో చేరిన ప్రాంతంలో అధికంగా సాగవుతుంది. దశాబ్ద కాలంగా ఏటా పంట సాగు పెరుగుతోంది. వ్యాపారులు మరింత ప్రోత్సహించడం, ధరలు కూడా ఆశాజనకంగా ఉండటంతో గత సీజన్ (2024-25)లో అనూహ్యంగా పంట ఉత్పత్తి పెరిగింది. గతంలో కిలో రూ.130 వరకు బర్లీ పొగాకును

మిగతా 6వ పేజీలో



గిరిజనులకు దుప్పట్లు అందజేస్తున్న న్యాయమూర్తులు

తల్లిదండ్రులు పిల్లలను చదివించాలి

● అవగాహన సదస్సులో న్యాయాధికారి భారతి

గిద్దలూరు టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా చదివించాలని, వారు విద్యావంతులై ఉపాధి చేసుకుని ఆర్థికంగా వారి కాళ్లపై వారు నిలబడేలా చేయాలని న్యాయాధికారి భారతి అన్నారు. మండలంలోని కేఎస్‌పల్లె గ్రామంలోని భీమలింగేశ్వరస్వామి ఆవరణలో గిరిజనులు, ఆదివాసులకు వివిధ అంశాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలోపాల్గొన్న న్యాయాధికారి భారతి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాలలో ఆడపిల్లల బాధ్యతలనుంచి తప్పించుకోవడానికి తల్లిదండ్రులు బాల్యవివాహాలు చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం అందిస్తున్న నిర్బంధ విద్య ద్వారా విద్యావంతులను చేయాలని, వారికి ఇష్టమైన రంగాలలో వారిని ఎదగనివ్వాలన్నారు. వివాహ చట్టాలపై అవగాహన కల్పించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రధాన జిల్లా న్యాయాధికారి ఎ.పార్వతి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై దుప్పట్లను పంపిణీ చేశారు. గిరిజన హక్కుల రక్షణ - అమలు, ఆదివాసుల హక్కులు, అమలుపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సీనియర్ సివిల్ న్యాయాధికారి షేక్ ఇబ్రహీం షరీఫ్, జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎ.ఓంకార్ మాట్లాడుతూ బాల్యవివాహాలను నివారించాలని అన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మానాయక్ మాట్లాడుతూ 1వ తరగతి నుంచి పీజీ వరకు విద్యను అభ్యసించే అవకాశం ప్రభుత్వం చేస్తున్నదని అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు జీవనజ్యోతి పథకం ద్వారా సహాయం చేస్తామని, డప్పు, చర్మ కళాకారులకు 45 ఏళ్ల పైబడిన వారికి పింఛన్‌లు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

అర్హులకు భరోసా

(5వ పేజీ తరువాయి)

40శాతం కంటే వైకల్యం తక్కువగా ఉండి వారు ఇతర కేటగిరీల కింద అంటే 60ఏళ్ల వయస్సు దాటి, లేదా వితంతువు అయితే, లేదా ఒంటరి మహిళగా ఉంటే వారి పింఛన్‌ను మార్పు చేశారు. అదే హెల్త్ పింఛన్ తీసుకుంటున్న వారిలో కూడా అనర్హులు ఉంటే వారు కూడా ఇతర కేటగిరీ కింద పింఛన్‌కు అర్హత ఉంటే మార్పు చేసి ఈ నెలలో అందజేయనున్నారు.

2,801 మందికి నోటీసులు

మొత్తం మీద 2,801 మందికి పూర్తిగా పింఛన్ రద్దు కోసం నోటీసులు జారీచేశారు. వారిలో తాము పింఛన్ పొందేందుకు అర్హులమంటూ సంబంధిత ఎంపీడీవోకి, మున్సిపల్ కమిషనర్‌కు అప్పీలు చేసుకున్న వారికి మాత్రం సెప్టెంబర్ మాసంలో ఎలాంటి ఢోకా లేకుండా పింఛన్ పంపిణీ చేస్తారు. తాము అర్హులంటూ అధికారులకు అప్పీలు చేయకుండా ముఖంచాటేసిన వారికి మాత్రమే నిలుపుదల చేస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. దీంతో జిల్లాలో అర్హులైన వారికి పింఛన్ భరోసా ఇచ్చినట్లైంది. జిల్లాలో దాదాపు 2,801 సచివాలయాల ద్వారా నోటీసులు జారీ అయ్యాయి. వీరిలో సగానికి సగం మంది తాము అర్హులమంటూ అధికారులకు అప్పీలు చేసుకున్నారు. ఈ నెల 30వతేదీ వరకు అప్పీలు చేసుకున్న వారికి ప్రభుత్వం సోమవారం పింఛన్‌ను పంపిణీ చేయనుంది. ఎటొచ్చి నోటీసులు అందుకున్నా తమ అర్హతను నిరూపించుకోని అనర్హులకు మాత్రమే ప్రభుత్వం పింఛన్‌ను నిలిపివేయనుంది.

రూ.124.52 కోట్లు విడుదల..

జిల్లాలో సెప్టెంబర్‌లో 2,84,625 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం పింఛన్ పంపిణీ చేయనుంది. వీరికి పింఛన్ సొమ్ము అందించేందుకు రాష్ట్రప్రభుత్వం జిల్లాకు రూ.124,52,22500లను విడుదల చేసింది. ఈనెల 31న ఆదివారం బ్యాంకులకు సెలవు కావటంతో శనివారం నాడే సచివాలయం సిబ్బంది పింఛన్ సొమ్మును బ్యాంకుల నుంచి డ్రా చేశారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచే పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. పింఛన్‌దారులకు ఎ లాంటి ఇబ్బందిలేకుండా ఇంటికే వెళ్లి తలుపుతట్టి మరీ పింఛన్ పంపిణీ చేయనున్నారు. శనివారం నాడే సచివాలయం సిబ్బంది దూరప్రాంతాల్లో ఉన్న లబ్ధిదారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. సోమవారం పింఛన్ సొమ్ము తీసుకునేందుకు అందుబాటులో ఉండాలని సమాచారం అందించారు. రాష్ట్రప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పథకం కింద కేవలం అనర్హులను, బోగస్ లబ్ధిదారులను ఏరివేసే దిశగా చేపడుతున్న చర్యల్లో అర్హులకు ఏ ఒక్కరికి అన్యాయం జరగకుండా పగడ్బందీ చర్యలు చేపడుతోంది.

అక్రమాలపై నిగ్గు తేల్చిన విజిలెన్స్

(5వ పేజీ తరువాయి)

అక్రమంగా విక్రయించారు. దర్శి మండలంలోని రాజంపల్లిలోని ఒక షాపులో బిల్లులు లేకుండా నిల్వ ఉన్న 130 బస్తాల యూరియాను పట్టుకున్న విషయం తెలిసిందే. అలాగే, లైసెన్స్ లేకుండా విత్తనాలను విక్రయిస్తూ పట్టుబడ్డారు. ముండ్లమూరు మండలంలో దుకాణాల్లో ఎరువులకు సంబంధించి విక్రయాల్లో తేడాలను గుర్తించారు. నిల్వ ఉన్న సరుకులను, విక్రయించిన బిల్లులకు తేడా ఉండటంతో కేసులు నమోదు చేశారు.

డిమాండ్ నేపథ్యంలో..

ప్రస్తుతం దేశవ్యాప్తంగా యూరియాకు విపరీతమైన డిమాండ్ ఉంది. ఈ నేపథ్యంలో పలు షాపులకు బిల్లులు లేకుండా యూరియా ఎక్కడ నుంచి వచ్చిందనే విషయాన్ని నిశితంగా పరిశీలించి సమాచారం రాబట్టినట్టు తెలిసింది. ప్రైవేట్ హోల్‌సేల్ వ్యాపారులకు, సొసైటీలకు ఎరువులను కేటాయించారు. కొంతమంది హోల్‌సేల్ వ్యాపారులు షాపులకు యూరియాను అక్రమంగా తరలించినట్టు సమాచారం. ఎవరు ఎక్కడ నుంచి యూరియాను అక్రమంగా సరఫరా చేశారనే విషయాన్ని నివేదిక తయారుచేస్తున్నట్టు తెలిసింది. ఇప్పటికే అక్రమాలు గుర్తించిన షాపులపై కేసులు నమోదు చేశారు. పూర్తి నివేదిక తయారైన తర్వాత ఉన్నతాధికారులకు సమర్పించి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

బిల్లులు లేకుండా అమ్మకాలు

రాష్ట్రప్రభుత్వం సరసమైన ధరలకు ఎరువులను నాణ్యమైన విత్తనాలను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ రంగ సంస్థలతోపాటు ప్రైవేట్ సంస్థలకు కూడా వాటాల ప్రకారం ఎరువులను కేటాయించింది. కొంతమంది ప్రైవేట్ వ్యాపారులు, ప్రైవేట్ సొసైటీలు డిమాండ్ ఉన్న యూరియాను దుర్వినియోగం చేస్తున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం బిల్లులు లేకుండా పట్టుబడిన యూరియా ఆధారంగా ఈ కుంభకోణాన్ని బట్టబయలు చేసే అవకాశం ఉంది. సాగర్ జలాలు పుష్కలంగా విడుదల అవుతుండటంతో రైతులు ముమ్మరంగా వరినాట్లు వేస్తున్నారు. మెట్టప్రాంతాల్లో పైర్లు సాగు చేస్తున్నారు. ఈక్రమంలో అన్నదాతలకు ఎరువులను నిర్దేశించిన ధరల ప్రకారం అందించటంతో పాటు అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

టీచర్ల ప్రమోషన్‌లలో దొంగాట

(5వ పేజీ తరువాయి)

ఎక్కడో 386 వరస నంబరు ఉన్న టీచర్‌కు కూడా ప్రమోషన్ కల్పించారు.

గుట్టుచప్పుడు కాకుండా రీ కౌన్సెలింగ్

అక్రమ ఉద్యోగోన్నతుల గుట్టు రట్టవడంతో పాఠశాల విద్య డైరెక్టర్ ఆదేశాల మేరకు గత మంగళవారం గోప్యంగా రీకౌన్సెలింగ్ నిర్వహించారు. ఎలాంటి పత్రికా ప్రకటన కూడా ఇవ్వకుండా డీఈవో కార్యాలయం నుంచి నేరుగా అభ్యర్థులకు ఫోన్లు చేసి కౌన్సెలింగ్‌కు పిలిచారు. గతంలో అక్రమంగా ఉద్యోగోన్నతులు పొందిన ఆరుగురిని కూడా ఆహ్వానించారు. ఈ కౌన్సెలింగ్‌లో ప్రమోషన్ల జోన్‌లోకి గతంలో అక్రమంగా ఉద్యోగోన్నతి పొందిన వారు ఇద్దరు రాగా మిగిలిన నాలుగు పోస్టులు ఇతరులు కోరుకున్నారు. దీంతో పాతవారిలో నలుగురి ప్రమోషన్లను రద్దు చేశారు. వీరికి ఎస్‌జీటీలుగా రివర్షన్ ఇవ్వనున్నారు. న్యాయపరమైన చిక్కులు రాకుండా ఈ నలుగురికి ముందస్తు నోటీసులు జారీ చేశారు.

ఐదు నిమిషాల తర్వాత అయితే..

- పెను ప్రమాదానికి ఆస్కారం
- మిడ్‌వెస్ట్ క్వారీలో కార్మికులకు తప్పిన ప్రాణముప్పు
- సంఘటనా స్థలంలో ప్రాథమిక విచారణ జరిపిన మైన్స్ డీడీ
- కన్నెత్తి చూడని సేఫ్టీ అధికారులు
- క్వారీల్లో ప్రమాదాల నివారణ చర్యలపై ఎస్పీ దృష్టి

చీమకుర్తి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఐదు నిమిషాల వ్యవధి..పదుల సంఖ్యలో వలస కార్మికుల ప్రాణాలను నిలబెట్టింది. మిడ్‌వెస్ట్ గెలాక్సీ గ్రానైట్ క్వారీలో శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదంలో అదృష్ట వశాత్తు కార్మికులు ప్రాణాపాయంనుంచి బయటపడ్డారు.ప్రమాదం సరిగ్గా భోజనవిరామం ముగింపునకు ఐదునిమిషాలు ముందు జరిగింది. ఇదే ప్రమాదం మరో ఐదునిమిషాల తర్వాత జరిగి ఉంటే భోజనవిరామం ముగింపు తర్వాత క్వారీ పిట్‌లోకి పనుల నిమిత్తం కార్మికులు చేరుకొని ఉండేవారు. ఇదే జరిగితే జారిపడిన రాళ్లకింద కార్మికుల బతుకులు బండబారి ఉండేవి. శనివారం ప్రమాద సంఘటనను పరిశీలించటానికి క్వారీకి వచ్చిన మైన్స్ డీడీ రాజశేఖర్‌కి క్వారీ ప్రతినిధులు తెలియజేస్తుంటే అది విన్న అధికారులు అప్రయత్నంగా థ్యాంక్స్ గాడ్ అని ఒకేసారి అనటం సంఘటన తీవ్రతను తెలియజేస్తుంది. ఐదు నిమిషాల తర్వాత ఇదే ఘటన జరిగిఉంటే ఎంతటి ఘోర ప్రమాదం జరిగిఉండేదో తెలియజేస్తుంది.



ప్రమాదం జరిగిన స్థలంలో ప్రస్తుత స్థితి

క్వారీ పైనుంచిన రాళ్లు జారిపడి...

ప్రమాదం జరిగిన సంఘటనా స్థలాన్ని మైన్స్ డీడీ రాజశేఖర్ తన సిబ్బందితో కలిసి శనివారం పరిశీలించారు. సంఘటనపై ప్రాథమిక విచారణ జరిపారు. క్వారీ నుంచి వెలికి తీసిన రాళ్ల పిట్‌నుంచి పైకి తీసుకెళ్లిన తర్వాత వాటిని ఒడ్డుపై ఉంచారు. అలా ఉంచిన రాళ్లు పిట్‌లోకి జారిపడి ప్రమాదం జరిగిందనే విషయాన్ని మైన్స్ అధికారులు తమ ప్రాథమిక విచారణలో తేల్చారు. ప్రమాద రహితంగా క్వారీయింగ్ కార్యకలాపాలు నిర్వహించాల్సిన బాధ్యతాయుతమైన మైన్స్ మేనేజర్లు, వారిని పర్యవేక్షించాల్సిన మైన్స్‌సేఫ్టీ యంత్రాంగం నిర్లక్ష్యవైఖరి సంఘటన జరగటానికి ప్రధాన కారణంగా కనబడుతోంది. క్వారీల్లో ప్రమాదాలు నివారించటమే ప్రధాన బాధ్యత కల్గిన మైన్స్ మేనేజర్లకు క్వారీ యాజమాన్యం బంధనాలు వేసి పూర్తిస్థాయిలో వారి బాధ్యతలను వినియోగించే వీలులేకుండా చేస్తుండటం గ్రానైట్ క్వారీల్లో ప్రమాదాల పరంపరకు కారణభూతమవుతోంది.వాటిని అనునిత్యం పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు సరిదిద్దాల్సిన మైన్స్ సేఫ్టీ అధికారులు భద్రతావారోత్సవాల సమయంలో తప్ప కనపడకపోవటంతో యజమానులు ఇష్టారీతిన నిబంధనలను తుంగలో తొక్కుతూ ఆదాయమే పరమావధిగా క్వారీయింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు.దీనివలన క్వారీ కార్మికుల ప్రాణాలు గాల్లో దీపాల్లా మారాయి.శుక్రవారం రాత్రి ఇంత ప్రమాదం జరిగినా హైదరాబాదులో ఉన్న మైన్స్‌సేఫ్టీ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడకపోవటం వారితీరుకు అద్దం పడుతోంది. నెల్లూరులో ఉన్న మైన్స్‌సేఫ్టీ కార్యాలయాన్ని ఏపీలో కాకుండా తెలంగాణలో ఉన్న హైదరాబాదుకు రెండేళ్ల క్రితం తరలించారు. దీంతో తెలంగాణ నుంచి ఏపీలో ఉన్న క్వారీలను సేఫ్టీ అధికారులు పర్యవేక్షిస్తుండటం జరుగుతోంది. ఈ విధంగా పర్యవేక్షణ జరుగుతుండటంతో క్వారీల్లో భద్రత డొల్లగా మారింది. గత కొన్నినెలల్లోనే బల్లికురవ, చీమకుర్తి పరిధిలోని గ్రానైట్ క్వారీల్లో మూడు ప్రమాదాలు చోటుచేసుకున్నా అధికారుల తీరులో మార్పురాలేదు. ఇప్పటికైనా హైదరాబాదుకు తరలించిన డీడీఎంఎస్ కార్యాలయాన్ని వెంటనే ఒంగోలుకు తరలించి క్వారీల్లో సేఫ్టీ అధికారుల పర్యవేక్షణ అనునిత్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘనాయకులు, వలస కార్మికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న మైన్స్ డీడీ రాజశేఖర్

ప్రమాదాల నివారణకు పోలీసుపరంగా చర్యలు:

● ఎస్పీ ఏఆర్ దామోదర్

గెలాక్సీ గ్రానైట్ క్వారీల్లో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటుండటంతో జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ప్రమాదాల నివారణపై దృష్టిసారించారు.శనివారం సాయంత్రం చీమకుర్తి పోలీస్‌స్టేషన్‌కు విచ్చేసిన ఆయన చీకటి పడటంతో క్వారీని సందర్శించలేకపోయారు. ప్రమాద సంఘటనపై సమీక్ష జరిపారు. భవిష్యత్‌లో ప్రమాదాల నివారణకు పోలీస్ పరంగా తీసుకోవాల్సిన చర్యలపై సీఐ సుబ్బారావు,సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు.

నూతన సాంకేతికతను విలేకరులు అందిపుచ్చుకోవాలి

ఎస్పీ దామోదర్

మొదలైన సీఆర్ మీడియా అకాడమీ పునశ్చరణ తరగతులు

మార్కాపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంత విలేకరులు మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన సాంకేతిక పద్ధతులను అందిపుచ్చుకొని నాణ్యతతో కూడిన రిపోర్టింగ్ చేయాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. స్థానిక సౌజన్య ఫంక్షన్ హాలులో సీఆర్ మీడియా అకాడమీ, ఆంధ్రప్రదేశ్, ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా విలేకరులకు పునశ్చరణ తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ నేర వార్తల విషయంలో ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేయకుండా ఉండాలన్నారు. చిన్నపాటి విషయాలను కూడా పెద్దవిగా చూపడం వలన ప్రజలను తప్పుదోవ పట్టించినట్లు అవుతుందన్నారు. వెనుకబడిన మార్కాపురం డివిజన్‌లో ఎన్నో రకాలైన మోసాలు జరుగుతున్నాయన్నారు. ముఖ్యంగా ఉద్యోగాల వల ఆశకు చిక్కిన బాధితులు ఎంతోమంది ఉన్నారన్నారు. అలాంటి వారితోపాటు సైబర్‌మోసాలు, ఆర్థిక మోసాలకు గురయ్యేవారిని చైతన్యవంతులను చేయాలన్నారు. సమాజాన్ని పట్టిపీడిస్తున్న గంజాయి, మత్తు పదార్థాల అనర్థాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత మీడియాదే అన్నారు. సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ మాట్లాడుతూ పాత్రికేయులు వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవడమే అకాడమీ లక్ష్యమన్నారు. అకాడమీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛను వక్రీకరించి మీడియా స్వేచ్ఛ కింద ఇష్టారీతిన వ్యవహరించడం ఉల్లంఘన అవుతుందన్నారు. కొన్ని మీడియా సంస్థలు ఈ విధంగా వ్యవహరిస్తున్నాయన్నారు. అది మంచి పద్ధతి కాదన్నారు. మరో అతిథి, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేందుకు పాత్రికేయులు కీలక పాత్ర పోషించాలన్నారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ గ్రామీణ విలేకరులు శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వృత్తి నైపుణ్యాలను ఎప్పటికప్పుడు పెంపొందించుకుంటేనే ఏ రంగంలోనైనా రాణిస్తారన్నారు. అనంతరం ఉదయం 11.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు మూడు అంశాలపై తొలిరోజు శిక్షణ ఇచ్చారు. క్రైమ్ రిపోర్టింగ్ గురించి ఆంధ్రజ్యోతి క్రైమ్ బ్యూరో ఎస్.రమేష్, గ్రామీణ వార్తలు, కథనాలు గురించి ఐజేయూ సెక్రటరీ జనరల్ డి.సోమసుందర్, ఫ్యాక్ట్ చెక్ గురించి హన్స్ ఇండియా సీనియర్ రిపోర్టర్ ఎన్.నరేష్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి, ఉదయ్ శాట్‌విజన్ ఎండీ సూర పరమేశ్వరరెడ్డి, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి ఎ.సురేష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌వీ రమణ, కనకయ్య, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు వెంకటరావు, మార్కాపురం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు డి.మోహన్‌రెడ్డి, జిల్లాలోని పలు మండలాలకు చెందిన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్, తదితరులు

డిమాండ్ కాదు.. డౌట్‌తోనే!

(5వ పేజీ తరువాయి)

అవసరంగా వ్యవసాయశాఖ అంచనా వేసింది. తదనుగుణంగా ఎరువులు ఎప్పటికప్పుడు తెప్పిస్తున్నారు. నెలవారీ ఆయా రకాల ఎరువుల అవసరాన్ని పరిశీలించి తదనుగుణంగా జిల్లాకు ఎరువులు వచ్చేలా అలాగే వచ్చిన వాటిని అన్ని ప్రాంతాలకు చేర్చి రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాం.

యూరియాకు ఎలాంటి కొరత లేదు. సాధారణంగా ఖరీఫ్ కన్నా రబీలో వాడకం ఎక్కువగా ఉంటుంది. ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు జిల్లాలో ప్రతినెల యూరియా నిల్వలు భారీగానే ఉంటున్నాయి. ఏప్రిల్ ఆరంభం నాటికి జిల్లాలో 9,725 టన్నులు నిల్వ ఉంది. తర్వాత ఇప్పటివరకు 10,995 టన్నులు జిల్లాకు వచ్చింది. ఈ ఐదు నెలల్లో 15,455 మెట్రిక్ టన్నులను రైతులు కొనుగోలు చేశారు. 5,295 మెట్రిక్ టన్నులు యూరియా నిల్వలు ఉన్నాయి. సెప్టెంబరు కోటా ప్రకారం మళ్లీ తెప్పించే చర్యలు చేపట్టాం.

- వాస్తవానికి జిల్లాలో ఎరువులు ప్రత్యేకించి యూరియాకు ఎలాంటి కొరత రాదు. డిమాండ్ కూడా అంతగా లేదు. ఇతర ప్రాంతాల్లో యూరియా సమస్యవిని దొరకదమోనన్న ఆందోళన చెందుతున్న రైతులు కొందరు ముందుగా కొనే ప్రయత్నాలు చేస్తున్నారు. దీనివల్ల కొంత ఇబ్బందికరంగా కనిపిస్తుంది. సాగర్ ఆయకట్టులో వరినాట్లు ప్రారంభంతో ఆ ప్రాంతంలో ఈ తరహా పరిస్థితి ఉంది. అలాగే బోర్ల కింద పంటలు వేసిన ప్రాంతాల్లో కూడా ఉంది.
- కొన్నిచోట్ల వ్యాపారులు కూడా పరిస్థితిని అనుకూలంగా మల్చుకునే ప్రయత్నం చేస్తున్నట్లు వ్యవసాయశాఖ సాధారణంగా చేసే తనిఖీల సమయంలో గుర్తించి మొత్తం అధికారులను అప్రమత్తం చేశాం. ప్రభుత్వ ఆదేశాలతో ఇటీవల జిల్లాలో రెవెన్యూ, విజిలెన్స్ వ్యవసాయశాఖ అధికారులు పెద్దఎత్తున దాడులు చేశారు.
- తాజాగా చేసిన దాడులు పరిశీలిస్తే.. ఈనెల 25 నుంచి 29 వరకు 112 దుకాణాల్లో వివిధ ప్రాంతాల్లో దాడులు చేయగా రూ.34.25 లక్షల విలువైన 187.27 మెట్రిక్ టన్నుల ఎరువులు సీజ్ చేశారు. అలాగే పది దుకాణాలపై 6(ఏ) కేసులు నమోదు. ఒకచోట క్రిమినల్ కేసు నమోదు జరిగింది. స్వయంగా జేసీ గోపాలకృష్ణ దుకాణాల్లో దాడుల్లో పాల్గొన్నారు.
- ఈ తరహా దాడులు నిరంతరం కొనసాగుతాయి. రైతులకు ఇబ్బంది లేకుండా కలెక్టర్ ఆదేశాలతో చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాకు వచ్చే ఎరువులో 50శాతం వ్యాపారులు, 50శాతం సహకార రంగం ద్వారా విక్రయాలకు ఇస్తాం. తాజా పరిస్థితి నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాలతో సహకార సంస్థలకు 70 శాతం ఇచ్చి డీలర్లకు 30శాతం మాత్రమే కేటాయిస్తున్నాం.
- యూరియాతో సహా ఏ ఎరువు కొరత లేకుండా రైతులందరికీ సక్రమంగా అందేలా చూస్తాం. రబీపై మరింత దృష్టిపెడతాం. రైతులెవ్వరు ఆందోళన చెందవద్దు. దొరకవేమోనన్న ఆందోళనతో అవసరం లేకపోయినా కొనుగోలు చేసే పరిస్థితికి రావద్దు. అలా చేయడం వల్ల సమస్య పెరుగుతుందని రైతులు గుర్తించాలి.

మోటుపల్లి తీరానికి వచ్చిన శ్రీకృష్ణుడి విగ్రహం



తీరానికి కొట్టుకొచ్చిన విగ్రహాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రభాకర్‌రావు (ఇన్‌సెట్లో) కృష్ణుని విగ్రహం

చినగంజాం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా చినగంజాం మండలంలోని మోటుపల్లి సముద్ర తీర ప్రాంతానికి శ్రీకృష్ణుని రాతి విగ్రహం కొట్టుకొచ్చింది. శనివారం ఉదయం గణనాథులను నిమజ్జనం చేయడానికి సముద్రంలోనికి వెళ్లిన భక్తుల కాళ్లకు విగ్రహం తగిలింది. దానిని భక్తులు సముద్రపు ఒడ్డుకు చేర్చారు. తీర ప్రాంతానికి శ్రీకృష్ణుని విగ్రహం బయటకు వచ్చిన విషయం తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావుకు సమాచారం అందడంతో ఆయన వెళ్లి విగ్రహాన్ని పరిశీలించారు. చీరాల ఆర్డీవో టి.చంద్రశేఖర్‌నాయుడు ఆదేశాల మేరకు నాగులుప్పలపాడు మండలంలోని కనుపర్తి పురావస్తుశాఖ వారికి భద్రత, విచారణ నిమిత్తం పంపనున్నట్లు తెలిపారు. మోటుపల్లి గ్రామ రెవెన్యూ అధికారి పి.నాగరాజురెడ్డి ద్వారా శ్రీకృష్ణుని విగ్రహాన్ని పురావస్తుశాఖ వారికి అప్పగిస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

సముద్రం నుంచి బయటకు వచ్చిన శ్రీకృష్ణుని విగ్రహం మూడు అడుగుల ఎత్తు ఉంది. తల పక్కన శంఖుచక్రాలు, చేతిలో పిల్లనగ్రోవి, విగ్రహం అడుగు భాగం కాళ్ల వద్ద ఇరువైపులా అమ్మవార్ల బొమ్మలు ఉన్నాయి. సముద్రపు ఒడ్డున పెట్టిన విగ్రహానికి భక్తులు పూజలు నిర్వహించారు.

బర్లీకి బైబై

(5వ పేజీ తరువాయి)

కొనుగోలు చేసిన వ్యాపారులు ఈ సీజన్‌లో మాత్రం రూ.6వేల నుంచి రూ.8వేలకు మించి ఇవ్వకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో బర్లీ పొగాకు అత్యధికంగా ఉత్పత్తి అయ్యే ప్రాంతమైన పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సీఎం చంద్రబాబు రైతులను ఆదుకొనేందుకు రూ.363 కోట్లు కేటాయించి మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపి కొనుగోలు చేయించారు. దాని వల్ల బర్లీ పొగాకు రైతులు ఊరట చెందారు. వ్యాపారుల దయాదాక్షిణ్యాలపై మార్కెట్ ఆధారపడి ఉండటం వల్ల వచ్చే సీజన్‌లో పంట సాగు నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రైతులను కూడా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల ద్వారా ఒప్పించింది. తదనుగుణంగా వచ్చే సీజన్ (2025-26)కు బర్లీ పొగాకు సాగును నిషేధిస్తూ తాజాగా ఉత్తర్వులు ఇచ్చింది. జిల్లాలో ప్రస్తుత సీజన్‌లో సుమారు 6,700 ఎకరాలలో బర్లీ పొగాకును సాగు చేశారు. రానున్న సీజన్‌కు ఆ విస్తీర్ణంలో అపరాలు, చిరుధాన్యాలు ఇతరత్రా పంటలను సాగు చేసేలా రైతులకు యంత్రాంగం అవగాహన కల్పించనుంది.

పర్యవేక్షణకు కమిటీలు

బర్లీ పొగాకు సాగును నిషేధించిన ప్రభుత్వం దీని పర్యవేక్షణకు అన్ని జిల్లాల్లోనూ మూడు స్థాయిల్లో టాస్క్‌ఫోర్స్ కమిటీల ఏర్పాటుకు ఆదేశించింది. జిల్లా స్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా ఎస్పీ, వ్యవసాయశాఖ అధికారి, డీఎంహెచ్‌వోలు సభ్యులుగా కమిటీ ఉంటుంది. డివిజన్ స్థాయిలో ఆర్డీవోల నేతృత్వంలో, మండల స్థాయిలో తహసీల్దార్ల నేతృత్వంలో కమిటీలను సంబంధిత శాఖ అధికారులతో ఏర్పాటు చేశారు. బర్లీ పొగాకు వేసే గ్రామాల్లో రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన, ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరించి ఎవరూ సాగు చేయకుండా చర్యలను ఈ కమిటీలు పర్యవేక్షించనున్నాయి.

లాటరీ పద్ధతిన బార్లు

(5 వ పేజీ తరువాయి)

మాత్రమే బార్లు దక్కాయి. ఇంకా ఎనిమిది బార్లు మిగిలిపోయాయి. వీటిలో అసలు దరఖాస్తులు రాని బార్లను వదిలివేసి, 1నుంచి 3లోపు అప్లికేషన్లు వచ్చిన ఐదు బార్లకు తిరిగి నోటిఫికేషన్ జారీ చేశారు. వీటిలో ఒంగోలులో 3, మార్కాపురంలో 2 బార్లు ఉన్నాయి. వచేనెల 1 వరకు దరఖాస్తులు ఆహ్వానించి 2న తిరిగి లాటరీ తీయనున్నట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి ఆయేషాబేగం తెలిపారు.

స్త్రీశక్తి పథకం విజయవంతంపై ర్యాలీ

చీరాలలో ఘనంగా విజయోత్సవ ర్యాలీ

చీరాల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సూపర్ సిక్స్ పథకాలు సూపర్ సక్సెస్ అయినట్లు టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్ అన్నారు. ఇటీవల స్త్రీశక్తి ఉచిత బస్సు పథకం విజయవంతం నేపథ్యంలో పట్టణంలో మహేంద్రనాథ్ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రారంభమై గడియార స్తంభం వరకు సాగిన ఈ ర్యాలీలో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్ర బాబు ఎన్నికల హామీలు అమలు చేసే క్రమంలో ఎక్కడా కూడా వెనుకడుగు వేయ లేదన్నారు. ఒకవైపు గత ప్రభుత్వంతో అన్ని రంగాలు కుదేలై రాష్ట్రం సంక్షోభంలోకి చేరింద న్నారు. అవాంతరాలు ఎన్ని ఉన్నా ఇచ్చిన మాటకు కట్టుబడి సూపర్ సిక్స్ పథకాలు గ్రాండ్ సక్సెస్ చేసినట్లు వివరించారు. సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే కొండయ్య చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. మహిళలు కోలాటం నిర్వహించారు. అంతకుముందు నియోజకవర్గంలోని నవ రాత్రులు సందర్భంగా వినాయకుని మండపాల వద్ద నిర్వహిస్తున్న ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న మహిళలు, టీడీపీ నాయకులు

మహిళలకు ప్రభుత్వ ప్రోత్సాహం

- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు
- డ్వాక్రా మహిళలకు రుణాల చెక్కు విడుదల

మార్టూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా ఎదిగేందుకు మహిళలకు అవకాశాలు కల్పిస్తే వారు అద్భుతాలు చేస్తారని నమ్మిన వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. శనివారం ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో స్త్రీశక్తి విజయోత్సవ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మహిళలను ఉద్దేశించి ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే మహిళల సంక్షేమం కోసం ఎన్నో అభివృద్ధి పనులను చేపట్టిందన్నారు.మహిళలకు ఆర్‌టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం ప్రారంభించిందన్నారు. అంతేగాకుండా తల్లికి వందనం అంటూ బిడ్డల భవిష్యత్తు బంగారం కావాలనే ఉద్దేశంతో వారి ఖాతాలో డబ్బులు జమచేసిందన్నారు. అదేవిధంగా దీపం పథకం ద్వారా ప్రతి కుటుంబానికి 3 ఎల్పీజీ సిలిండర్లను అందచేసిన ప్రభుత్వమే కూటమి ప్రభుత్వమన్నారు. తరువాత మహిళలతో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని 77 స్వయం సహాయక సంఘాలకు రూ.11. 25కోట్ల విలువైన చెక్కును గ్రూపు మహిళలకు ఎమ్మెల్యే ఏలూరి అందచేశారు.నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సంధ్య, జయమ్మ, బత్తుల కృష్ణవేణి, ఉప్పుటూరు రమాదేవి, కర్రీ నాగేంద్రమ్మ, శారద, వనజ, మహిళలు భారీగా పాల్గొన్నారు.



చెక్కును విడుదల చేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



మంగమూరు రోడ్డులో రహదారికి అడ్డుగా ఉన్న రావిచెట్టును తొలగించిన ప్రదేశంలో ఆందోళన చేస్తున్న ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ నేతలు

మంగమూరు రోడ్‌లో రావిచెట్టు రగడ..!

వందేళ్లకుపైగా చరిత్ర కలిగిన చెట్టు తొలగింపు
ఆందోళనకు దిగిన వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్
ఎమ్మెల్యే దామచర్ల చొరవతో సమస్యకు పరిష్కారం
పదికాలాలు గుర్తుండేలా గాంధీ పార్కులోకి మార్పు



గాంధీ పార్కులోకి మార్చిన రావిచెట్టు వద్ద పూజలు చేస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరంలోని వందేళ్ల చరిత్ర కలిగిన రావి చెట్టు తొలగింపు శనివారం వివాదాలకు దారితీసింది. స్థానిక మంగమూరు రోడ్‌లోని గాయత్రి మందిరం వద్ద హిందువులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఆరాధిస్తూ, పూజించే రావి చెట్టును కార్పొరేషన్ అధికారులు తొలగించడం పట్ల ఆర్ఎస్ఎస్ ఆందోళనకు దిగింది. అయితే ప్రజా ప్రయోజనం కోసం, హిందువుల మనోభావాలు దెబ్బతినకుండా తిరిగి గాంధీ పార్కులో నాటడంతో ఆందోళన ముగిసింది. వివరాల్లోకెళితే.. ఒంగోలులోని మంగమూరు రోడ్‌లో వందేళ్లకు పైగా ఉన్నటువంటి రావిచెట్టుకు విశేష చరిత ఉంది. ఎంతో ప్రాశస్త్యం పొందిన ఈ చెట్టు వద్ద పూజలు చేసుకునేవారు. ఒంగోలు నగరానికి మంగమూరు రావి చెట్టు ల్యాండ్ మార్కుగా కూడా చెప్పుకునేవారు అయితే నగరంలో రోడ్‌లు విస్తరణలో భాగంగా ఒంగోలు కార్పొరేషన్ అధికారులు శుక్రవారం రాత్రి తొలగించి, శనివారం ఉదయం చెట్టు తిరిగి చిగురించేలా. మరో వందేళ్ళు బతికేలా అధికారులు సమీపంలోని గాంధీపార్కులో తిరిగి నాటారు. దీనిని వ్యతిరేకించిన ఆర్ఎస్ఎస్, విశ్వ హిందూ పరిషత్‌తోపాటు మరికొందరు కార్పొరేషన్ అధికారుల తీరును వ్యతిరేకిస్తూ నిరసనకు దిగారు. తిరిగి అదే ప్రాంతంలో మరో మొక్కను నాటాలని డిమాండ్ చేశారు. దీంతో విషయాన్ని కొందరు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆ ప్రాంతానికి చేరుకున్న ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడారు. రావి చెట్టు తొలగించడం పట్ల ఎమైనా ఇబ్బందులు ఎదురవుతాయోమో పరిశీలన చేయాలని ఆదేశించారు. ఇదే సమయంలో ఆందోళనకారులతో మాట్లాడిన ఎమ్మెల్యే దామచర్ల నగర అభివృద్ధికి సహకరించాలని, ప్రజా ప్రయోజనం కోసం అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారని వివరించారు. రావిచెట్టు చరిత్ర మాసిపోకుండా తిరిగి గాంధీ పార్కులో వేదపండితుల మంత్రోచ్ఛరణలతో శాస్త్రోక్తంగా అధికారులు నాటినట్లు వారికి వివరించారు. ఇదే సమయంలో నగరానికి చెందిన వేద పండితులు మఠంపల్లి దక్షిణామూర్తిని కూడా పిలిపించి మాట్లాడారు.

ఎవరికీ ఇబ్బంది లేకుండా చర్యలు - ఎమ్మెల్యే దామచర్ల

ఎమ్మెల్యే దామచర్ల మీడియాతో మాట్లాడుతూ రావి చెట్టు తొలగించిన విషయం మొదటగా తనకు తెలియదని ఎమ్మెల్యే దామచర్ల తెలిపారు. దీనిపై కొందరు తనకు నేరుగా ఫోన్ చేసి చెప్పగా, కమిషనర్‌తో మాట్లాడి జరిగిన విషయాన్ని తెలుసుకున్నానన్నారు. చరిత్ర కలిగిన రావి చెట్టును తొలగించడం పట్ల ఎదురయ్యే ఇబ్బందులను ప్రముఖ వేదపండితులలో మాట్లాడానని దామచర్ల వివరించారు. అలాగే చెట్టును పూర్తిగా తొలగించడం లేదని, తిరిగి మరోచోట మార్పు మాత్రమే చేశామన్నారు. ప్రజలు ఆందోళన పడాల్సిన అవసరం లేదని తెలిపారు. ప్రజా ప్రయోజనం దృష్ట్యా మాత్రమే రహదారులు విస్తరణ జరుగుతుందని, గాయత్రి మందిరం వద్ద తొలగించిన రావిచెట్టును సమీపంలోని 40 మీటర్లలో గాంధీ పార్కులోకి మార్చామన్నారు. అంతే కాకుండా చెట్టు వద్ద యధావిధిగా భక్తులు పూజలు చేసుకునేందుకు అవసరమైన సౌకర్యాలు చేయాలని కార్పొరేషన్ అధికారులకు ఆదేశించినట్లు తెలిపారు. పార్కులోకి మార్పు చేసిన చెట్టు వద్ద వేదపండితులతో హోమం నిర్వహించి, భక్తులకు అన్న ప్రసాదాలు ఏర్పాటుతో పూర్వ వైభవం తీసుకొస్తున్నట్లు దామచర్ల తెలిపారు.

రావిచెట్టు మార్పుతో ఏలాంటి ఇబ్బందులు రావు

- మఠంపల్లి దక్షిణామూర్తి, వేదపండితులు

మొక్కను తొలగించడం వలన ఎలాంటి అరిష్టం లేదని వేదపడింతులు మఠంపల్లి దక్షిణామూర్తి తెలిపారు. మొక్కను పూర్తిగా తొలగించినందున ఏమీ కాదని తెలిపారు. అయితే దానిని తిరిగి నాటి జీవం పోస్తుండటంతో భావి తరాలకు మరింత గుర్తింపుగా చరిత చాటుకుటుందని దక్షిణమూర్తి వివరించారు. ఇలాంటి విషయాల్లో అపోహలు వీడాలని, రావిచెట్టు మార్పుపై అపోహలు వీడాలని ఆయన తెలిపారు. శాస్త్రం ప్రకారం జరిగే కార్యక్రమాలు ప్రజలకు మేలు చేస్తాయని ఆయన అన్నారు.



విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకుంటున్న ప్రెస్ అకాడమీ చైర్మన్ సురేష్, ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడు సుబ్బారావు, సీనియర్ జర్నలిస్టులు

బోడపాడు పాఠశాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించిన ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి

మార్కాపురం రూరల్, ఆగస్టు30 (ఆంధ్రజ్యోతి) : బోడపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను స్ఫూర్తిగా తీసుకోవాలని ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ అన్నారు. మండలంలోని బోడపాడు ఎంపీపీ పాఠశాలను శనివారం ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, సీనియర్ జర్నలిస్టులు శ్రీశైలం రమేష్, డీ సోమసుందరం సందర్శించారు. విద్యార్థులతో ముచ్చటించి, వారి సామర్థ్యాలను గుర్తించారు. ఉపాధ్యాయుడు పీ శ్రీనివాసులు బోధన తీరును వివరించారు. విద్యార్థుల ప్రతిభ, నోటు పుస్తకాలను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను గొప్పగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులను అభినందించారు. గ్రామీణ ప్రభుత్వ పాఠశాలలో నో అడ్మిషన్ బోర్డు పెట్టడం స్ఫూర్తి దాయకమకమని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శేఖర్‌రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఐఈసీఈఈ కామన్ ఎంట్రన్స్ టెస్టులో దోర్నాల విద్యార్థినికి ర్యాంక్



అంజన షణ్ముఖ ప్రియ

పెద్ద దోర్నాల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : 2025 కామన్ ఎంట్రన్స్ టెస్టులో దోర్నాల మండలం రామ చంద్రకోట గ్రామ విద్యార్థిని కర్రా అంజన షణ్ముఖ ప్రియ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించింది. ఇంటర్ అర్హతతో ఇంటిగ్రేటెడ్ డిగ్రీ, పీజీ ప్రవేశాల కోసం దేశవ్యాప్తంగా నిర్వహించిన ఎస్‌సీఈఆర్‌టీ ఆర్ ఐఈసీఈఈ కామన్ ఎంట్రన్స్ టెస్టు పరీక్షా ఫలితాలలో అంజన షణ్ముఖ ప్రియ రాణించారు. ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ ఫిజిక్స్, ఎమ్మెస్సీ కెమెస్ట్రీ, ఎంఎస్‌సీ మ్యాథమెటిక్స్ మూడు విభాగాల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంకుతో పాటు ఇంటిగ్రేటెడ్ బీఈడీ ఫిజికల్ సైన్స్‌లో స్టేట్ రెండవ ర్యాంకు, ఆల్ ఇండియా 24వ ర్యాంకు, ఇంటిగ్రేటెడ్ బీఈడీ జనరల్ విభాగాల్లో స్టేట్ 2వ ర్యాంక్, ఆల్ ఇండియా 25వ ర్యాంక్‌ను సాధించింది. దీంతో వసంత జూనియర్ కళాశాల యాజమాన్యం, అధ్యాపక సిబ్బంది అంజనను అభినందించారు. విద్యార్థిని తల్లి కర్రా మంగమ్మ పీజీటీ తెలుగు ఉపాధ్యాయిని, తండ్రి సుబ్బారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకునిగా పని చేస్తున్నారు.

6 వరకు ఇంటర్మీడియెట్ గుర్తింపు ఫీజుకు గడువు

ఒంగోలు విద్య, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత విద్యా సంవత్సరంలో జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో చేరిన విద్యార్థులు వచ్చేనెల 6వతేదీ వరకు ఇంటర్మీడియెట్ బోర్డుకు గుర్తింపు ఫీజు చెల్లించాలి. ఈ మేరకు ఇంటర్ విద్యా కార్యదర్శి కృతికా శుక్లా ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో రూ. 200గా ఉన్న గుర్తింపు ఫీజును ఈ సంవత్సరం నుంచి రూ. 225కు పెంచారు. ఇంటర్మీడియేట్, ఒకేషనల్ విద్యార్థులకు వేర్వేరుగా ఈ గుర్తింపు ఫీజు చెల్లించాలి. విద్యార్థి వివరాలను కళాశాల ప్రిన్సిపాళ్లు క్షుణ్ణంగా పరిశీలించి విద్యార్థి ఫొటో, సంతకంను ఇంటర్మీడియెట్ బోర్డు పోర్టర్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.



సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ దామోదర్

త్వరితగతిన కేసులను పరిష్కరించాలి

● స్టేషన్ తనిఖీలో ఎస్పీ దామోదర్

తర్లుపాడు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశించారు. తర్లుపాడు పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల్లో పురోగతి ఉండాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. స్టేషన్‌లోని డ్రోన్ కెమెరాలను ఉపయోగించి నేరాలు జరగకుండా చూడాలన్నారు. రాత్రివేళ ముమ్మరంగా గస్తీ నిర్వహించాలన్నారు. విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించేవారిపై చర్యలు తీసుకోవాలని, పాతనేరస్థుల కదలికలపై నిఘా ఉంచాలని అన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా, స్నేహపూర్వకంగా మెలగాలని ఎస్పీ సూచించారు. ఆయనతోపాటు ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ కె.రాఘవేంద్ర, ఎస్ఐ బ్రహ్మనాయుడు, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎస్పీ

పొదిలి : ఎస్పీ దామోదర్ పొదిలి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం స్టేషన్‌లో పని చేస్తున్న సిబ్బంది కుటుంబాలను పలుకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనవెంట దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ వేమన ఉన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

టెలీకాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జి డీపీవో వెంకటేశ్వరరావు



ఇన్‌చార్జి డీపీవోగా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న ఒంగోలు ఎంపీడీవో, ఇతర అధికారులు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) :జిల్లాలో వర్షాలు పడుతున్నందున గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని జిల్లా ఇన్‌చార్జి పంచాయతీ అధికారి ఎం. వెంకటేశ్వరరావు ఆదేశించారు. శనివారం డీపీవో కార్యాలయం నుంచి డీఎల్‌పీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఎక్కడా పారిశుధ్య లోపం లేకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. అందుకోసం ప్రణాళికాబద్ధంగా పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీకార్యదర్శులను సమన్వయం చేసుకొని పనుల నిర్వహణలో ఎలాంటి లోపం లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర ఉత్తమ పంచాయతీలకు ప్రతిపాదనలు పంపాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఆయా పంచాయతీలను ఉత్తమ పంచాయతీలుగా ఎంపికచేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు వెంటనే అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీల్లో పనిచేస్తున్న క్లాప్‌మిత్ర(కార్మికులు)లకు జీతాలు పెండింగ్ లేకుండా చూడాలన్నారు.ఏఏ గ్రామ పంచాయతీల్లో క్లాప్ మిత్రాలకు జీతాలు పెండింగ్‌లో ఉన్నాయో గుర్తించి వారికి సకాలంలో వేతనాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో పొడిచెత్త, తడిచెత్తపై ప్రభుత్వం ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజాభిప్రాయం సేకరణ చేపడుతున్నందున ఆయా గ్రామాల్లో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఇంటిపన్నులతో పాటు వివిధ రకాల పన్నులు చెల్లించే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆయా పన్నులన్నింటిని ఆన్‌లైన్ ద్వారానే ప్రజలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాగా ఇన్‌చార్జి డీపీవోగా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వరరావును ఒంగోలు డీఎల్‌పీవో పద్మ, ఒంగోలు ఎంపీడీవో రాజశేఖర్, డిప్యూటీ ఎంపీడీవో బాలచెన్నయ్యతో పాటు కార్యాలయ సిబ్బంది అభినందించారు.

జిల్లాలో 6.4 మి.మీ. వర్షపాతం నమోదు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పలు మండలాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. శనివారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో 6.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఒంగోలు రూరల్ మండలంలో 39.4, ఒంగోలు అర్బన్‌లో 39.4, సంతనూతలపాడు మండలంలో 21.8, మద్దిపాడులో 14.8, కొత్తపట్నంలో 14.2, పొన్నలూరులో 10.2మి.మీ. వర్షపాతం నమోదైంది. మరో 20 మండలాల్లో 12 మి.మీ. నుంచి 9.0 మి.మీ.వరకు వర్షపాతం నమోదైంది.



ఘనంగా అంకమ్మతల్లి నాలుగో వార్షికోత్సవం

అధికసంఖ్యలో పాల్గొన్న చెన్నుపాటి వంశస్థులు

ఇంకొల్లు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని దుద్దుకూరు గ్రామంలో చెన్నుపాటి వారి వంశదేవర శ్రీఅంకమ్మతల్లి అమ్మవారి చతుర్ధ వార్షికమహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవం సందర్భంగా అమ్మ వారికి అభిషేకం నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. వార్షిక మహోత్సవంలో విజయవాడ 8వ డివిజన్ కార్పొరేటర్ చెన్నుపాటి క్రాంతిశ్రీ, 9వ డివిజన్ కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, విజయవాడకు చెందిన టీడీపీ నాయకులు చెన్నుపాటి గాంధీ, ఒంగోలు 37వ డివిజన్ కార్పొరేటర్ చెన్నుపాటి వేణుగోపాల్, పెనమలూరు, పోరంకి, తాడిగడప, విజయవాడ పడమట, గుంటూరు, ఉప్పలపాడు, పల్లపాడు, గార్లపాడు, వరగాని, కారంచేడు, అన్నంబొట్లవారిపాలెం, రావినూతల, ధైవాలరావూరు, మట్టిగుంట, తాటివారిపాలెం, దుద్దుకూరు, ఒంగోలు, టంగుటూరుకు చెందిన వందలాదిమంది చెన్నుపాటి వంశస్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు.

5లోపు దరఖాస్తులు చేసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా పరిధిలోని వయోజన విద్యాశాఖలో ఒక సూపర్ వైజర్ ఉద్యోగం కోసం ప్రభుత్వ ఉపాధ్యాయులు వచ్చేనెల 5వతేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని జాయింట్ కలెక్టర్, వయోజన విద్య జిల్లా ఎంపిక కమిటీ చైర్మన్ గోపాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సెకండరీ గ్రేడ్, వ్యాయామ, గ్రేడ్-2 పండిట్ ఉపాధ్యాయులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కనీసం పది సంవత్సరాల సర్వీసు పూర్తి చేసి ఉండాలని, 45 ఏళ్ల వయస్సు ఉండాలని, గతంలో ఎంఎల్‌వో, ఎంఆర్పీ, ఎస్ఆర్‌జీ, డీఆర్‌జీలుగా పనిచేసిన ఉపాధ్యాయులకు, అదనపు విద్యార్హతలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు.

ప్రభుత్వ అక్షరాస్యత కార్యక్రమాల్లోనూ, కళాజాత/సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ అనుభవం ఉన్న వారికి ఎక్కువ అవకాశం ఉంటుందని తెలిపారు. పోస్టు ఫారెన్ సర్వీసు నిబంధనలకు లోబడి ఒక ఏడాది కాల వ్యవధికలిగి ఉంటుందని తెలిపారు. దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు వచ్చే నెల 9వతేదీన ఎంపిక కమిటీ ఇంటర్వ్యూలు నిర్వహిస్తుందని జేసీ గోపాలకృష్ణ తెలిపారు.

నాలుగు సొసైటీలకు పీఐసీ కమిటీల నియామకం

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని నాలుగు ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ(పీఏసీఎస్)లకు పీఐసీ కమిటీలను నియమిస్తూ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సింగన్నపాలెం సొసైటీ పీఐసీ చైర్మన్‌గా కోయ్య శివరామకృష్ణ, సభ్యులుగా మందలపు పూర్ణయ్య, కొర్రపాటి హనుమంతరావు, అలాగు యర్రగొండపాలెం సొసైటీ చైర్మన్‌గా వై.వీరయ్య, సభ్యులుగా బిక్కి చిన్నారావు, నక్క వెంకటేశ్వర్లు, సంజీవరావుపేట సొసైటీ చైర్మన్‌గా ముచ్చుకుంట్ల రామసుబ్బయ్య, సభ్యులుగా బొమ్మినేని వెంకటేశ్వర్లు, సనగాని వెంకట ప్రతాప్‌రెడ్డి, రామాపురం సొసైటీ చైర్మన్‌గా భవనం పుల్లారెడ్డి, సభ్యులు బోగోలు నారాయణ, మదిర ఈశ్వరరెడ్డిలను నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.



నాటుబాంబు నోటిలో పేలడంతో మృతిచెందిన కుక్క

నాటుబాంబును నోట పట్టుకొచ్చిన కుక్క

● పేలడంతో మృత్యువాత
● గోగులదిన్నెలో గ్రామంలో కలకలం

మార్కాపురం రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోగులదిన్నె గ్రామంలో ఎస్సీ కాలనీలో శనివారం నాటు బాంబు కలకలం రేపింది. వీధి కుక్క నోటితో బాంబును పట్టుకోగా అది పేలడంతో తల పేలిపోయి చనిపోయింది. దీంతో గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. పొలాల్లో పందుల రక్షణ కోసం పెట్టిన నాటుబాంబును కుక్క పట్టుకురావడంతో పేలిపోయి ఉంటుందని భావిస్తున్నారు. ఈ ఘటనపై రూరల్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

నేడు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి రెండు రోజుల పాటు నగరంలో జరిగే పలు కార్యక్రమాలకు హాజరుకానున్నారు. ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు స్థానిక రామనగర్‌లోని తన కార్యాలయంలో ఉంటారు. అనంతరం జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. సోమవారం కూడా నగరంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు.

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న యూనివర్సిటీ అధికారులు, విద్యార్థులు

ఒంగోలు విద్య, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆంధ్రకేసరి యూనివర్శిటీలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నిర్మలామణి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో యూనివర్శిటీ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచడటంతో పాటు విరివిగా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ జి.రాజమోహనరావు, వైస్‌ప్రిన్సిపాల్ జి.సోమశేఖర్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ఎం.హర్షిప్రీతమ్‌దేవ్‌కుమార్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్‌కు సత్కారం


శకుంతలను సత్కరిస్తున్న ఎంపీడీవో సురేష్‌బాబు

సంతనూతలపాడు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు మండలపరిషత్ కార్యాలయంలో గత మూడేళ్ల నుంచి సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శకుంతల ఉద్యోగోన్నతిపై బదిలీ అవుతున్న సందర్భంగా శనివారం ఎంపీడీవో డి.సురేష్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది ఘనంగా సత్కరించారు. పర్చూరు మండలపరిషత్ కార్యాలయానికి అడ్మినిస్ట్రేషన్ అధికారిగా ఆమె బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా శకుంతల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పంచాయతీ కారుదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులకు హెచ్ఐవీపై అవగాహన

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని సూర్య స్కూలులో శనివారం జిల్లావైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ విభాగం, గ్రో ఆర్గనైజేషన్ సీసీ ప్రాజెక్టు ఆధ్వర్యంలో హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు మేనేజర్ షేక్ పీరుబాషా హెచ్ఐవీ వ్యాప్తి, లక్షణాలు, రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం బీవీఆర్.శాస్త్రి, ఉపాధ్యాయుడు సిద్ధ లింగయ్య, సిబ్బంది వెంకట్రావు, బ్రాహ్మణ, అరుణ పాల్గొన్నారు.

మిగులు టీచర్లను సర్దుబాటు చేయాలి

ఒంగోలు విద్య, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎయిడెడ్ పాఠశాలల్లో మిగులుగా తేలిన టీచర్లను ప్రభుత్వ పాఠశాలలకు సర్దుబాటు చేయాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.వెంకట్రావు, సీహెచ్.ప్రభాకర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. 15 ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థులు లేక టీచర్లు మిగులుగా తేలారన్నారు. ఈ ఉపాధ్యాయులకు జిల్లా స్థాయిలో కౌన్సెలింగ్ నిర్వహించి శాశ్వత ప్రాతిపదికన ప్రభుత్వ పాఠశాలల్లో నియమించాలని వారు పేర్కొన్నారు.

బాల్య వివాహాలను నివారించాలి



అవగాహన కల్పిస్తున్న బాలకాశమ్మ

సంతనూతలపాడు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): బొడ్డువారిపాలెంలో శనివారం బంగారుబాల్యంపై సోషల్ వర్కర్ ఎస్.బాలకాశమ్మ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్యవివాహాలు నివారించాలని, బాలలను పనుల్లో లేకుండా చూడాలని తెలిపారు. బాలికల పట్ల తల్లిదండ్రులు ప్రేమతో, స్నేహపూర్వకంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలను బడుల్లో చేర్పించేవిధంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆశా, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

గణేశ్ లడ్డూ రూ.1.26లక్షలు


లడ్డూతో సుధీర్‌బాబు

చీమకుర్తి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి మండలం ఏలూరివారిపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన లడ్డూకి శనివారం రాత్రి వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణ సుధీర్‌బాబు లడ్డూని రూ.1.26లక్షలకు వేలంలో దక్కించుకున్నారు. అనంతరం ఊరేగింపు నిర్వహించారు. అదేవిధంగా మైలవరం గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద లడ్డూను కర్లపూడి సుబ్రహ్మణ్యం, రమాదేవి దంపతులు రూ.25వేలకు దక్కించుకున్నారు.

మూగజీవుల సంరక్షణ అందరి బాధ్యత


సదస్సులో మాట్లాడుతున్న దివ్య

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిలో భాగమైన మూగజీవుల సంరక్షణ ప్రతి ఒక్కరికి బాధ్యతని సేవ్ ది యానిమల్ ఫౌండేషన్ ప్రతినిధి దివ్య కోరారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఒంగోలులోని ఏకేవీకే కళాశాలలో జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. వీధి జంతువుల పట్ల జాలి, కరుణ కలిగి ఉండాలన్నారు. పశువైద్యశాల ఉపసంచాలకులు జగన్‌శ్రీనివాస్ మాట్లాడుతూ రోడ్ల మీద పడేస్తున్న ప్లాస్టిక్ కవర్లు ఆవులు తినడం వల్ల అధిక సంఖ్యలో మృతి చెందుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులకు జంతువుల పట్ల ఎలా ఉండాలో వీడియో ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఒంగోలు పశువైద్యశాల సహాయ సంచాలకులు సురేంద్రప్రసాద్, రిటైర్డ్ సహాయ మునిసిపల్ కమిషనర్ వీరాంజనేయులు, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ మారెళ్ళ సుబ్బారావు, పసుపులేటి శ్రీనివాసరావు, జంతుప్రేమికులు కోనూరి శ్రీదేవి, చెరుకూరి ఆదిలక్ష్మి, సుజాతరావు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

వామ్మో.. మర్రిపూడి గ్రంథాలయం!

- కూలేందుకు సిద్ధంగా ఉన్న భవనం
- తడిసి ముద్దవుతున్న పుస్తక సంపద
- లోపలికి అడుగుపెట్టేందుకు జంకుతున్న పాఠకులు


శిథిలావస్థకు చేరిన గ్రంథాలయం

మర్రిపూడి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలు. విలువైన పుస్తక సంపద చారిత్రక సాక్ష్యాలకు ప్రతీకలు. ఎందరో నిరుద్యోగ యువకులకు విజ్ఞాన జ్యోతులు వెలిగించిన పురాతన గ్రంథాలయం నేడు శిథిలావస్థకు చేరింది. మండల కేంద్రమైన మర్రిపూడిలో 65 ఏళ్ల క్రితం ఆనాటి గ్రామ పెద్దలు ముందుచూపుతో యువతి, యువకులకు విజ్ఞాన కాంతులు పంచాలనే ఉద్దేశంతో నెహ్రూ పుస్తక బాండాగారాన్ని ఏర్పాటు చేశారు. అత్యంత విలువైన పుస్తక సంపదను సేకరించి భద్రపరిచారు. విలువైన టేకు కలపతో బీరువాల్లో భద్రపరిచారు. ఎన్నో పురాతన ఇతిహాసాలు సాంఘిక నవలలు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించే సంచికలను భద్రపరిచారు. గ్రామానికి చెందిన వందలాది మంది నిరుద్యోగ యువకులు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకొని పలు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులుగా స్థిరపడ్డారు. ఎన్టీఆర్ సారథ్యంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత తెలుగు విజ్ఞాన సమాచార కేంద్రాలను ప్రతి మండల కేంద్రాల్లో ఏర్పాటు చేశారు. అప్పట్లో గ్రామ పెద్దలు నెహ్రూ పుస్తక బాండాగారానికి సంబంధించిన సొంత భవనాన్ని విలువైన పుస్తక సంపదను ఖరీదైన టేకు ఫర్నీచర్‌ను జిల్లా గ్రంథాలయ సంస్థకు అప్పగించారు. గత 40 ఏళ్లగా తెలుగు విజ్ఞాన సమాచార కేంద్రం 60 ఏళ్ల క్రితం నిర్మించిన పురాతన భవనంలోనే కొనసాగుతోంది. దివంగత మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు హయాంలో భవనాన్ని ఆదునికీకరించారు. అప్పటి నుంచి మరమ్మతులు చేపట్టకపోవడంతో భవనం పైకప్పు, దంతెలు పూర్తిగా విరిగిపోయాయి. పైకప్పుకు వేసిన నాపరాళ్లు మొతకబారి ముక్కలై పాఠకులపై పడుతున్నాయి. దీంతో అడపాదడపా వచ్చే పాఠకులు సైతం గ్రంథాలయం లోపలికి రావాలంటే భయపడిపోతున్నారు. వరండాలోనే కాలక్షేపం చేసి వెళుతున్నారు. కొద్దిపాటి వర్షానికే వర్షపు నీరు భవనంలోకి చేరుతుంది. దీంతో విలువైన పుస్తక సామగ్రి తడిసి పాడైపోతోంది. ఇప్పటికే వందలాది పుస్తకాలు చెదలుపట్టి పాడైపోయాయి. కనీసం పైకప్పు తొలగించి పాతగోడల పైనే శ్లాబు ఏర్పాటు చేయాలని స్థానికులు ఎన్నోరోజుల నుంచి కోరుతున్నారు. ఆరు నెలల క్రితం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పలువురు సభ్యులు గ్రంథాలయం దుస్థితిని ఎంపీపీ వాకా వెంకట రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన రూ.3 లక్షలతో పైకప్పు శ్లాబు వేసేందుకు మండల పరిషత్ సాధారణ నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో ఏక్షణమైనా గ్రంథాలయ భవనం కూలిపోయో ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.


దంతెలు విరిగి కూలేందుకు సిద్ధంగా ఉన్న పైకప్పు


హౌసింగ్‌బోర్డులోని వినాయక విగ్రహం వద్ద పూజల్లో పాల్గొన ఎమ్మెల్యే జనార్దన్


కరెన్సీతో అలంకరించిన గణేషుడి విగ్రహం వద్ద భక్తుల పూజలు

విఘ్నేశ్వరా.. కరుణించవా..!

- వేడుకగా గణేషుడి నవరాత్రులు
- స్వామివార్లను దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు
- పలుచోట్ల ఎమ్మెల్యే దామచర్ల పూజలు

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం నగరంలోని చలువపందిళ్లల్లో కొలువు తీరిన గణనాథుడి విగ్రహాలకు భక్తులు విశేష పూజలు చశారు. ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహణ కమిటీ ప్రతినిధులు ఏర్పాటు చేస్తున్న కార్యక్రమాలను కనుల విందుగా జరుగుతున్నాయి. పలు ప్రాంతాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్నారులు డ్యాన్సులతో అలరించగా, మరికొన్ని ప్రాంతాలలో కొలువు దీరిన భారీ విగ్రహాలను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరుతున్నారు. పలు చోట్ల పందిళ్ల వద్ద అన్నదానం నిర్వహించారు. ఇదిలా ఉండగా నాల్గవరోజు శనివారం మేళతాళాలతో ఊరేగింపుగా విగ్రహాలను నిమజ్జనం చేశారు. అలాగే ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ అన్నవరప్పాడు 4వ లైను, కర్నూల్ రోడ్ గాయత్రి కాంప్లెక్స్, రత్నం డైమండ్ టవర్స్, సమతానగర్, శ్రీనివాస కాలనీ, వెంకటేశ్వరకాలనీలోని రామాలయం వద్ద, హౌసింగ్ బోర్డు కాలనీలోని పార్కు వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను దర్శించుకుని పూజలు నిర్వహించారు.

ఎనికపాడులో ఎమ్మెల్యే బీఎన్...

సంతనూతలపాడు: ఎనికపాడు గ్రామంలో నల్లూరి లింగయ్యచౌదరి సొంత నిధులతో నిర్మించిన టీడీపీ కార్యాలయంలో గ్రామ తెలుగు యువత ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద శనివారం రాత్రి జరిగిన పూజలకు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ్‌కుమార్, మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబును స్థానిక నాయకులు సత్కరించారు. అనంతరం భారీగా అన్నదానం జరిగింది. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బీఎన్



నగరంలో ఆకట్టుకుంటున్న గణేషుడి విగ్రహాలు


నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

టిప్పర్‌ను ఢీకొని కారు బోల్తా

- ఇరువురికి స్వల్ప గాయాలు


రోడ్డుపై అడ్డంగా బోల్తా కొట్టిన కారు

ఒంగోలు క్రైం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): టిప్పర్‌ను వెనుక నుంచి కారు ఢీకొట్టి వెనువెంటనే బోల్తా పడింది. ఈ సంఘటన ఒంగోలులోని పాలకేంద్రం సమీపంలో కర్నూల్ రోడ్డుపై జరిగింది. ఒంగోలు నుంచి చీమకుర్తి వెళుతున్న టిప్పర్‌ను వెనుక వైపు నుంచి వేగంగా వెళ్ళి కారు ఢీ కొట్టింది. దీంతో టిప్పర్ వెనుక భాగంలో తగలడంతో కారు బోల్తా పడింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న డోకల గోరు నాయుడు, అశ్వని భరద్వాజ్‌లకు స్వల్పగాయాలు కాగా క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ట్రాఫిక్‌కు ఆటకం లేకుండా కారును రోడ్డు మీద నుంచి పోలీసులు పక్కకు తొలగించారు.

ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగుల ఇబ్బందులను తొలగించాలి


ఆర్ఎం సత్యనారాయణకు వినతిపత్రాన్ని అందజేస్తున్న కాలేషా

ఒంగోలు కార్పొరేషన్ ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించేలా చర్యలు తీసుకోవాలని నవ్యాంధ్ర దివ్యాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ కాలేషా కోరారు. శనివారం ఒంగోలులో ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సత్యనారాయణను కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు కేటాయించిన సీట్లలో సాధారణ ప్రయాణికులు కూర్చుంటున్నారని, దీంతో దివ్యాంగులు నిలబడి ప్రయాణం చేయాల్సి వస్తుందని తెలిపారు. దివ్యాంగులు తమ సీట్లు తమకే ఇప్పించాలని బస్సులోని కండక్టర్లకు చెప్పినా పెడచెవిన పెడుతున్నారని ఫిర్యాదు చేశారు. కొన్ని బస్సుల్లో దివ్యాంగులకు కేటాయించిన సీట్లపై బోర్డులు లేవన్నారు. దీనిపై స్పందించిన ఆర్ఎం, ఆయా అంశాలపై తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ఆర్అండ్‌డీ సెల్ ప్రారంభం

సంతనూతలపాడు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఎండ్లూరు డొంకవద్ద నున్న ఆర్జీయూకేటీ ఒంగోలు క్యాంపస్‌లో శనివారం ఆర్ అండ్ డీ(హైయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ కాంపిటేటివ్‌సెల్, రీసెర్చ్ అండ్ డెవలెప్‌మెంట్)ను విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ అమరేంద్రకుమార్ సాండ్రా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు, పోటీ పరీక్షల మార్గదర్శకతను అందిస్తుందన్నారు. పరిశోధనాత్మక కార్యకలాపాలు నిర్వహించే ఆవిష్కరణలకు వేదిక అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏవో ఎన్.చంద్రశేఖర్, డిప్యూటీ ఏవో రూపాస్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి ఫ్రీజర్ వితరణ


ఫ్రీజర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల, డాక్టర్ విజయరాఘవరావు

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్‌కు) నగరానికి చెందిన ప్రముఖ వైద్యుడు సింగు విజయరాఘవరావు ఫ్రీజర్‌ను బహూకరించారు. శనివారం ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చేతులమీదుగా దానిని జీజీహెచ్ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ జీజీహెచ్ అభివృద్ధి కోసం సౌకర్యాల కల్పనకు విజయరాఘవరావు ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో దాతలు ముందుకు రావాలని, పేదల ఆసుపత్రి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. అలాగే త్వరలోనే జీజీహెచ్ అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేస్తామని, అందుకు సంబంధించిన పేర్లు ప్రతిపాదించాలని అధికారులకు ఆదేశించినట్లు తెలిపారు. త్వరలోనే ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలు, అభివృద్ధికి హాస్పిటల్ డవలప్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. డాక్టర్ విజయరాఘవరావు మాట్లాడుతూ ఫ్రీజర్ హిమోఫీలియా వ్యాధిగ్రస్తులకు అందించే మందుల నిల్వకు మరింత ఉపయోపడతుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ తిరుపతిరెడ్డి, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ మాధవీలత, డిప్యూటీ ఆర్ఎంవో డాక్టర్ చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ భూములపై సీఐడీ విచారణ

కనిగిరి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): కనిగిరి ప్రాంతంలో అన్యాక్రాంతమైన అగ్రిగోల్డ్ భూముల స్థితిగతులపై శనివారం సీఐడీ బృందం పరిశీలించారు. సీఐడీ డీడీ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు కనిగిరి, హనుమంతునిపాడు, పామూరు, వెలిగండ్ల, సీఎస్‌పురం మండలాల్లోని వివిధ గ్రామాల్లోని అగ్రిగోల్డ్ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐడీ సీఐ తిరుమలరావు మాట్లాడుతూ భూ రికార్డుల ప్రకారం క్షేత్రస్థాయిలో ఎంత భూమిలో సాగు చేపట్టారు, ఆక్రమణలో ఎవరున్నారనే వివరాలను సేకరించినట్టు చెప్పారు. అగ్రిగోల్డ్ అస్తులపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐడీ ఎస్ఐ విద్యాసాగర్, హెడ్‌కానిస్టేబుల్ నాగేశ్వర రావు, వీఆర్వో శివశంకర్, సర్వేయర్ రజాక్ తదితరులు పాల్గొన్నారు.


అగ్రిగోల్డ్ భూములను పరిశీలిస్తున్న సీఐడీ ఎస్ఐ విద్యాసాగర్

పబ్లిక్ నోటీసు

ప్రకాశం జిల్లా, టంగుటూరు మండలం, వల్లూరు గ్రామ కాపురస్తురాలు **కుందం చంద్రశేఖరరెడ్డి గారి భార్య కుందం శ్రీదేవి గారు** మాకు ఇచ్చిన సంజాయిషీ మేరకు యావన్మంది ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలియజేయునది ఏమనగా...

నా క్లయింటు ఈ దిగువ షెడ్యూలు ధాఖలా ఆస్తిని, వారి అత్తగారయిన **కుందం ఇందిరమ్మ గారు** ఒంగోలు సబ్ రిజిష్టారు వారి ఆఫీసులో రిజిష్టరు కాబడిన సెటిల్‌మెంటు **దస్తావేజు నెం.7892/2018** ద్వారా పొంది సర్వసంపూర్ణ హక్కులతో అనుభవిస్తునారు. సదరు దస్తావేజునకు లింకు దస్తావేజు అయిన ఒంగోలు సబ్‌రిజిస్టారు వారి ఆఫీసులో రిజిష్టరు కాబడిన **దస్తావేజు నెం.2686/1980** ను పోగొట్టుకున్నారని, సదరు విషయమై టంగుటూరు పోలీసు వారికి పిర్యాదు ఇచ్చియున్నారని, సదరు పోలీసు వారు, సదరుపోయిన దస్తావేజు దొరకలేదని **30-8-2025** న సర్టిఫికేట్ ఇచ్చియున్నారు. ఈ క్రింది షెడ్యూలు ఆస్తిపై ఎవరికైనను ఏ విధమయిన హక్కులు గాని అభ్యంతరములు గాని లేదా సదరు దస్తావేజు దొరికిన ఎడల, లికితపూర్వకముగా తగిన దస్తావేజులతో స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని, ఈ నోటీసు ప్రచురించిన పది **(10) దినముల లోపు** ఈ క్రింది సంతకందారును సంప్రదించగలరు. లేని ఎడల ఎవరికి ఏ విదమైన అభ్యంతరములు, హక్కులు లేవని, పోయిన దస్తావేజు దొరక లేదని భావించి మా క్లయింటు ఈ క్రింది షెడ్యూలు ధాఖలా ఆస్తిపై లావాదేవీలు జరుపగలరు. గడువు తరువాత వచ్చు అభ్యంతరములు, మా క్లయింటును గాని, లావాదేవీలను గాని బద్దపరచజాలవని ఈ నోటీసు ద్వారా యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూలు: ప్రకాశంజిల్లా, ఒంగోలు స.రి. యిలాకా, టంగుటూరు మండలం, వల్లూరు గ్రామ పంచాయితీ వల్లూరు గ్రామ సర్వేనెం. 345/4బి రులో య.1-34 సెంట్లు వ్యవసాయ భూమికి **హద్దులు : తూర్పు:** అడ్డ కాలువ, **దక్షిణం:** చిరుమామిళ్ళ ప్రసాద్ గారి వ్యవసాయ భూమి. **పడమర:** రైలుకట్ట, **ఉత్తరం:** పల్లంరెడ్డి రాఘవరెడ్డి వగైరాల వ్యవసాయ భూమి. యీ హద్దులలోని య.1-34 సెంట్లు లేక 0.542 హెక్టార్లు భూమిన్నీ, యీ భూమి.

ఇట్లు: **చల్లా వెంకటప్పారెడ్డి, టి.చంద్రకళ**
న్యాయవాదులు, డోర్ నెం.46-139-63, 2వ లైన్, క్రిష్ణా నగర్, వెంకటేశ్వరస్వామి గుడి దగ్గర, సమతానగర్, ఒంగోలు, ప్రకాశం జిల్లా, సెల్:9848044909.

స్థలం: ఒంగోలు
తేది: 30.08.2025

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

- జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి


మాట్లాడుతున్న కిరణ్‌కుమార్‌రెడ్డి

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారు. సంఘం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం ఒంగోలు నగరం బందరురోడ్డులోని శారదాబాలకుటీర్ సచివాలయంలో రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాయల ఉద్యోగులు తమ సమస్యలను సంఘం దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన కిరణ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల సమస్యలను సంఘం రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేలా తనవంతు కృషి చేస్తానని తెలిపారు. అందువల్ల ఎలాంటి ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు ప్రభాకర్, గోపీ, వినయ్, వెంకటేష్, సురేష్, స్వాతి, అబ్బయ్య, అర్చన, మీనా, తిరుపతయ్య, వినయ్, సరిత తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ఉద్యోగుల సమస్యలపై రాష్ట్ర సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ మాట్లాడిన అంశాలను ఉద్యోగుల దృష్టికి తీసుకెళ్ళారు.

స్వామిత్వ సర్వేను వేగవంతం చేయాలి


స్వామిత్వ సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో రవికుమార్

నాగులుప్పలపాడు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): స్వామిత్వ సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీవో తేళ్ల రవికుమార్ సూచించారు. చదలవాడ గ్రామంలో జరుగుతున్న స్వామిత్వ సర్వేను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఖాళీ స్థలాలు, నివాస గృహాల వివరాలను కచ్చితత్వంగా సర్వేలో పొందుపరచాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌లతో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీపై అవగాహన కల్పించారు. ఇటీవల సదరమ్ పునఃపరిశీలన అనంతరం అనర్హత పొందిన దివ్యాంగులకు నోటీసులు జారీ చేశామని, నోటీసు అందుకొని అప్పీలు చేసుకొన్న వారికి యథావిధిగా పింఛను నగదు అందించాలని సూచించారు. కార్యక్రమంలో జూనియర్ సహాయకురాలు శకుంతల తదితరులు పాల్గొన్నారు.


ఆరోగ్యంపై జాగ్రత్తలు చెప్తున్న డాక్టర్ శరత్‌చంద్ర

వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలి

పొదిలి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ శరత్‌చంద్ర అన్నారు. శనివారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బుచ్చనపాలెంలో ముందస్తు జాగ్రత్త చర్యగా ఉచిత మెడికల్ క్యాంప్‌ను నిర్వహించారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి జ్వరాలు, లార్వ సర్వే చేశారు. ఈ సందర్భంగా జ్వర బాధితుల నుంచి రక్త నమూనాలను సేకరించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో నీటిని కాచి తాగాలన్నారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు.

వాన కురిసే.. కాడి కదిలే


మిరప నాట్లు వేస్తున్న వ్యవసాయ కూలీలు


జీవం పోసుకుని కళకళ లాడుతున్న పత్తి

- ముమ్మరంగా వ్యవసాయ పనులు
- విస్తృతంగా మిర్చి సాగు
- మరో వైపు పత్తి తీత
- తెరపి ఇవ్వగానే అపరాలకు సిద్ధం

పెద్ద దోర్నాల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు భూములు పదును ఎక్కడంతో మండలంలోని రైతులు కాడి మేడి పట్టి సేద్యం పనులు ముమ్మరం చేశారు. ఇప్పటికే పలువురు రైతులు సొంత భూముల్లో మిరప నార్లు పోసుకున్నారు. కొందరు షేడ్ నెట్లలో నార్లు పోయించారు. 40 రోజులు దాటడంతో ప్రధాన పొలంలో నాటేందుకు సిద్ధమయ్యారు. నిన్న, మొన్నటి వరకు వర్షాలు లేక రైతులు దిగాలు పడ్డారు. నారు ఏతకు వచ్చినా వర్షాలు కురవలేదు. బోరుబావుల్లో నీరు అడుగంటింది. ఏమి చేయాలో పాలు పోలేదు. సొంత భూముల్లో నార్లు పెంచిన రైతులు మరి కొన్నిరోజులు వేచి చూసే అవకాశం ఉంది. కానీ షేడ్ నెట్లలో పెంచిన నారు 45 రోజులు దాటితే యజమానులు నారు పోషణ చర్యలు పట్టించుకోరు. దీంతో చాలా మంది రైతులు ఆందోళన చెందారు. ఈలోగా వర్షాలు కురవడంతో నాట్లు వేస్తున్నారు. దీంతో కూలీలకు కూడా పనులు లభించడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరో ప్రక్క వేసవిలో, జూన్‌లో సాగు చేసిన పత్తి తీతలకు వచ్చింది. దాంతో వ్యవసాయ పనులు ఊపందకున్నాయి. ఇప్పటికైతే ఆలస్యంగా ఖరీఫ్ సీజను పూర్తి స్థాయిలో సాగు అవుతుంది. మండలంలో 700 ఎకరాల్లో పత్తి సాగవగా, 3,500 ఎకరాల్లో మిరప సాగయ్యే అవకాశం ఉందని రైతులు చెప్తున్నారు. మినుము 600ఎకరాలు, మొక్కజొన్న 800, ఆముదం 400, జొన్న 500 ఎక రాలు, శనగ 100ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉంది.

అల్లుకున్న ప్రమాదం..!

పొంచి ఉన్న ముప్పుపై ఆందోళన


బాలికల హాస్టల్ సమీపంలో స్తంభానికి అల్లుకున్న తీగ మొక్క

ఎర్రగొండపాలెం రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు, ప్రజలు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. పట్టణంలోని ప్రధాన, మార్కాపురం - మాచర్ల రహదారిలోని బాలికల వసతి గృహాన్ని ఆనుకొని ఉన్న కరెంట్ స్తంభం చూస్తే వణుకు పుట్టాల్సిందే. బాలికల వసతి గృహాన్ని అనుకొని ఉన్న స్తంభం చుట్టూ తీగమొక్కలు అల్లుకొని ఉన్నాయి. దీంతో ఏప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని బాలికలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారి, ఆర్‌అండ్‌బీ బంగ్లా, బాలికల వసతి గృహం వెంట ఈ సమస్య ఉన్నా విద్యుత్ అధికారులకు కనిపించడం లేదా అని ప్రశ్నిస్తున్నారు. ప్రమాదం జరుగకముందే స్తంభాలకు అల్లుకున్న మొక్కలను తొలగించాలని కోరుతున్నారు.

ఏవోగా జాఫర్ అలీబేగ్ బాధ్యతలు


అలీ బేగ్‌ను సత్కరిస్తున్న కార్యాలయ సిబ్బంది

పెద్దారవీడు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : పెద్దారవీడు ఎంపీడీవో కార్యాలయం ఏవోగా జాఫర్ అలీబేగ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జాఫర్ అలీబేగ్ ఏవోగా ఉద్యోగోన్నతి పొందారు. ఈ మేరకు ఎంపీడీవో జాన్‌సుందరం, కార్యాలయ సిబ్బంది జాఫర్ అలీబేగ్‌ను సత్కరించారు.



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్

విద్యార్థులకు ఉన్నత లక్ష్యాలు ఉండాలి

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్ననాటి నుంచే ఉన్నత లక్ష్యాలు ఏర్పరుచుకోవాలని సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ అన్నారు. స్థానిక రాక్‌వెల్ పాఠశాలలో స్టూడెంట్స్ కేబినెట్ ఓట్ శర్మణి శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలలో హెడ్ బాయ్, హెడ్ గర్ల్, డిప్యూటీ హెడ్ బాయ్, డిప్యూటీ హెడ్ గర్ల్ స్థానాలతో పాటు స్కూల్ కౌన్సిల్‌కు జరిగిన ఎన్నికల్లో 1 నుంచి 9వ తరగతి విద్యార్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గెలిచిన విద్యార్థులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్లు వెన్నా నాగార్జునరెడ్డి, సిధూజ పాల్గొన్నారు.

విద్యార్థుల సమగ్రాభివృద్ధే లక్ష్యం కావాలి

కంభం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల సమగ్ర అభివృద్ధే ఉపాధ్యాయుల ప్రధాన లక్ష్యమని ఎంఈవో అబ్దుల్ సత్తార్ అన్నారు. శనివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 2వ క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో డ్రాపౌట్స్ తగ్గించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో శర్మ

రాచర్ల : పాఠశాలల్లో డ్రాప్ అవుట్ రేట్ తగ్గించాలని ఎంఈవో వీ గిరిధర్ శర్మ అన్నారు. జడ్పీహెచ్ పాఠశాలలో శనివారం క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశం స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ బీఎల్ రామనాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ వెనుకబడిన సీ, డీ గ్రూప్ విద్యార్థుల స్థాయిని పెంచాలని వారికి నాణ్యమైన, మెరుగైన విద్యా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులు అందరూ పాల్గొన్నారు.

ఎస్పీకి లారీ డ్రైవర్ ఫిర్యాదు

పొదిలి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధనల మేరకు పట్టణంలో ఇసుకను సరఫరా చేస్తున్నా తన లారీని ఎస్ఐ స్వాధీనం చేసుకున్నారని లారీ యజమాని ఎస్పీ దామోదర్‌కు ఫిర్యాదు చేశారు. రెండురోజులుగా ఇసుక లారీని స్వాధీనం చేసుకొని లారీని పంపించడం లేదని తెలిపారు.

అనధికారికంగా ఇసుక సరఫరా : ఎస్ఐ

పలువురి పేర్ల మీద ఇసుకను తీసుకొచ్చి అక్రమంగా అమ్ముకుంటున్నారని ఎస్ఐ వేమన తెలిపారు. లారీ యజమానికి ఫిర్యాదుపై ఎస్ఐ వివరణిచ్చారు. ఏబీఎం పాఠశాల నుంచి నిర్మల కాన్వెంట్‌కు వెళ్లే రహదారిలో ట్రాక్టర్‌లో నుంచి ఇసుకను అన్‌లోడు చేసి అమ్ముతున్నట్లు తెలియడంతో సిబ్బందితో వెళ్లి దాడి చేశామని, అయితే ఇసుకను ఎక్కడి నుంచి తెస్తున్నదీ, ఎవరికి ఇస్తున్నదీ అన్నదానిపై డ్రైవర్ సరైన సమాధానం ఇవ్వలేదని చెప్పారు. దీంతో లారీని స్వాధీనం చేసుకొని డివిజన్ మైనింగ్, జియాలజీ అధికారులకు లెటర్ ద్వారా తెలియజేశామన్నారు. వారి ఆదేశాల మేరకు చర్యలు ఉంటాయని ఎస్ఐ తెలిపారు.

గిద్దలూరుకు చేరిన ఇస్కాన్ పాదయాత్ర

గిద్దలూరు టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా ఇస్కాన్ పాదయాత్ర బృందం గిద్దలూరు చేరుకున్నది. దేశంలోని వివిధ పుణ్యక్షేత్రాలను దర్శించుకుంటూ గిద్దలూరు చేరిన పాదయాత్రలో మహా హరినామ సంకీర్తనలతో పాదయాత్ర జరిగింది. ఆల్ ఇండియా ఇస్కాన్ సంఘం అధ్యక్షులు స్వామీజీ ఆచార్య ఈకార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 31వ తేదీఆదివారం రాధాష్టమి ఉత్సవాన్ని గణేష్ నగర్‌లో నిర్వహిస్తున్నామని, భక్తులందరూ హాజరు కావాలని పేర్కొన్నారు. ఇస్కాన్ ప్రతినిధి అమలదాస్, వివిధ దేవాలయాల కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళ బ్యాగులో రూ.40వేలు చోరీ

మార్కాపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ మహిళ బ్యాగులో రూ.40 వేలు చోరీకి గురైన ఘటన శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. పెద్దారవీడు మండలం బద్వీడు చెర్లోపల్లికి చెందిన కె.రమాదేవి తన కుమార్తెను తీసుకుని ఒంగోలులో కాలేజీలో చేర్పించేందుకు బయలు దేరారు. మార్కాపురం ఆర్టీసీ బస్టాండ్‌లో దిగి ఒంగోలు బస్సు ఎక్కే క్రమంలో గుర్తు తెలియని దొంగలు బ్యాగులోని నగదును కొట్టేశారు. ఈ విషయమై టౌన్ పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

గ్యాస్ వినియోగంపై జాగ్రత్తలు

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ వినియోగంపై జాగ్రత్తలు పాటించాలని పీఎల్‌పీ ఇండియన్ గ్యాస్ డీలర్ పిన్నిక లక్ష్మీ ప్రసాద్ సూచించారు. స్థానిక కార్యాలయంలో గ్యాస్ వినియోగదారులకు శనివారం అవగాహన కల్పించి మాట్లాడుతూ.. ఐఎస్ఐ మార్క్, ఆఖరి తేదీ లేని గ్యాస్ పైపులు కొనుగోలు చేయవద్దన్నారు. ఐదేళ్లకోసారి గ్యాస్ పైపు మార్చాలని, ఏమాత్రం గ్యాస్ స్టౌవ్ వద్ద నుంచి వాసన వస్తే గ్యాస్ డీలర్‌కు ఫోన్ చేయాలన్నారు. రాత్రిపూట రెగ్యులేటర్‌ను ఆపి ఉంచాలని లక్ష్మీ ప్రసాద్ సూచించారు.

నీటి గుండం వద్ద భక్తులు అప్రమత్తం

ఈవో నాగయ్య


గుండానికి భారీగా చేరుతున్న వరద


భక్తులను ట్రాక్టర్‌తో వాగు దాటిస్తున్న సిబ్బంది

రాచర్ల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : గుండం వద్ద భక్తులు అప్రమత్తంగా ఉండాలని ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎం.నాగయ్య అన్నారు. ఇటీవల కురిసిన, కురుస్తున్న వర్షాలకు శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి ఆలయంలోని నీటి గుండానికి వరద నీరు భారీగా చేరుతుందని, గుండంలో నీటి మట్టం కూడా అధికంగా పెరిగిందని, దర్శనానికి వచ్చే భక్తులు స్నానమాచరించే విషయంలో, గుండంలోకి దిగే విషయంలో జాగ్రత్తలు తప్పకుండా పాటించాలని తెలిపారు. గుండ్లకమ్మ వాగు ఉధృతంగా ప్రవహిస్తోందని నిర్లక్ష్యంగా వాగు దాటేందుకు ప్రయత్నించవద్దని కోరారు. తమ సిబ్బంది గుండం వద్ద, వాగు వద్ద, ఆలయ ప్రాంగాణంలో విధులు నిర్వహిస్తున్నారని భక్తులు అవసరమైతే వారి సహకారాన్ని తీసుకోవాలన్నారు. శనివారం ప్రత్యేక పూజలు జరిగాయని భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని ఆయన తెలిపారు. భక్తులను ట్రాక్టర్ సహాయంతో వాగు దాటిస్తున్నామని ఆయన అన్నారు. ఏఎస్సై వై ఆదిశేషయ్య, వారి సిబ్బంది ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారని ఆయన తెలిపారు.

వైభవంగా చెన్నుని శాంతి కల్యాణం


స్వామివారికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో స్వామికి శాంతి కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు స్వామి మూల విరాట్‌కు సుప్రభాత సేవ, అభిషేకాలు, అలంకరణ, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ మధ్యరంగ మండపంలో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ ఘట్టాలను నిర్వహించారు. రాయలసీమ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామికి మొక్కులు తీర్చుకున్నారు. ఈవో గోలమారి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.

పూజలందుకుంటున్న గణనాథులు


మార్కాపురంలో పూజలందుకుంటున్న మట్టి వినాయకుడు

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి నవరాత్రులు సందర్భంగా పట్టణంలో వివిధ మండపాల వద్ద గణపతి పూజలు అందుకుంటున్నారు. కోనేటి వీధిలోని మట్టి వినాయక విగ్రహం విశేషంగా ఆకట్టుకుంటోంది. అక్కడ భక్తులు నిత్య పూజలు చేస్తున్నారు. మెయిన్ బజార్, తూర్పు వీధి, గొర్లగడ్డ తదితర ప్రాంతాలలో వినాయక మండపాలలో పూజలు చేసి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

గణంగా వినాయక నిమజ్జనం

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో పలు మండపాల నుంచి వినాయక విగ్రహాలను శనివారం నిమజ్జనానికి తరలించారు. సాయి బాలాజీ పాఠశాలలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాన్ని ప్రిన్సిపాల్ మస్తాన్‌వలి నిమజ్జనానికి తరలించారు.

గిద్దలూరు టౌన్ : వినాయక చవితి పర్వదినం సందర్భంగా ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సందర్శించి బొజ్జ గణపయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 10వ వార్డులోని జువ్విళ్లబావి వద్ద ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. పట్టణ టీడీపీ అధ్యక్షులు సయ్యద్ షాన్షావలి, కౌన్సిలర్లు గడ్డం భాస్కర్‌రెడ్డి, బి.చంద్రశేఖర్‌యాదవ్, మాజీ కౌన్సిలర్ మండ్ల శ్రీనివాసరావు, పలువురు టీడీపీ నాయకులు ఆయా పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు.

రూ.93వేలకు దక్కిన వినాయకుని లడ్డు

రాచర్ల : మండలంలోని ఆరవీటికోట గ్రామంలో గణేష్ నిమజ్జనం సందర్భంగా శుక్రవారం రాత్రి నిర్వహించిన వేలంపాటలో వినాయకుడి లడ్డూను రూ.93వేలకు దక్కింది. ఆవు నెయ్యితో దాదాపు రూ.25,500 ఖర్చుతో తయారు చేసిన 26కేజీల లడ్డును గ్రామానికి చెందిన పల్లెల రాజశేఖర్ రెడ్డి తయారు చేయించగా అదే గ్రామానికి చెందిన సూర రంగస్వామిరెడ్డి రూ.93వేలకు పాడి దక్కించుకున్నారు. అనంతరం గణపతిని ఘనంగా నిమజ్జనం చేశారు.


వినాయక లడ్డూతో రంగస్వామి రెడ్డి


బాధ్యతలు స్వీకరిస్తున్న నాసర్‌రెడ్డి

సొసైటీ బ్యాంకు చైర్మన్ బాధ్యతల స్వీకరణ

మార్కాపురం రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మిట్టమీది పల్లి సొసైటీ బ్యాంక్ చైర్మన్‌గా గొలమారి నాసర్‌రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్మన్ నాసర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వం నుంచి అందాల్సిన సేవలను సకాలంలో అందిస్తానని తెలిపారు. రైతులు సొసైటీ బ్యాంకు ద్వారా రైతలుకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.


చెక్కులను పంపిణీ చేస్తున్న వసంతలక్ష్మి

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

పొదిలి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అనారోగ్యంతో వైద్యం చేయించుకున్న 9మందికి రూ3.70వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి కందుల వసంత లక్ష్మి అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజలకు అండగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నారని, ఎవరై అధైర్యపడవద్దని అన్నారు.

పింఛన్‌ల పంపిణీకి సిద్ధంగా ఉండండి

రాచర్ల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఎంపీడీవో ఎస్ వెంకట రామిరెడ్డి తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సెప్టెంబరు 1 ఉదయం 6.30గంటల నుంచి పింఛన్‌లను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేయాలని ఆదేశించారు.

పత్తి దిగుమతి సుంకం తగ్గింపు జీవోను ఎత్తేయాలి

బేస్తవారపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : పత్తి దిగుమతి సుంకం తగ్గింపు జీవోను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఎత్తివేయాలని జిల్లా రైతు సంఘం కార్యదర్శి కె.వీరారెడ్డి కోరారు. శనివారం మండలంలోని మోక్షగుండం గ్రామంలో ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 1వ తేదీన గ్రామాల్లో రైతు జెండాను గ్రామాల్లో ఆవిష్కరించాలన్నారు. పత్తి రైతులకు మద్దతు చెల్లించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ రైతు సంఘం కార్యదర్శి డాకాల పుల్లయ్య,మాజీ సర్పంచ్ తమ్మినేని పెద్దిరెడ్డి,ఆవుల కోటారెడ్డి, నియోజకవర్గ సీపీఐ నాయకులు ఊరుమార్పు జోసఫ్,ఆర్ యోగయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి గురుబ్రహ్మ పురస్కారం


ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న సభ్యులు

గిద్దలూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ఎస్.వెంకటేశ్వర్లుకు రాష్ట్ర ఉత్తమ గురుబ్రహ్మ పురస్కారం లభించింది. తొలి స్వాతంత్ర్య సమర యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఫౌండేషన్ ఈ అవార్డును వెంకటేశ్వర్లుకు శనివారం ప్రదానం చేసింది. వెంకటేశ్వర్లు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా గురూజీ నారాయణరెడ్డి, ఎంఈవో పి.నాగభూషన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి


చాంపియన్‌షిప్‌ను అందుకుంటున్న విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): విదార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ ప్రసాద్ అన్నారు. స్థానిక సాయి బాలాజీ పాఠశాలలో విద్యార్థులకు మండల పోటీలను నిర్వహించి ఓవరాల్ చాంపియన్ షిప్ బహుమతులను అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మస్తాన్ వలి, విశ్రాంత పీడీ నాసరయ్య, ఉపాధ్యాయులు పఆల్గొన్నారు.

కొనకనమిట్లలో ఎస్ఎఫ్ఐ సైకిల్ యాత్ర

కొనకనమిట్ల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యా పరిరక్షణ సైకిల్ యాత్ర కొనకనమిట్లలో 100 కిలోమీటర్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షుడు కంకణాల ఆంజనేయులు స్వాగతం పలికారు. అనంతరం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు సీహెచ్ వినోద్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై అలుపెరగని పోరాటం చేసిన చరిత్ర ఎస్ఎఫ్ఐదన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బండి వీరాస్వామి, జిల్లా నాయకులు కె.విజయ్, ఎస్.అరుణ్, గంగాజి, నాగరాజు, ఆనంద్, దాసు, కొనకనమిట్ల సీఐటీయూ మండల నాయకులు ఆరికట్ల శ్రీనివాసులు, పొదిలి ప్రాంతీయ కమిటీ కన్వీనర్ బాలనర్సయ్య పాల్గొన్నారు.

ప్రతి మహిళకు అక్షర జ్ఞానం అవసరం

మార్కాపురం రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాలలో ప్రతి మహిళకు అక్షర జ్ఞానం అవసరమని ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. ఎస్సీ బీసీ కాలనీలోని డ్వాక్రా బజార్‌లో శనివారం వయోజన విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉల్లాస్ అక్షరాంధ్ర వలంటీర్ టీచర్లకు శిక్షణ కార్యక్రమాన్ని వెలుగు ఏపీఎం పిచ్చయ్య నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ నిరక్షరాస్యులకు అక్షరాలు నేర్పించి వారు చదువుకునే విధంగా తయారు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవోలు రాందాస్ నాయక్, శార్వాణి, వయోజన విద్య కో ఆర్డినేటర్ చెన్నారెడ్డి, వీవోఏలు, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసులు

నిమజ్జనానికి తరలిన గణనాథులు

ముండ్లమూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలుగ్రామాల్లో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాలు శనివారం నిమజ్జనానికి తరలివెళ్లాయి. మండపాల్లో పూజలందుకున్న గణనాథులను ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. పోలవరం, పులిపాడు, కెల్లంపల్లి, పెదఉల్లగల్లు, మారెళ్ళ, బొప్పూడివారిపాలెం గ్రామాల్లో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటుచేసిన విగ్రహాలను అద్దంకి సమీపంలోని గుండ్లకమ్మలో నిమజ్జనం చేశారు.

తాళ్లూరు: స్థానిక ఏబీసీ హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన గణనాథున్ని శనివారం ఉత్సాహంగా నిమజ్జనానికి తరలించారు. గత మూడు రోజులుగా చిన్నారులు గణనాథునికి పూజలు నిర్వహించారు. ప్రత్యేకవాహనంలో గణనాథున్ని ఊరేగింపుగా నిమజ్జనానికి తీసుకవెళ్లారు. ఈసందర్భంగా చిన్నారులు కోలాటాలు, నృత్యప్రదర్శనలు చేస్తూ, గులాములు చల్లుకుంటూ ముందుకుసాగారు. తాళ్లూరులో సమీపంలోగల దోర్నపువాగులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ తూము శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ కె.వెంకటేశ్వరరావు, డైరెక్టర్ కాలేషాబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నిమజ్జనం జరుపుకోవాలి



మాట్లాడుతున్న సీఐ భీమానాయక్

పామూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం నిర్వహించే వినాయక నిమజ్జనాన్ని డ్రోన్ కెమెరాలతో నిఘా పెడుతున్నట్టు సీఐ ఎం.భీమానాయక్ తెలిపారు. శనివారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో జరిగిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో నిమజ్జన వేడుకలు జరుపుకోవాలన్నారు. నిమజ్జన సమయంలో ఇతర ప్రార్థనా మందిరాల వద్ద ఎలాంటి శబ్ధాలు చేయరాదని సూచించారు. నిమజ్జనానికి బయలుదేరే వాహనాల నిర్వాహకులు సమయపాలన పాటించాలన్నారు. నిమజ్జన ప్రదేశాల్లో పంచాయతీ ఆధ్వర్యంలో అన్ని సౌకర్యాలు ఏర్పాటుచేస్తున్నట్టు చెప్పారు. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ కిశోర్‌బాబు, పంచాయతీ కార్యదర్శి జీవీ అరవిందారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దౌర్జన్యం చేసినవారిపై కేసులు నమోదు చేయాలి

పామూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): దళితవాడకు చెందిన వినాయక నిమజ్జనాన్ని అడ్డుకుని దౌర్జన్యానికి పాల్పడిన వారిపై అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కె.మాల్యాద్రి డిమాండ్ చేశారు. మండలంలోని తూర్పు కట్టకిందపల్లి ఎస్సీ పాలెంలో శుక్రవారం దళితులు గణేష్ నిమజ్జనానికి బొట్లగూడూరుకు ఊరేగింపుతో వెళుతున్న సందర్భంగా కొందరు అడ్డుకున్నట్టు చెప్పారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా విచారించి న్యాయం చేస్తామని ఎస్ఐ తెలిపినట్టు పేర్కొన్నారు. ఫిర్యాదు చేసినవారిలో వెంగయ్య, నాగేశ్వరరావు, ఎం.రాజు గురవయ్య, శివరాయులు, తదితరులు ఉన్నారు.

ట్రిపుల్‌ఐటీ నిర్మాణం చేపట్టాలి

కనిగిరి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ట్రిపుల్‌ఐటీ నిర్మాణం చేపట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు పాండురంగారావు అన్నారు. విద్యాపరిరక్షణ యాత్ర శనివారం కనిగిరికి వచ్చిన సందర్భంగా స్థానిక జూనియర్ కళాశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తక్షణమే ట్రిపుల్‌ఐటీని కనిగిరి ప్రాంతంలో నిర్మాణం చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వినోద్, వీరాస్వామి, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారు. సంఘం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం ఒంగోలులోని శారదా బాలకుటీర్ సచివాలయంలో రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సచివాయల ఉద్యోగులు తమ సమస్యలను సంఘం దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల సమస్యలను సంఘం రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేలా తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు ప్రభాకర్, గోపీ, వినయ్, వెంకటేష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ఉద్యోగుల సమస్యలపై రాష్ట్ర సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ మాట్లాడిన అంశాలను ఉద్యోగుల దృష్టికి తీసుకెళ్ళారు.

విద్యకు అధిక ప్రాధాన్యం

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి



కేజీబీవీలో తరగతి గదులను ప్రారంభించిన ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): బాలికల విద్యకు, రక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి పేర్కొన్నారు. సీఎస్‌పురం మండలం శీలంవారిపల్లి గ్రామంలోని కదిరి వెంకటనరసయ్య, లక్ష్మమ్మ జిల్లా పరిషత్ ప్లస్ కళాశాల ఆవరణలో నిర్మించిన కేజీబీవీ టైప్- 4 బాలికల వసతి గృహం భవనాలను విశ్రాంత జాయింట్ కలెక్టర్ కలెక్టర్ పిడుగు బాబురావుతో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో ప్రత్యేక నిధులతో నిర్మించిన ఈ భవనాలను వైసీపీ పాలకులు ప్రారంభించకుండా బాలికల విద్యను విస్మరించారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. బాలికలు అంకితభావంతో విద్యను అభ్యసించి విద్యలో ఉన్నత స్థానానికి చేరుకోని తల్లిదండ్రుల కలలను సాకారం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

అలాగే, సీఎస్‌పురంలోని కేజీబీవీలో ఇంటర్ విద్యార్థుల కోసం నిర్మించిన అదనపు తరగతి గదులను జీసీడీవో కె.హెమలతతో కలిసి డాక్టర్ ఉగ్ర ప్రారంభించారు. కార్యక్రమాల్లో సర్పంచ్ శ్రీరాం పద్మావతి, ఉపసర్పంచ్ పి.నరసయ్య, ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య, ఎంఈవోలు కె.ప్రసాదరావు, రాజాల కొండారెడ్డి, ఎస్ఎస్‌ఏ ఏఈ ప్రకాష్‌రావు, టీడీపీ మండల అధ్యక్షుడు బి.వెంగయ్య, జిల్లా షీప్ సొసైటీ అధ్యక్షుడు టి.గోపి, సింగిల్ విండో అధ్యక్షుడు సీహెచ్ వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చినుకుపడితే.. ప్రయాణం నరకం

» అధ్వానంగా రహదారులు

» ఇబ్బందులు పడుతున్న వాహనచోదకులు



కొద్దిపాటి వర్షానికే బురదమయమైన వేములబండ- రమణారెడ్డిపాలెం రోడ్డు

ముండ్లమూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు రహదారులు అధ్వానంగా ఉన్నాయి. చినుకుపడితే గుంతల్లో నీరు నిలిచిపోతుండటంతో వాహన చోదకులు పడరాని పాట్లు పడుతున్నారు. కొత్తవారు గుంతలు ఎక్కడున్నాయో తెలియక వాహనాలపైనుంచి కిందపడుతున్నారు. ప్రధానంగా వేములబండ - రమణారెడ్డిపాలెం రోడ్డు దారుణంగా ఉంది. చినుకుపడితే బురదమయమై వాహన చోదకులు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. కనీసం వారం పది రోజులు ఆరహదారిపై వాహన చోదకులు ప్రయాణించడానికి సాహసించడంలేదు. వేములబండ గ్రామస్థులు రమణారెడ్డిపాలెం వెళ్ళాలన్నా, ఈదర, అయోధ్య నగర్ రమణారెడ్డిపాలెం గ్రామాలకు చెందిన ప్రజలు మండల కేంద్రమైన ముండ్లమూరుకు రావాలన్నా, అద్దంకి వెళ్ళాలన్నా, నియోజకవర్గ కేంద్రమైన దర్శికి వెళ్ళాలన్నా ఈమార్గంలోనే ప్రయాణం సాగిస్తుంటారు. ఇంతటిప్రాధాన్యత గల రహదారిని అభివృద్ధి పరచాలన్న లక్ష్యంతో గత టీడీపీ ప్రభుత్వం రూ.10 కోట్లతో పసుపుగల్లు నుంచి వేములబండ, రమణారెడ్డిపాలెం మీదుగా ఈదర వరకు తారు రోడ్డు నిర్మించేందుకు నిధులు మంజూరు చేసింది. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్ రూ.3.50 కోట్లతో పసుపుగల్లు నుంచి వేములబండ గ్రామం వరకు తారు రోడ్డు నిర్మించారు. ఆతర్వాత వైసీపీ ప్రభుత్వం రావటంతో వేములబండ నుంచి ఈదర వరకు నిర్మించాల్సిన రహదారి ఆగిపోయింది. 2019 నుంచి 2024 వరకు పాలించిన వైసీపీ ప్రభుత్వం ఆ రహదారి గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో వాహనచోదకులకు కష్టాలు తప్పటంలేదు. వేములబండ గ్రామస్థులు పొలాలు వెళ్ళి పశువుల మేత తెచ్చుకోవాలన్నా, పైర్లకు ఎరువులు తీసుకువెళ్ళాలన్నా పడరానిపాట్లు పడుతున్నారు. పలుమార్లు అధికారులకు తమ గోడు విన్నవించుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు.

అలాగే, రెడ్డినగర్ - బసవాపురం రహదారి అధ్వానంగా ఉంది. రెండు కిలోమీటర్లు ఉండే ఈ రహదారి గోతులమయమైంది. ఇటీవల కురిసిన వర్షానికి పెద్ద పెద్ద గోతులుపడి వాహన చోదకులు, ప్రయాణికులు వెళ్ళలేని పరిస్థితి నెలకొంది. ఆ గోతుల్లో వాహన చోదకులు పడి ప్రమాదాలకు గురయిన సంఘటనలు ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో రెడ్డినగర్ నుంచి బసవాపురం, శ్రీనివాస నగర్ వరకు తారురోడ్డు నిర్మించేందుకు రూ.1.50 కోట్లు మంజూరయ్యాయి. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఆ రహదారిని నిర్మించలేదు. దీంతో వర్షాలు కురిసినప్పుడు గోతుల్లో నీరుచేరి చెరువులను తలపిస్తుంటాయి. కొత్త వ్యక్తులైతే రహదారి బాగుందని వేగంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వమైనా స్పందించి రహదారులను మరమ్మతులు చేసి తమ ఇబ్బందులను తొలగించాలని ఆయాగ్రామాల ప్రజలు కోరుతున్నారు.



గోతులమయమైన బసవాపురం - రెడ్డినగర్ రహదారి

ఉపాధ్యాయుల కొరత తీరేనా?

» దొనకొండ మండలంలో 77 ఖాళీలు

» త్వరలో డీఎస్సీ ద్వారా నియామకం

» మిగులు పోస్టులన్నీ భర్తీ అయ్యేనా!



పోలేపల్లి ఎస్సీ కాలనీలో ఇద్దరు ఉపాధ్యాయులతో కొనసాగుతున్న ఆదర్శ ప్రాథమిక పాఠశాల

దొనకొండ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీ ప్రక్రియ పూర్తి కానుండటంతో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న ఉపాధ్యాయుల కొరత తీరుతుందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల బదిలీఅయినా తప్పనిసరి పరిస్థితుల్లో అక్కడే పనిచేస్తున్న తమకు విముక్తి లభిస్తుందా, లేదా అని సదరు ఉపాధ్యాయులు టెన్షన్ పడుతున్నారు. దొనకొండ మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో 69 మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో 5700 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రస్తుతం 89 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన బదిలీల్లో 72 మంది ఉపాధ్యాయులు ఇతర మండలాలకు బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం 77 మంది ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. ఏకోపాధ్యాయుడితో 25 పాఠశాలలు కొనసాగుతున్నాయి. బదిలీ అయినా రిలీవర్‌లేని కారణంగా తప్పనిసరి పరిస్థితుల్లో 25 మంది ఉపాధ్యాయులు అదే పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం.

మండలంలో 69 మండల పరిషత్, ఎనిమిది జడ్పీ ఉన్నత పాఠశాలల పరిధిలో సెకండరీ గ్రేడ్ అసిస్టెంట్ పోస్టులు 65, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 48, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పోస్టు ఒకటి ఖాళీగా ఉన్నట్లు సమాచారం.

ఈనేపథ్యంలో మండలంలో కొంత మేర కొత్త ఉపాధ్యాయులు విధుల్లో చేరినా పూర్తిస్థాయిలో మిగులు పోస్టులు భర్తీ చేస్తేనే విద్యార్థులకు పూర్తి న్యాయం జరుగుతుందని పలువురు విద్యావేత్తలు పేర్కొంటున్నారు. మెగా డీఎస్సీ ద్వారా సెప్టెంబరు 5వ తేది ఉపాధ్యాయదినోత్సవం సందర్భంగా కొత్త ఉపాధ్యాయులను విధుల్లోకి పంపాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు విద్యాశాఖ వర్గాల్లో చర్చ జరుగుతుంది. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు ఎంతమంది కొత్త ఉపాధ్యాయులు నియామకం జరుగుతుందోనని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్ లేనట్టేనా!

» ఇబ్బందులు పడుతున్న దొనకొండ ప్రాంతవాసులు

» ఐదేళ్లుగా అడుగుతున్నా పట్టించుకోని అధికారులు



దొనకొండ రైల్వేస్టేషన్

దొనకొండ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): దొనకొండ రైల్వే స్టేషన్‌లో రాత్రిపూట ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం లేక ఈప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హాల్టింగ్ సౌకర్యం కల్పించాలంటూ ఐదేళ్లుగా రైల్వే అధికారులకు అనేకసార్లు విజ్ఞప్తి చేస్తున్నా ఏమాత్రం పట్టించుకోవటంలేదు. కరోనాకు ముందు దొనకొండ రైల్వేస్టేషన్‌లో అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఈసౌకర్యం ఉండేది. కరోనా తర్వాత రైళ్ల పునఃప్రారంభం నుంచి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు దొనకొండలో హాల్టింగ్ సౌకర్యం ఎత్తేయటంతో ప్రజలు రాకపోకలు జరుపుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఎన్నోసార్లు రైల్వే ఉన్నతాధికారులను, రైల్వే బోర్డు చైర్మన్ దృష్టికి సమస్యను తీసుకెళ్లినా ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయిందని ఈప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగకుండా పరుగులు తీస్తుండటంతో దొనకొండలో హాల్టింగ్ సౌకర్యం ఉండదని, రవాణా కష్టాలు తప్పవని ప్రజలు భావిస్తున్నారు.

నత్తతో పోటీపడుతున్న అభివృద్ధి పనులు

అమృత్‌భారత్ పథకంలో దొనకొండ రైల్వే స్టేషన్ ఎంపిక కావటంతో దాదాపు రూ.17 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. జరుగుతున్న పనులు చూసి పనులు పూర్తయిన తర్వాత ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పిస్తారేమోనని ప్రజలు భావిస్తున్నారు. అయితే, అభివృద్ధి పనులు ఏళ్ల తరబడి నత్తతో పోటీపడుతున్నాయి. దొనకొండలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం లేకపోవటంతో విజయవాడ, విశాఖపట్నం, బెంగుళూరు తదితర పట్టణ ప్రాంతాలకు రాకపోకలు జరుపుకునేందుకు ఇటు మార్కాపురం, అటు వినుకొండ వైపునకు ప్రైవేట్ వాహనాల్లో రోడ్డుమార్గాన వెళ్తూ ఇబ్బందులు పడుతున్నారు. పండుగలకు వివిధ పట్టణ ప్రాంతాల నుంచి ఈ ప్రాంతంలోని స్వగ్రామాలకు చేరుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. జీవనోపాధి నిమిత్తం పట్టణ ప్రాంతాలకు వలసలు వెళ్లే ప్రజలు దొనకొండలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోడ్డు మార్గాన సహితం సరైన రవాణా సౌకర్యం లేక ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం ఎప్పుడు కల్గుతుందోనని ప్రజలు ఐదేళ్లుగా ఎదురుచూస్తున్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా రైల్వే ఉన్నతాధికారుల్లో ఎటువంటి స్పందన ఉండటంలేదు. ఎక్స్‌ప్రెస్ రైళ్లు దొనకొండలో ఆగకుండా పరుగులు తీస్తుండటంతో ప్రజలు తీవ్ర నిరాశకు గురవుతున్నారు.

ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఎక్స్‌ప్రెస్ రైళ్లు దొనకొండలో ఆగకపోవటంతో ప్రజల పడుతున్న రవాణా ఇబ్బందులు ఢిల్లీస్థాయిలో రైల్వే ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కరించాలని కోరుతున్నారు. కనీసం కొండవీడు-అమరావతి, ధర్మవరం మూడు ఎక్స్‌ప్రెస్ రైళ్లకైనా దొనకొండలో హాల్టింగ్ సౌకర్యం కల్పించేలా చర్యలు చేపట్టాలని ఈ ప్రాంత ప్రజలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నారు.

దొనకొండలో ఆగని ఎక్స్‌ప్రెస్ రైళ్లు

మచిలీపట్నం-బెంగుళూరు- మచిలీపట్నం కొండవీడు ఎక్స్‌ప్రెస్,

పూరి, యశ్వంత్‌పూర్-పూరి గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్,

విజయవాడ-హుబ్లీ-విజయవాడ అమరావతి ఎక్స్‌ప్రెస్,

హౌరా-వాస్కోడిగామా-హౌరా, అమరావతి ఎక్స్‌ప్రెస్

భువనేశ్వర్-బెంగుళూరు- భువనేశ్వర్, ప్రశాంతి ఎక్స్‌ప్రెస్

విజయవాడ, ధర్మవరం- విజయవాడ, ధర్మవరం, హౌరా-సత్యసాయి ప్రశాంతి నిలయం ఎక్స్‌ప్రెస్ రైళ్లు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ పిచ్చయ్య

అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తిచేయాలి

దర్శి ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య సూచించారు మున్సిపల్ కార్యాలయంలో శనివారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్నిప్రాంతాల్లో సీసీ రోడ్లు, మురుగుకాల్వలు నిర్మించి మౌలిక వసతులు పెంపొందిస్తామన్నారు. శివారు ప్రాంతాల్లో అధికారులు పర్యటించి రోడ్లు, మురుగుకాల్వలు నిర్మించేందుకు ప్రతిపాదనలు తయారుచేయాలని సూచించారు. దర్శి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో మార్చురీ గది నిర్మాణం విషయంపై చర్చించారు. పట్టణంలో ఆక్రమంగా నిర్మించుకున్న కొళాయిలను క్రమబద్ధీకరించే విషయంపై చర్చించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ తలారి కోటయ్య, అధికారులు, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణనాథులకు పూజలు



వినాయకుని పూజలో పాల్గొన్న భక్తులు



సత్రం బజారులో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహం

పామూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకల్లో భాగంగా శనివారం నాల్గోరోజు పట్టణంలోని వినాయక మండపాలలో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అంకాలమ్మ వీధిలో వినాయక మండపం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తూర్పువీధి, రాజా వీధి, ఎన్‌జీవో కాలనీ తదితర ప్రాంతాల్లోనూ భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సత్రం బజారులో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహం భక్తులను ఆకర్షిస్తున్నది.

కార్యక్రమాల్లో మోపాడు ప్రాజెక్టు సూపర్‌చైర్మన్ చుంచు కొండయ్య, దేవస్థాన చైర్మన్ ఏ.నరసింహులు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య, ఆకుపాటి రమణయ్య, పోతురాజు వెంకటరత్నం, పువ్వాడి వెంకటేశ్వర్లు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ అమీర్‌బాబు, ఇర్రి కోటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



దర్శిలోని పుచ్చలమిట్టలో శనివారం లక్షా 20వేల 500 కరెన్సీ నోట్లతో అలంకరించిన వినాయక విగ్రహం

బాల్య వివాహాలను అడ్డుకోవాలి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ గఫార్

కనిగిరి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ బాల్య వివాహాలను అడ్డుకోవాలని మున్సిపల్ చైర్మన్ గఫార్ అన్నారు. పట్టణంలోని బొగ్గులగొంది కాలనీలో బాల్యవివాహాలతో జరిగే అనర్థాలను వివరిస్తూ శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లో బాల్య వివాహాలు చేసుకోవటంవల్ల చిన్న వయసులోనే గర్భం దాల్చటంవల్ల అనారోగ్యాలు పాలవుతున్నారన్నారు. చిన్నవ యసులోనే వివాహాలను చేయటం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుమతి, పారాలీగల్ వలంటీర్లు గుడ్‌హెల్ప్ రమేష్‌బాబు, సిబ్బంది శామ్యూల్, తిరుపతయ్య, అంకమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ భూములపై సీఐడీ విచారణ

కనిగిరి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): కనిగిరి ప్రాంతంలో అన్యాక్రాంతమైన అగ్రిగోల్డ్ భూముల స్థితిగతులపై శనివారం సీఐడీ బృందం పరిశీలించారు. సీఐడీ డీడీ డాక్టర్ ఏ.రవిశంకర్ ఆదేశాల మేరకు కనిగిరి, హనుమంతునిపాడు, పామూరు, వెలిగండ్ల, సీఎస్‌పురం మండలాల్లోని వివిధ గ్రామాల్లోని అగ్రిగోల్డ్ భూములను పరిశీలించారు. ఈసందర్భంగా సీఐడీ సీఐ తిరుమలరావు మాట్లాడుతూ భూ రికార్డుల ప్రకారం క్షేత్రస్థాయిలో ఎంత భూమిలో సాగు చేపట్టారు, ఆక్రమణలో ఎవరున్నారనే వివరాలను సేకరించినట్టు చెప్పారు. అగ్రిగోల్డ్ అస్తులపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐడీ ఎస్ఐ విద్యాసాగర్, హెడ్‌కానిస్టేబుల్ నాగేశ్వరరావు, వీఆర్వో శివశంకర్, సర్వేయర్ రజాక్ తదితరులు పాల్గొన్నారు.



అగ్రిగోల్డ్ భూములను పరిశీలిస్తున్న సీఐడీ బృందం





ఆటోమ్యుటేషన్‌కు అవాంతరాలు



- పట్టిపీడిస్తోన్న సాంకేతిక సమస్యలు
- పరిష్కారంపై అధికారుల్లో కొరవడిన స్పష్టత
- సీసీఎల్‌ఏ వద్దకు వెళ్లినా ఫలితం శూన్యం
- భూముల కన్వర్షన్‌కు యజమానుల తిప్పలు



గుంటూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): భూముల ఆటోమ్యుటేషన్‌లో సాంకేతిక సమస్య లు పట్టిపీడిస్తు న్నాయి. దీంతో పారిశ్రామిక అవసరాల కోసం వ్యవ సాయ భూములను రిజిస్ట్రేషన్ చేయించుకున్న యజ మానులు వ్యవ సాయేతర భూములు(నాలా) చార్జీలు చెల్లించేం దుకు వీలు కావడం లేదు. దీంతో అనుకున్న పరిశ్రమలను పెట్టలేకపోతున్నారు. మరోవైపు రిజిస్ట్రే షన్, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదిక్షణలు చేస్తోన్నారు. కలెక్టరేట్‌లో కొద్దిమంది ఉన్నతాధికారులకు తప్ప రెవెన్యూలో ఎవ్వరికి దీని పై స్పష్టమైన అవగా హన లేకపోవడంతో భూము ల కన్వర్షన్ కోసం వాటి యజమానులు నానా తిప్ప లు పడుతున్నారు. మంగళ గిరిలో ఓ సంస్థ నలు గురు డైరెక్టర్ల పేర్లతో నాలుగు ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. ఆ సంస్థ రిజిస్ట్రేషన్ చేసుకోగా ఆటోమ్యుటేషన్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దాంతో ఆ ఫరంలోని నలుగురు పేర్లతో నాలుగు ఎకరాల చొప్పున అడంగల్‌లో 16 ఎక రాలుగా నమోదైంది. వెబ్‌ల్యాండ్‌లోనూ ఇదే పరిస్థితి తలెత్తింది. దీంతో ఆ ఫరం డైరెక్టర్లు తొలుత రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సంప్రదించగా అక్కడి అధికారులు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డీఐజీ వద్దకు పంపించారు. అక్కడి అధికారులు ఈ సమస్య తమది కాదని సీసీ ఎల్‌ఏ(భూ పరిపాలన ముఖ్య కమిషనర్) కార్యాల యానికి పంపించారు. వారు తిరిగి తహసీల్దార్ వద్దకు వెళ్లమన్నారు. ఇలా ఇప్పటికే ఆరు నెలలకు పైగా సమ యం గడిచింది. ఇలా ఆటోమ్యుటేషన్ సక్రమంగా జర గక గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో పలువురు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఆందోళన అవసరం లేదు : డీఆర్వో

ఆటోమ్యుటేషన్‌లో సాంకేతిక సమస్యలు ఉన్నట్లు గుంటూరు జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కే ఖాజావలి అంగీకరించారు. మీ-సేవలో దరఖాస్తు చేసుకునేట పుడే ఖాతాదారులు అందరి పేర్లతో కలిపి కాకుండా ఎక్కడో ఒక చోట భూమి విస్తీర్ణాన్ని పేర్కొంటున్నారని, దీనివల్ల ఆటోమ్యుటేషన్ సరిగా జరగక ఆ ఫరంలో ఎంతమంది ఉంటే అందరి పేర్ల మీద భూమి ఉన్నట్లు అడంగల్, వెబ్‌ల్యాండ్‌లోకి ఎక్కుతున్నదన్నారు. ఈ విషయాన్ని సీసీఎల్‌ఏకి నివేదించామని, ప్రస్తుతానికి పూర్తి వివరాల తో తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే ఆర్డీవో ద్వారా జాయింట్ కలెక్టర్ లాగిన్‌కు వస్తుంద న్నారు. సవరణను చేసే అధికారం జేసీకి ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన తెలిపారు.

పేదలకు.. తోడ్పాటు

రాజధాని అమరావతి పరిధిలో భూమిలేని పేదల కు ఆర్థిక భరోసా కల్పిం చేందుకు సీఆర్‌డీఏ సిద్ధ మైంది. గతంలో కూలి పనులతో జీవనం సాగిం చే ఎందరో పేదలు ఉపాధి లేక అల్లాడుతున్నారు. ఆర్థిక సమస్యలతో జీవ నం కనాకష్టంగా మారింది. వీరి సంక్షే మానికి రీ సెటిల్ మెంట్ యాక్షన్ ప్లాన్ (ఆర్‌పీఏ)కు సీఆర్‌డీఏ శ్రీకారం చుట్టింది. కూలీల సొంతింటి కలను నెరవేర్చడంతో పాటు విద్య, వైద్యం, ఉపాధి కల్పనను మెరుగు పరచడంపై ప్రధానంగా దృష్టి సారించ నుంది. దీనికి అనుగుణంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వ హించనుంది. రాష్ట్ర ప్రభుత్వం తర పున భూమి లేని పేదల కోసం పలు సంక్షేమ కార్యక్రమాలను చేపట్టింది.

- ఆర్థిక భరోసాకు సీఆర్డీఏ ప్రణాళిక
- రీసెటిల్‌మెంట్ యాక్షన్ ప్లాన్‌కు శ్రీకారం
- రాజధానిలో భూమిలేని వారి సంక్షేమంపై దృష్టి
- పేదలకు సొంతిల్లు, విద్య, వైద్యం, ఉపాధి కల్పనకు చర్యలు

(ఆంధ్రజ్యోతి, అమరావతి)

రాజధాని అమరావతిలో భూమి లేని పేదల కోసం రీసెటిల్‌మెంట్ యాక్షన్ ప్లాన్(ఆర్‌ఏపీ)కి సీఆర్‌డీఏ శ్రీకారం చుట్టింది. అమరావతి ఇంటి గ్రేటెడ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఏఐయూడీపీ) కార్యక్రమంలో అంతర్భాగంగా రీసెటిల్‌మెంట్ పాలసీని రూపొందించిన సంగతి తెలిసిందే. ఇదేక్రమంలో భూమి లేని పేదల అభ్యున్నతి, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని రీసెటిల్‌మెంట్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసింది. రాజధానిలో భూమిలేని పేదలను హౌస్ హోల్డ్ సర్వే ద్వారా గుర్తిస్తారు. 2015, ఆ తర్వాత వార్షిక కౌలు వంటి వాటిని కూడా సమీక్షిస్తారు. రాజధానిలో అంతర్భాగంగా ఉన్న 29 గ్రామాల పరిధిలో భూమిలేని పేదలు జీవనోపాధిని కోల్పోతున్నారు. దీనిని దృష్టిలో (మిగతా 6వ పేజీలో)





బడ్జెట్‌లో కేటాయింపులు

2025-26 ఆర్థిక సంవత్సరానికి భూమిలేని రాజధాని పేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.120.16 కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది. ఒక్క పెన్షన్లకే రూ.114 కోట్లు, సోషియో ఎకనమిక్ సర్వేకు రూ.50 లక్షలు, సోషల్ ఆడిట్‌కు రూ.15 లక్షలు, ఎన్‌జీవో నియామకానికి రూ.39 లక్షలు, స్టేక్ హోల్డర్ కన్సల్టేషన్స్‌కు రూ.10 లక్షలు, ఎన్ఏసీ సపోర్ట్‌కు రూ.5 కోట్లు, జాబ్‌మేళాల నిర్వహణకు రూ.2 లక్షలు చొప్పున బడ్జెట్ కేటాయించారు. భూమిలేని కార్మికుల డేటా కోసం సెప్టెంబరు 25 నాటికి సర్వే చేయాలని నిర్ణయించారు. చదువుకున్న పిల్లలకు స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ కోసం సంస్థల ఎంపికను అక్టోబరు, 2025 నాటికి పూర్తి చేయాలని, ప్రమాదకర పరిస్థి తుల్లో ఉన్న వారి కోసం సోషియో ఎకనమిక్ స్టడీని అక్టోబరు 2025కి పూర్తి చేయాలని భావిస్తున్నారు. ప్రతి నెలా జాబ్ మేళాలు నిర్వహించాలని, ప్రతి త్రైమాసికానికి ఒక సారి కమ్యూనిటీ కోఆర్డినేషన్ మీటింగ్స్ నిర్వహించాలని, ప్రతి వారం గ్రీవెన్స్ డేలను పెట్టి అర్జీలను స్వీకరించాలని నిర్ణయించారు.



కలెక్టరేట్‌లో బార్లకు లాటరీ తీస్తున్న అధికారులు

నాలుగు బార్లకే లాటరీ

- రేపటి నుంచి నూతన బార్ పాలసీ అమల్లోకి
- మిగిలిన బార్ల విషయంలో ప్రభుత్వ నిర్ణయంపై ఉత్కంఠ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

జిల్లాలో 19 బార్లకు ప్రభుత్వం నూతన మద్యం పాలసీ ప్రకారం నోటిఫికేషన్ జారీ చేయగా నాలుగు బార్లకు మాత్రమే లాటరీ ప్రక్రియను చేపట్టారు. శనివారం కలెక్టరేట్ వేదికగా లాటరీ ప్రక్రియను ఇన్‌చార్జి జేసీ గంగాధర్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగింది. దరఖాస్తుల సంఖ్య ఆధారంగా నాలుగింటితోనే లాటరీ సరిపెట్టాల్సి వచ్చింది. లాటరీ తీసిన వాటిలో చీరాల, అద్దంకి పరిధిలో ఒక్కో బార్ ఉండగా, మిగిలిన రెండు గీత కార్మికులకు బాపట్ల, రేపల్లె పరిధిలో రాయితీపై కేటాయించినవి కావడం గమనార్హం. 15 బార్ల కేటాయింపు పెండింగ్‌లో ఉంది. ప్రభుత్వం తొలుత ప్రకటించినట్లు సెప్టెంబరు 1 నుంచి జిల్లావ్యాప్తంగా నూతన బార్ పాలసీ అమల్లోకి వస్తుందని ఎక్సైజ్ విభాగం తెలిపింది. లాటరీలో బార్ దక్కించుకున్న లైసెన్స్ దారులకు ప్రొవిజనల్ లైసెన్స్ జారీ చేస్తామని, దానితో సోమవారం నుంచి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం బార్లను నిర్వహించుకోవచ్చని అధికారులు తెలిపారు. కాగా జిల్లా వ్యాప్తంగా 19 బార్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తే గడువు ముగిసేనాటికి నాలుగింటితోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. వీటిలో రెండు గీత కార్మికులకు కేటాయించినవి కాగా అద్దంకి బార్‌కు లైసెన్స్ ఫీజు తక్కువ కావడంతో దరఖాస్తుదారులు ముందుకు వచ్చారు. చీరాల బార్ ఒక్కటి మాత్రమే ప్రభుత్వం గరిష్ఠంగా లైసెన్స్ ఫీజు నిర్ణయించిన రూ.55 లక్షల ప్రకారం ఏర్పాటు కానుంది. మిగిలిన 15 బార్ల ఏర్పాటు విషయంలో ప్రభుత్వం ఏ విధంగా ముందుకెళ్లనుందోననే ఉత్కంఠ నెలకొంది. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ జిల్లా అధికారి వెంకటేశ్వరరావు, సీఐ పి.గీతిక, పి.నాగేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలపై ఆర్డీవో తనిఖీ

పుల్లరిపాలెంలో ఎక్సకవేటర్ స్వాధీనం

వేటపాలెం(చీరాల), ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పుల్లరిపాలెం గ్రామ శివారులో అక్రమ ఇసుక తవ్వకాలను ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు శనివారం తనిఖీ చేశారు. అక్రమంగా ఇసుక రవాణా జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు మైనింగ్ విజిలెన్స్ అధికారులతో కలిసి ఆర్డీవో తనిఖీలు చేశారు. ఈ క్రమంలో ఘటనా స్థలంలోని ఎక్సకవేటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇసుక రవాణాపై కేసు నమోదు చేసి విచారణకు ఆదేశాలు జారీ చేశారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ గోపీకృష్ణ, వీఆర్వో సత్యం, ఒంగోలు విజిలెన్స్ అధికారులు ఉన్నారు.



ఇసుక అక్రమ తవ్వకాలను పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం

బాపట్ల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పోలీసు ఉద్యోగుల కుటుంబాలకు అండగా ఉంటామని, వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎస్పీ తుషార్‌డూడి తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం పోలీసు వెల్ఫేర్ డేలో ఆయన విశ్రాంత ఉద్యోగులు, సర్వీస్‌లో ఉండి మృతి చెందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులతో సమావేశమయ్యారు. వ్యక్తిగత, కుటుంబ, పిల్లల చదువులు తదితర సమస్యలను తమదృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాసరావు, సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్‌నాయక్, రిజర్వు ఇన్‌స్పెక్టర్ షేక్.మౌలుద్దీన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ తుషార్‌డూడి

డీఎస్సీలో.. సర్టిఫికేట్లు

- వైకల్యం లేకున్నా ఉన్నట్లు ధ్రువీకరణ
- కానిస్టేబుల్‌గా చేస్తూ బీపీఈడీ కోర్సు చేసినట్లు..
- సర్టిఫికెట్ల పరిశీలనలో వెలుగులోకి వస్తున్న బోగస్ పత్రాలు
- వీటిపై పూర్తిస్థాయిలో పరిశీలనకు విద్యాశాఖ సన్నాహాలు

గుంటూరు(విద్య), ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వైకల్యం లేకపోయినా దివ్యాంగుల మని.. ప్రభుత్వం ఉద్యోగం చేస్తూ బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సు చేసినట్లు.. సర్టిఫికెట్లు సమర్పించి మెగా డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగం కోసం కొందరు ప్రయత్నించారు. అయితే ఆయా బోగస్ పత్రాలను విద్యాశాఖ అధికారులు గుర్తించి వారి ప్రయత్నాలను అడ్డుకున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మెగా డీఎస్సీ ద్వారా వివిధ విభాగాల్లో దాదాపు 1600 పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇందులో ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 28, 29 తేదీల్లో గుంటూరులోని ఏసీ కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమాన్ని విద్యాశాఖ నిర్వహించింది. ఈ క్రమంలో కొందరు అభ్యర్థుల బోగస్ బాగోతాలు వెలుగుచూశాయి. బోగస్ ధ్రువీకరణ పత్రాలను పూర్తిస్థాయిలో పరిశీలనకు విద్యాశాఖ సన్నాహాలు చేస్తోంది. వైకల్యం లేకుండా ఉన్నట్లు చూపి ఆ విభాగంలో పోస్టులకు ఎంపికైన అభ్యర్థులపై విచారణ చేయాలని అధికారులు నిర్ణయించినట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాలో దాదాపు 50 మందికిపైగా వివిధ విభాగాల్లో వైకల్య విభా గంలో టీచర్ పోస్టులకు ఎంపికయ్యారు. వీరిలో ఎంతమంది బోగస్ సర్టిఫికెట్లు పెట్టారనేది దర్యాప్తులో వెల్లడికానున్నది.

అయితే ఉద్యోగం వద్దులే..

ప్రస్తుతం ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఓ స్టేషన్‌లో పోలీసు కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఓ అభ్యర్థి బీపీఈడీ పూర్తి చేసినట్లు డీఎస్సీకి దరఖాస్తు చేసుకున్నాడు. పరీక్ష కూడా రాసి ఉత్తీర్ణత సాధించి బీపీఈడీ విభాగంలో పోస్టు దక్కించుకున్నాడు. అయితే కానిస్టేబుల్ ఉద్యోగం చేస్తూ బీపీఈడీ కోర్సు చేయకూడదు. ఈ క్రమంలో ఉద్యోగం చేస్తూ ఆ కోర్సు ఎలా చేశావని డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలనలో అధికారులు ప్రశ్నించడంతో అతడు ఖంగుతిన్నాడు. తాను ఉద్యోగంలో చేరడం లేదంటూ విద్యాశాఖకు లేఖ సమర్పించి సర్టిఫికెట్ల పరిశీలన నుంచి అతడు తప్పుకున్నట్లు సమాచారం.

వైద్యుల పరిశీలనలో వెలుగులోకి..

అంగవైకల్యం లేకపోయినా కొందరు సర్టిఫికెట్లు తెచ్చుకున్నట్లు (మిగతా 6వ పేజీలో)



సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైన అభ్యర్థులు (పాతచిత్రం)

ప్రలోభాలకు లొంగకుండా ఇవ్వాలి

- ముందస్తు ఎరువుల నిల్వలకు చెక్ చెప్పాలి
- అధికారులతో సమీక్షలో ఎమ్మెల్యే ఆనందబాబు ఆదేశాలు

వేమూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రలోభాలకు లొంగకుండా రైతులకు ఎరువులు ఇవ్వాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అధికారులను ఆదేశించారు. వేమూరు రోశయ్య మీటింగ్ హాలులో ఎరువుల కొరతపై అధికారులతో శనివారం ఎమ్మెల్యే సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద రైతులు కొందరు ముందస్తుగా ఎరువులను కొనుగోలు చేసుకుని నిల్వ చేశారని అనేకమంది రైతులు తనకు ఫోన్లు చేసి చెప్పారని, ఇలాంటి విధానానికి చెక్ పెట్టాలన్నారు. రైతులకు సహకరించే విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేస్తే ఆయా అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వర్షాల వల్ల ఎరువుల సమస్య ఏర్పడిన మాట వాస్తవమేనని అయితే ప్రణాళికాబద్ధంగా సరఫరా చేయాలన్నారు. మండలాల వారీగా సరఫరా, విక్రయాలపై ఏడీఏలు నివేదిక ఇస్తే కలెక్టర్‌తో చర్చించి ఎరువుల కోటా విడుదలకు చర్యలు తీసుకుంటామన్నారు. సొసైటీల ద్వారా సరఫరా చేసే ఎరువులు విషయంలో కూడా పక్షపాత వైఖరి అవలంబించవద్దన్నారు. లక్షా 15 వేల ఎకరాల్లో ఖరీఫ్ సాగు అవుతుండగా, 4 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా అయినట్లు అధికారులు తెలిపారు. ఇంకా 10 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉందన్నారు. ప్రైవేట్ దుకాణాల్లో నిల్వలను తనిఖీల ద్వారా గుర్తించి నివేదికలు సమర్పించాలన్నారు. ఎరువులను ఎక్కువ ధరకు అమ్మితే తక్షణమే లైసెన్స్‌లు రద్దు చేయాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

అమృతలూరు ఏవోపై ఆగ్రహం

అమృతలూరు ఏవో తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. సొసైటీ కన్నా ఎక్కువగా దుకాణాలకు ఎరువులను ఇప్పించి అధిక ధరకు అమ్మేలా ప్రోత్సహిస్తుండటంపై ప్రశ్నించారు. సమీక్షలో ఏడీఏలు లక్ష్మీ, ధనరాజ్, ఏవోలు ప్రేమ్‌సాగర్, భరత్, ఆదాంబాబు, నరేంద్ర, బ్రహ్మారెడ్డి, బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, యార్డు చైర్‌పర్సన్ పూర్ణకుమారి, మైనేని మురళీకృష్ణ, మైనారిటీ సెల్ నాయకులు హనీఫ్, రైతు విభాగం నాయకులు అమ్మిశెట్టి కిశోర్ బాబు, జనసేన సమన్వయకర్త ఉసా రాజేష్, టీడీపీ నాయకులు ఎల్లారెడ్డి, శివారెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములు.. అన్యాక్రాంతం

చీరాల, పేరాల, వేటపాలెంలో పెట్రేగుతున్న అక్రమార్కులు

చీరాల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఆలయ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. ఆక్రమణదారులు యథేచ్ఛగా హద్దులు ఏర్పరుచుకుని శాశ్వత కట్టడాలు నిర్మించుకుంటున్నారు. ఆయా భూములపై అధికారుల పర్యవేక్షణ లోపంతో అక్రమార్కులకు అవకాశం కలిసొచ్చింది. చాలావరకు ఆక్రమించి శాశ్వత కట్టడాలు నిర్మించుకుం టున్నారు. మరి కొందరైతే ఏకంగా విక్రయాలు జరుపుకుని సొమ్ము చేసుకున్నారు. పట్టణంలోని ఏరియా వైద్యశాల సమీపంలో పేరాల మదన గోపాలస్వామి దేవస్థానానికి సంబంధించి సర్వే నెంబరు 489లో 7.36 ఎకరాల భూమి ఉంది. ఇందులో 2 ఎకరాలు టీటీడీ కల్యాణ మండపానికి ఇచ్చారు. మిగిలిన 5.36 ఎకరాలు భూమి అభివృద్ధికి 1995లో దేవదాయ శాఖకు అప్పగించినట్లు భక్తులు చెబుతున్నారు. అయితే దీని బాగోగులు విషయంలో ఆ శాఖ పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే విమ ర్శలు ఉన్నాయి. పేరాలలోని పునుగు రామలింగేశ్వర స్వామి దేవస్థానం భూమిని కొందరు ఆక్రమిస్తున్నారు. వేటపాలెంలో కొన్నిచోట్ల కొందరు శాశ్వత భవనాలు నిర్మించుకున్నారు. దేవదాయ భూములు ఆక్రమించి కట్టడాలు నిర్మిస్తుంటే వాటికి సంబంధించి కరెంటు మీటరు, ఇంటి పన్నులు కేటాయించడంపై పలు అనుమానాలకు దారి తీస్తుంది. స్థలానికి సంబంధించి పూర్తి స్థాయిలో హక్కు పత్రాలు ఉంటేనే పొజిషన్ ఇవ్వడానికి అవకాశం ఉంటుంది. అలాంటప్పుడు మున్సిపల్ అధికారులు ఏవిధంగా ఈ ఆక్రమణదారులకు ఎన్‌వోసీలు ఇస్తున్నారో అంతు బట్టడంలేదు.



టీటీడీ కళ్యాణ మండపం పరిధిలోని ఖాళీ భూమి

ఆక్రమణలు జరిగింది వాస్తవమే

జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల గతంలోనే ఆక్రమణలు జరిగింది వాస్తవమే. వీటిపై ఈ ఏడాది జూన్‌లో సమావేశం జరిగింది. ఆక్రమణల వివరాలను ఇప్పటికే ఉన్నతాధికారులకు అందజేశాం. అందుకు సంబంధించి జిల్లా మెజిస్ట్రేట్ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయడం జరిగింది. చర్యలు తప్పక ఉంటాయి.

- సూర్య ప్రకాశరావు, అసిస్టెంట్ కమిషనర్, దేవదాయశాఖ

పొగాకు రైతులను ఆదుకోవాలి

- మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ విజయసునీత
- కలెక్టర్‌తో కలిసి పొగాకు కొనుగోళ్ల పరిశీలన

పర్చూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పొగాకు సంక్షోభం నుంచి రైతులను ఆదుకునేలా కొనుగోళ్లు చేపట్టాలని ఏపీ వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్, ఎస్‌డబ్ల్యూసీ ఎండీ విజయసునీత తెలపారు. పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో పొగాకు బేళ్లతో పాటు, కొనుగోళ్ల ప్రక్రియను ఆమె కలెక్టర్ వెంకటమురళితో కలిసి శనివారం పరిశీలించారు. అనంతరం గోదాముల్లో నిల్వ, ప్రాసెసింగ్ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా విజయసునీత మాట్లాడుతూ కొనుగోళ్ల ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. నిల్వ సామర్థ్యం స్థానికంగా లేకపోతే పొరుగు జిల్లాలోని గోదాములకు తరలించాలన్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు ధ్రువీకణ పత్రాలు, వారి బ్యాంకు ఖాతాల పరిశీలన పూర్తి అయితే నగదు జమ చేస్తామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ బ్లాక్‌బర్లీ పొగాకు కొనుగోలు ప్రక్రియను సెప్టెంబరులోగా పూర్తి చేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా 6,396 మంది రైతుల నుంచి 42 పొగాకు కొనుగోలు కేంద్రాల ద్వారా 9,900 టన్నుల బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలు చేశామన్నారు. ప్రతీ రోజు 300 మంది రైతుల నుంచి 600 టన్నుల పొగాకు కొనుగోలు చేయాలని అధికారులకు తెలిపారు. బర్లీ పొగాకు నిల్వకి 18 గోదాములను గుర్తించామన్నారు. ప్రకాశం, గుంటూరు, కృష్ణా జిల్లాల్లోని సీఎస్‌పురం, దర్శి, గన్నవరం, జగ్గయ్యపేట, పిడుగురాళ్ల, నడికుడి గోదాములకు పొగాకును తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం పర్చూరు, యద్దనపూడి, ఇంకొల్లు, అద్దంకిలోని తమ్మవరం, కొరిశపాడులోని గోదాములు నిండాయన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ ఆర్జేడీ కె.శ్రీనివాసరావు, ఆర్‌డీడీ ఎం.దివాకర్, జిల్లా అధికారి కె.రమేష్ బాబు, ఎంఎంసీ చైర్మన్ గుంజి వెంకట్రావు, మార్క్‌ఫెడ్ డీఎం.కరుణశ్రీ, ఆర్డీవో పి.గ్లోరియా, తహసీల్దారు పి.బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



పొగాకును పరిశీలిస్తున్న మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయసునీత, కలెక్టర్ వెంకటమురళి


గిరిజనులకు దుప్పట్లు అందజేస్తున్న న్యాయాధికారులు

తల్లిదండ్రులు పిల్లలను చదివించాలి

● అవగాహన సదస్సులో జిల్లా న్యాయాధికారి భారతి

గిద్దలూరు టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా చదివించాలని, వారు విద్యావంతులై ఉపాధి చేసుకుని ఆర్థికంగా వారి కాళ్లపై వారు నిలబడేలా చేయాలని జిల్లా న్యాయాధికారి భారతి అన్నారు. మండలంలోని కేఎస్‌పల్లె గ్రామంలోని భీమలింగేశ్వరస్వామి ఆవరణలో గిరిజనులు, ఆదివాసులకు వివిధ అంశాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలోపాల్గొన్న న్యాయాధికారి భారతి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాలలో ఆడపిల్లల బాధ్యతలనుంచి తప్పించుకోవడానికి తల్లిదండ్రులు బాల్యవివాహాలు చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం అందిస్తున్న నిర్బంధ విద్య ద్వారా విద్యావంతులను చేయాలని, వారికి ఇష్టమైన రంగాలలో వారిని ఎదగనివ్వాలన్నారు. వివాహ చట్టాలపై అవగాహన కల్పించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రధాన జిల్లా న్యాయాధికారి ఎ.పార్వతి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై దుప్పట్లను పంపిణీ చేశారు. గిరిజన హక్కుల రక్షణ - అమలు, ఆదివాసుల హక్కులు, అమలుపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సీనియర్ సివిల్ న్యాయాధికారి షేక్ ఇబ్రహీం షరీఫ్, జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎ.ఓంకార్ మాట్లాడుతూ బాల్యవివాహాలను నివారించాలని అన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మానాయక్ మాట్లాడుతూ 1వ తరగతి నుంచి పీజీ వరకు విద్యను అభ్యసించే అవకాశం ప్రభుత్వం చేస్తున్నదని అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు జీవనజ్యోతి పథకం ద్వారా సహాయం చేస్తామని, డప్పు, చర్మ కళాకారులకు 45 ఏళ్ల పైబడిన వారికి పింఛన్‌లు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ నివారణకు కృషి చేద్దాం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ కమిషనర్ రవీంద్ర

అద్దంకిటౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): చేతులు కలపండి, అవగాహన పెంచుకోండి, కలిగి ఉండండి అంటూ హెచ్‌ఐవీ నివారణ కోసం మన వంతు కృషి చేద్దాం అని, సమాజంలోని ప్రతిఒక్కరూ ఈ ప్రతిజ్ఞతో ముందుకు సాగుదాం అని మున్సిపల్ కమిషనర్ రవీంద్ర అన్నారు. శనివారం హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నిర్మూలనకు అవగాహన, 60 రోజుల ప్రచార కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన పోస్టర్‌ను కమిషనర్ రవీంద్ర తన కార్యాలయంలో ఆవిష్కరించారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధి ఏవిధంగా సంక్రమిస్తుందని, రాకుండా ముందుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు అ వగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ బలరామ్‌రెడ్డి, ఔట్రీచ్ వర్కర్ దుర్గ భవాని, టి.లక్ష్మి, తేజస్విని పాల్గొన్నారు.

టిప్పర్‌ను ఢీకొని కారు బోల్తా

● కారులో ప్రయాణిస్తున్న ఇరువురికి గాయాలు


రోడ్డుపై అడ్డంగా బోల్తా కొట్టిన కారు

ఒంగోలు క్రైం, ఆగస్టు30 (ఆంధ్రజ్యోతి): టిప్పర్‌ను వెనుక నుంచి కారు ఢీకొట్టి వెనువెంటనే బోల్తా పడింది. ఈ సంఘటన ఒంగోలులోని పాలకేంద్రం సమీపంలో కర్నూల్ రోడ్డుపై జరిగింది. ఒంగోలు నుంచి చీమకుర్తి వెళుతున్న టిప్పర్‌ను వెనుక వైపు నుంచి వేగంగా వెళ్ళి కారు ఢీ కొట్టింది. దీంతో టిప్పర్ వెనుక భాగంలో తగలడంతో కారు బోల్తా పడింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న డోకల గోరు నాయుడు, అశ్విని భరద్వాజ్‌లకు స్వల్పగాయాలు కాగా క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ట్రాఫిక్‌కు ఆటకం లేకుండా కారును రోడ్డు మీద నుంచి పోలీసులు పక్కకు తొలగించారు.

ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగుల ఇబ్బందులను తొలగించాలి


ఆర్ఎం సత్యనారాయణకు వినతిపత్రాన్ని అందజేస్తున్న కాలేషా

ఒంగోలు కార్పొరేషన్ ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించేలా చర్యలు తీసుకోవాలని నవ్యాంధ్ర దివ్యాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ కాలేషా కోరారు. శనివారం ఒంగోలులో ఆ ర్టీసీ రీజనల్ మేనేజర్ సత్యనారాయణను కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు కేటాయించిన సీట్లలో సాధారణ ప్రయాణికులు కూర్చుంటున్నారని, దీంతో దివ్యాంగులు నిలబడి ప్రయాణం చేయాల్సి వస్తుందని తెలిపారు. దివ్యాంగులు తమ సీట్లు తమకే ఇప్పించాలని బస్సులోని కండక్టర్లకు చెప్పినా పెడచెవిన పెడుతున్నారని ఫిర్యాదు చేశారు. కొన్ని బస్సుల్లో దివ్యాంగులకు కేటాయించిన సీట్లపై బోర్డులు లేవన్నారు. దీనిపై స్పందించిన ఆర్ఎం, ఆయా అంశాలపై తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ఆర్‌అండ్‌డీ సెల్ ప్రారంభం

సంతనూతలపాడు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఎండ్లూరు డొంకవద్ద నున్న ఆర్‌జీయూకేటీ ఒంగోలు క్యాంపస్‌లో శనివారం ఆర్ అండ్ డీ(హైయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ కాంపిటేటివ్‌సెల్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్)ను విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ అమరేంద్రకుమార్ సాండ్రా ప్రారంభించారు. పరిశోధనాత్మక కార్యకలాపాలు నిర్వహించే ఆవిష్కరణలకు వేదిక అవుతుందని తెలిపారు. ఈ సెల్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు.

పేదలకు.. తోడ్పాటు

(5వ పేజీ తరువాయి)

పెట్టుకుని రీసెటిల్‌మెంట్ యాక్షన్ ప్లాన్ అమలు చేయనున్నారు. రాజధాని అమరావతిలో మార్చి, 2015లో నిర్వహించిన సోషియో ఎకనమిక్ సర్వే అనంతరం 2018 నాటికి అప్‌డేట్ చేసిన ప్రకారం 21,530 మంది భూమిలేని పేదలు ఉన్నారు. అనూహ్యంగా ఫిబ్రవరి 1, 2025 నాటికి భూమిలేని పేదలు 17,164గా తేలారు. వీరిలో 857 భూమిలేని కుటుంబాలు ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలను అందుకుంటున్నాయి. స్కిల్ డెవలప్‌మెంట్ వంటి కార్యక్రమాలు కూడా భూమిలేని పేదలకు ఉపాధి అవకాశాలను కల్పించాయి. పదేళ్లపాటు నెలకు రూ.2,500 చొప్పున పెన్షన్ అందిస్తోంది. ఆ తర్వాత రూ.5 వేలకు పెంచింది. 2015-16లో రూ.58.41 కోట్ల పెన్షన్లు ఇవ్వగా, 2024-25 నాటికి రూ.94.51 కోట్ల మేర పెన్షన్లు ఇచ్చారు. ఈ పదేళ్లలో రూ.631.51 కోట్లను పెన్షన్‌గా ఇచ్చారు. ఇల్లులేని వారి కోసం గృహ నిర్మాణ పథకాన్ని చేపట్టింది. టిడ్కో ఇళ్ల నిర్మాణంలో భాగంగా రాజధాని అమరావతిలోని అనంతవరం, దొండపాడు, తుళ్లూరు, ఐనవోలు, మందడం, నిడమర్రు, నవులూరు, పెనుమాక గ్రామాల్లో 44.5 ఎకరాల విస్తీర్ణంలో 5,024 ఫ్లాట్లతో కూడిన గృహ నిర్మాణాన్ని తలపెట్టింది. ఏడాది మొత్తం ఉపాధి హామీ పథకాన్ని అమల్లోకి తీసుకువచ్చింది. పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి వీలుగా రూ.25 లక్షల వరకు వడ్డీ లేని రుణాలను కూడా అందిస్తున్నారు. అలాగే స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ద్వారా వారి జీవనోపాధికి బాటలు వేస్తోంది. ఉచిత విద్య, వైద్యం వంటి సదుపాయాలను కూడా కల్పిస్తోంది.

ఐదు నిమిషాల తర్వాత అయితే..


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న మైన్స్ డీడీ రాజశేఖర్

- పెను ప్రమాదానికి ఆస్కారం
- మిడ్‌వెస్ట్ క్వారీలో కార్మికులకు తప్పిన ప్రాణముప్పు
- సంఘటనా స్థలంలో ప్రాథమిక విచారణ చేపట్టిన మైన్స్ డీడీ
- కన్నెత్తి చూడని సేఫ్టీ అధికారులు
- క్వారీల్లో ప్రమాదాల నివారణ చర్యలపై ఎస్పీ దృష్టి

చీమకుర్తి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఐదు నిమిషాల వ్యవధి..పదుల సంఖ్యలో వలస కార్మికుల ప్రాణాలను నిలబెట్టింది. మిడ్‌వెస్ట్ గెలాక్సీ గ్రానైట్ క్వారీలో శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదంలో అదృష్ట వశాత్తు కార్మికులు ప్రాణాపాయంనుంచి బయటపడ్డారు.ప్రమాదం సరిగ్గా భోజనవిరామం ముగింపునకు ఐదునిమిషాలు ముందు జరిగింది. ఇదే ప్రమాదం మరో ఐదునిమిషాల తర్వాత జరిగి ఉంటే భోజనవిరామం ముగింపు తర్వాత క్వారీ పిట్‌లోకి పనుల నిమిత్తం కార్మికులు చేరుకొని ఉండేవారు. ఇదే జరిగితే జారిపడిన రాళ్లకింద కార్మికుల బతుకులు బండబారి ఉండేవి. శనివారం ప్రమాద సంఘటనను పరిశీలించటానికి క్వారీకి వచ్చిన మైన్స్ డీడీ రాజశేఖర్‌కి క్వారీ ప్రతినిధులు తెలియజేస్తుంటే అది విన్న అధికారులు అప్రయత్నంగా థ్యాంక్స్ గాడ్ అని ఒకేసారి అనటం సంఘటన తీవ్రతను తెలియజేస్తుంది. ఐదు నిమిషాల తర్వాత ఇదే ఘటన జరిగిఉంటే ఎంతటి ఘోర ప్రమాదం జరిగిఉండేదో తెలియజేస్తుంది.

క్వారీ పైనుంచిన రాళ్లు జారిపడి...


ప్రమాదం జరిగిన స్థలంలో ప్రస్తుత స్థితి

ప్రమాదం జరిగిన సంఘటనా స్థలాన్ని మైన్స్ డీడీ రాజశేఖర్ తన సిబ్బందితో కలిసి శనివారం పరిశీలించారు. సంఘటనపై ప్రాథమిక విచారణ జరిపారు. క్వారీ నుంచి వెలికి తీసిన రాళ్లు పిట్‌నుంచి పైకి తీసుకెళ్లిన తర్వాత వాటిని ఒడ్డుపై ఉంచారు. అలా ఉంచిన రాళ్లు పిట్‌లోకి జారిపడి ప్రమాదం జరిగిందనే విషయాన్ని మైన్స్ అధికారులు తమ ప్రాథమిక విచారణలో తేల్చారు. ప్రమాద రహితంగా క్వారీయింగ్ కార్యకలాపాలు నిర్వహించాల్సిన బాధ్యతాయుతమైన మైన్స్ మేనేజర్లు, వారిని పర్యవేక్షించాల్సిన మైన్స్‌సేఫ్టీ యంత్రాంగం నిర్లక్ష్యవైఖరి సంఘటన జరగటానికి ప్రధాన కారణంగా కనబడుతోంది. క్వారీల్లో ప్రమాదాలు నివారించటమే ప్రధాన బాధ్యత కల్గిన మైన్స్ మేనేజర్లకు క్వారీ యాజమాన్యం బంధనాలు వేసి పూర్తిస్థాయిలో వారి బాధ్యతలను వినియోగించే వీలులేకుండా చేస్తుండటం గ్రానైట్ క్వారీల్లో ప్రమాదాల పరంపరకు కారణభూతమవుతోంది.వాటిని అనునిత్యం పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు సరిదిద్దాల్సిన మైన్స్ సేఫ్టీ అధికారులు భద్రతావారోత్సవాల సమయంలో తప్ప కనపడకపోవటంతో యజమానులు ఇష్టారీతిన నిబంధనలను తుంగలో తొక్కుతూ ఆదాయమే పరమావధిగా క్వారీయింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు.దీనివలన క్వారీ కార్మికుల ప్రాణాలు గాల్లో దీపాల్లా మారాయి.శుక్రవారం రాత్రి ఇంత ప్రమాదం జరిగినా హైదరాబాదులో ఉన్న మైన్స్‌సేఫ్టీ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడకపోవటం వారితీరుకు అద్దం పడుతోంది. నెల్లూరులో ఉన్న మైన్స్‌సేఫ్టీ కార్యాలయాన్ని ఏపీలో కాకుండా తెలంగాణలో ఉన్న హైదరాబాదుకు రెండేళ్ల క్రితం తరలించారు. దీంతో తెలంగాణ నుంచి ఏపీలో ఉన్న క్వారీలను సేఫ్టీ అధికారులు పర్యవేక్షిస్తుండటం జరుగుతోంది. ఈ విధంగా పర్యవేక్షణ జరుగుతుండటంతో క్వారీల్లో భద్రత డొల్లగా మారింది. గత కొన్నినెలల్లోనే బల్లికురవ, చీమకుర్తి పరిధిలోని గ్రానైట్ క్వారీల్లో మూడు ప్రమాదాలు చోటుచేసుకున్నా అధికారుల తీరులో మార్పురాలేదు. ఇప్పటికైనా హైదరాబాదుకు తరలించిన డీడీఎంఎస్ కార్యాలయాన్ని వెంటనే ఒంగోలుకు తరలించి క్వారీల్లో సేఫ్టీ అధికారుల పర్యవేక్షణ అనునిత్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘనాయకులు, వలస కార్మికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ప్రమాదాల నివారణకు పోలీసుపరంగా చర్యలు:

● ఎస్పీ ఏఆర్ దామోదర్

గెలాక్సీ గ్రానైట్ క్వారీల్లో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటుండటంతో జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ప్రమాదాల నివారణపై దృష్టిసారించారు.శనివారం సాయంత్రం చీమకుర్తి పోలీస్‌స్టేషన్‌కు విచ్చేసిన ఆయన చీకటి పడటంతో క్వారీని సందర్శించలేకపోయారు. ప్రమాద సంఘటనపై సమీక్ష జరిపారు. భవిష్యత్‌లో ప్రమాదాల నివారణకు పోలీస్ పరంగా తీసుకోవాల్సిన చర్యలపై సీఐ సుబ్బారావు,సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు.

నూతన సాంకేతికతను విలేకరులు అందిపుచ్చుకోవాలి

ఎస్పీ దామోదర్

మొదలైన సీఆర్ మీడియా అకాడమీ పునశ్చరణ తరగతులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

మార్కాపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంత విలేకరులు మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన సాంకేతిక పద్ధతులను అందిపుచ్చుకొని నాణ్యతతో కూడిన రిపోర్టింగ్ చేయాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. స్థానిక సౌజన్య ఫంక్షన్ హాలులో సీఆర్ మీడియా అకాడమీ, ఆంధ్రప్రదేశ్, ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా విలేకరులకు పునశ్చరణ తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ నేర వార్తల విషయంలో ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేయకుండా ఉండాలన్నారు. చిన్నపాటి విషయాలను కూడా పెద్దవిగా చూపడం వలన ప్రజలను తప్పుదోవ పట్టించినట్లు అవుతుందన్నారు. వెనుకబడిన మార్కాపురం డివిజన్‌లో ఎన్నో రకాలైన మోసాలు జరుగుతున్నాయన్నారు. ముఖ్యంగా ఉద్యోగాల వల ఆశకు చిక్కిన బాధితులు ఎంతోమంది ఉన్నారన్నారు. అలాంటి వారితోపాటు సైబర్‌మోసాలు, ఆర్థిక మోసాలకు గురయ్యేవారిని చైతన్యవంతులను చేయాలన్నారు. సమాజాన్ని పట్టిపీడిస్తున్న గంజాయి, మత్తు పదార్థాల అనర్థాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత మీడియాదే అన్నారు. సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ మాట్లాడుతూ పాత్రికేయులు వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవడమే అకాడమీ లక్ష్యమన్నారు. అకాడమీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛను వక్రీకరించి మీడియా స్వేచ్ఛ కింద ఇష్టారీతిన వ్యవహరించడం ఉల్లంఘన అవుతుందన్నారు. కొన్ని మీడియా సంస్థలు ఈ విధంగా వ్యవహరిస్తున్నాయన్నారు. అది మంచి పద్ధతి కాదన్నారు. మరో అతిథి, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేందుకు పాత్రికేయులు కీలక పాత్ర పోషించాలన్నారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ గ్రామీణ విలేకరులు శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వృత్తి నైపుణ్యాలను ఎప్పటికప్పుడు పెంపొందించుకుంటేనే ఏ రంగంలోనైనా రాణిస్తారన్నారు. అనంతరం ఉదయం 11.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు మూడు అంశాలపై తొలిరోజు శిక్షణ ఇచ్చారు. క్రైమ్ రిపోర్టింగ్ గురించి ఆంధ్రజ్యోతి క్రైమ్ బ్యూరో ఎస్.రమేష్, గ్రామీణ వార్తలు, కథనాలు గురించి ఐజేయూ సెక్రటరీ జనరల్ డి.సోమసుందర్, ఫ్యాక్ట్ చెక్ గురించి హన్స్ ఇండియా సీనియర్ రిపోర్టర్ ఎన్.నరేష్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి, ఉదయ్ శాట్‌విజన్ ఎండీ నూర పరమేశ్వరరెడ్డి, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి ఎ.సురేష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌వీ రమణ, కనకయ్య, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు వెంకటరావు, మార్కాపురం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు డి.మోహన్‌రెడ్డి, జిల్లాలోని పలు మండలాలకు చెందిన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా మున్సిపల్ సమావేశం

● సమయపాలన పాటించకపోవడంపై ప్రశ్నించిన టీడీపీ కౌన్సిలర్లు


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ

అద్దంకి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి మున్సిపల్ సమావేశం చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షన శనివారం మొక్కుబడిగా సాగింది. మొత్తం 9 అంశాల అజెండాతో ప్రారంభమైన సమావేశం పట్టుమని 9 నిమిషాలలోనే పూర్తయ్యింది. సమావేశం ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సిన మున్సిపల్ సమావేశం సుమారు 20 నిమిషాలు ఆలస్యంగా ప్రారంభం కావడంపై టీడీపీ 6వ వార్డు కౌన్సిలర్ కంపా రజనీ ప్రశ్నించారు. సమయపాలన పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తే కౌన్సిలర్లు వేచి ఉండాలా..? అని ప్రశ్నించారు. అజెండాను ముందస్తుగా పంపించకుండా ను ఒకటి, రెండు రోజులు ముందు మా త్రమే ఇవ్వటం పట్ల వైసీపీ కౌన్సిలర్ లు 16,1 వార్డుల వైసీపీ కౌన్సిలర్లు రమణ, బాలులు ప్రశ్నించారు. ఎలాంటి అభివృద్ధి పనుల పై చర్చ జరగకుండానే మున్సిపల్ సమావేశం ముగిసింది. మేనేజర్ శ్రీదేవి, పలు శాఖల అధికారులు, కౌన్సిలర్ లు పాల్గొన్నారు.

ఏజీపీ రామకోటయ్యకు పలువురి అభినందన


ఏజీపీ బత్తుల రామకోటయ్యను అభినందిస్తున్న ముస్లిం నేతలు

అద్దంకి,ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): అద్దంకి కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్(ఏజిపి)గా నియమింప బడ్డ టీడీపీ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు బత్తుల రామకోటయ్య ను శనివారం పలువురు ముస్లిం నేతలు కలిసి అభినందించారు. అద్దంకి మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్, ముస్లిం సంక్షేమ సంఘం రా ష్ట్ర లీగల్ ఇంచార్జ్ షేక్ అబ్దుల్ జబ్బార్, ఐటీడీపీ అద్దంకి నియోజకవర్గ అధ్యక్షుడు డు షేక్ కరిముల్లా, షేక్ రసూల్,షేక్ మస్తాన్‌సాహేబ్ లతో పాటు పలువురు సంతమాగులూరు మండల ముస్లిం నేతలు రామకోటయ్య ను కలిసి అభినందించారు.

శ్రీకృష్ణుడి విగ్రహం

మోటుపల్లి తీరానికి వచ్చిన


తీరానికి కొట్టుకొచ్చిన విగ్రహాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రభాకర్‌రావు (ఇన్‌సెట్లో) కృష్ణుని విగ్రహం

చినగంజాం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా చినగంజాం మండలంలోని మోటుపల్లి సముద్ర తీర ప్రాంతానికి శ్రీకృష్ణుని రాతి విగ్రహం కొట్టుకొచ్చింది. శనివారం ఉదయం గణనాథులను నిమజ్జనం చేయడానికి సముద్రంలోనికి వెళ్లిన భక్తుల కాళ్లకు విగ్రహం తగిలింది. దానిని భక్తులు సముద్రపు ఒడ్డుకు చేర్చారు. తీర ప్రాంతానికి శ్రీకృష్ణుని విగ్రహం బయటకు వచ్చిన విషయం తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావుకు సమాచారం అందడంతో ఆయన వెళ్లి విగ్రహాన్ని పరిశీలించారు. చీరాల ఆర్డీవో టి.చంద్రశేఖర్‌నాయుడు ఆదేశాల మేరకు నాగులుప్పలపాడు మండలంలోని కనుపర్తి పురావస్తుశాఖ వారికి భద్రత, విచారణ నిమిత్తం పంపనున్నట్లు తెలిపారు. మోటుపల్లి గ్రామ రెవెన్యూ అధికారి పి.నాగరాజురెడ్డి ద్వారా శ్రీకృష్ణుని విగ్రహాన్ని పురావస్తుశాఖ వారికి అప్పగిస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

సముద్రం నుంచి బయటకు వచ్చిన శ్రీకృష్ణుని విగ్రహం మూడు అడుగుల ఎత్తు ఉంది. తల పక్కన శంఖుచక్రాలు, చేతిలో పిల్లనగ్రోవి, విగ్రహం అడుగు భాగం కాళ్ల వద్ద ఇరువైపులా అమ్మవార్ల బొమ్మలు ఉన్నాయి. సముద్రపు ఒడ్డున పెట్టిన విగ్రహానికి భక్తులు పూజలు నిర్వహించారు.

డీఎస్సీలో.. సర్టిఫికేట్లు

(5వ పేజీ తరువాయి)

గుంటూరు జీజీహెచ్ వైద్యుల పరిశీలనలో వెలుగుచూసింది. కొంతమంది అభ్యర్థులు 70 శాతానికిపైగా వినికిడి సమస్య ఉన్నట్లు సర్టిఫికెట్లు తెచ్చుకున్నారు. వారికి అసలు వినికిడి సమస్య లేదని వైద్యులు ధృవీకరించారు దీంతో వైకల్యం కోటాలో టీచర్ పోస్టుకు ఎంపికైన సదరు అభ్యర్థుల సర్టిఫికెట్లను పూర్తిస్థాయిలో విచారించాలని విద్యాశాఖ అధికారులు నిర్ణయించారు. మరికొందరు కంటి సమస్యలు ఉన్నట్లు చూపి ఉద్యోగాలు పొందేందుకు ప్రయత్నించగా ప్రభుత్వ ఆస్పత్రిలో సామర్థ్య పరీక్షల్లో బోగస్ అని తేలింది. ఈ బోగస్ సర్టిఫికెట్ల విషయాలను రాష్ట్రస్థాయి అధికారులకు జిల్లా అధికారులు సమాచారం ఇచ్చారు.

స్వామిత్వ సర్వేను వేగవంతం చేయాలి

● చదలవాడలో సర్వేను పరిశీలించిన ఎంపీడీవో

నాగులుప్పలపాడు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): స్వామిత్వ సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీవో తేళ్ల రవికుమా ర్ సూచించారు. చదల వాడ గ్రామంలో జరుగు తున్న స్వామిత్వ సర్వేను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఖాళీ స్థలాలు, నివాస గృహాల వివరాలను కచ్చితత్వంగా సర్వేలో పొందుపరచాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌లతో ఎన్టీఆర్ భరోసా పించన్ల పంపిణీపై అవగాహన కల్పించారు. .ఇటీవల సదర మ్ పునఃపరిశీలన అనంతరం అనర్హత పొందిన దివ్యాంగులకు నోటీసులు జారీ చేశామని, నోటీసు అందుకొని అప్పీలు చేసుకొన్న వారికి యథావిధిగా పింఛను నగదు అందించాలని సూచించారు. కార్యక్రమంలో జూనియర్ సహాయకురాలు శకుంతల తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారు. సంఘం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం ఒంగోలు నగరం బందరురోడ్డులోని శారదాబాలకు టీర్ సచివాలయంలో రండి టీ తాగుతూ మాట్లా డుకుందాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాయల ఉద్యోగులు తమ సమస్యలను సంఘం దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల సమస్యలను సంఘం రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేలా తనవంతు కృషి చేస్తానని తెలిపా రు. అందువల్ల ఎలాంటి ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు ప్రభాకర్, గోపీ, వినయ్, వెంకటేష్, సురేష్, స్వాతి, అబ్బయ్య, అర్చన, మీనా, తిరుపతయ్య, వినయ్, సరిత తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ఉద్యోగుల సమస్యలపై రాష్ట్ర సంఘం అధ్యక్షుడు సూ ర్యనారాయణ మాట్లాడిన అంశాలను ఉద్యోగుల దృష్టికి తీసుకెళ్లారు.

వామ్మో.. మర్రిపూడి గ్రంథాలయం!

- కూలేందుకు సిద్ధంగా ఉన్న భవనం
- తడిసిముద్దవుతున్న పుస్తక సంపద
- లోపలికి అడుగుపెట్టేందుకు జంకుతున్న పాఠకులు


శిథిలావస్థకు చేరిన గ్రంథాలయం

మర్రిపూడి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలు. విలువైన పుస్తక సంపద చారిత్రక సాక్ష్యాలకు ప్రతీకలు. ఎందరో నిరుద్యోగ యువకులకు విజ్ఞాన జ్యోతులు వెలిగించిన పురాతణ గ్రంథాలయం నేడు శిథిలావస్థకు చేరింది. మండల కేంద్రమైన మర్రిపూడిలో 65 ఏళ్ల క్రితం ఆనాటి గ్రామ పెద్దలు ముందుచూపుతో యువతి, యవకులకు విజ్ఞాన కాంతులు పంచాలనే ఉద్దేశంతో నెహ్రూ పుస్తక బాండా గారాన్ని ఏర్పాటు చేశారు. అత్యంత విలువైన పుస్తక సంపదను సేకరించి భద్రపరిచారు. విలువైన టేకు కల పతో బీరువాల్లో భద్రపరిచారు. ఎన్నో పురాతన ఇతిహా సాలు సాంఘిక నవలలు సాంకేతిక పరిజ్ఞానాన్ని అంది ంచే సంచికలను భద్రపరిచారు. గ్రామానికి చెందిన వం దలాది మంది నిరుద్యోగ యువకులు ఈ అవకావాన్ని అందిపుచ్చుకొని పలు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులుగా స్థిరపడ్డారు. ఎన్టీఆర్ సారథ్యంలో టీడీపీ ప్రభుత్వం ఏ ర్పడిన తరువాత తెలుగు విజ్ఞాన సమాచార కేంద్రాల ను ప్రతి మండల కేంద్రాల్లో ఏర్పాటు చేశారు. అప్పట్లో గ్రామ పెద్దలు నెహ్రూ పుస్తక బాండాగారానికి సంబం ధించిన సొంత భవనాన్ని విలువైన పుస్తక సంపదను ఖరీదైన టేకు ఫర్నీచర్‌ను జిల్లా గ్రంథాలయ సంస్థకు అ ప్పగించారు. గత 40 ఏళ్లుగా తెలుగు విజ్ఞాన సమాచా ర కేంద్రం 60 ఏళ్ల క్రితం నిర్మించిన పురాతన భవనం లోనే కొనసాగుతోంది. దివంగత మాజీ మంత్రి దామచ ర్ల ఆంజనేయులు హయాంలో భవనాన్ని ఆధునీకీకరించారు. అప్పటి నుంచి మరమ్మతులు చేపట్టకపోవడంతో భవనం పైకప్పు, దంతెలు పూర్తిగా విరిగిపోయాయి. పైకప్పుకు వేసిన నాపరాళ్లు మొతకబారి ముక్కలై పాఠకులపై పడుతున్నాయి. దీంతో అడపాదడపా వచ్చే పాఠకులు సైతం గ్రంథాలయం లోపలికి రావాలంటే భయపడిపోతున్నారు. వరండాలోనే కాలక్షేపం చేసి వెళుతున్నారు. కొద్దిపాటి వర్షానికే వర్షపు నీరు భవనంలోకి చేరుతుంది. దీంతో విలువైన పుస్తక సామగ్రి తడిసి పాడైపోతోంది. ఇప్పటికే వందలాది పుస్తకాలు చెదలుపట్టి పాడైపోయాయి. కనీసం పైకప్పు తొలగించి పాతగోడల పైనే శ్లాబు ఏర్పాటు చేయాలని స్థానికులు ఎన్నోరోజుల నుంచి కోరుతున్నారు. ఆరు నెలల క్రితం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పలువురు సభ్యులు గ్రంథాలయం దుస్థితిని ఎంపీపీ వాకా వెంకటరెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన రూ.3 లక్షలతో పైకప్పు శ్లాబు వేసేందుకు మండల పరిషత్ సాధారణ నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో ఏక్షణమైనా గ్రంథాలయ భవనం కూలిపోయో ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.


దంతెలు విరిగి కూలేందుకు సిద్ధంగా ఉన్న పైకప్పు

అవీ..ఇవీ..

పైపులైను నిర్మాణంపై అభ్యంతరాలు



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న దళితులు

ఇంకొల్లు, ఆగస్టు 30, (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు మండలంలోని కట్టావారిపాలెం, నల్లతోటివారిపాలెం గ్రామాలలోని రామయ్యకుంట నుంచి ఓ కోల్డ్‌స్టోరేజి యాజమాన్యం పైపులైను తమ భూములలో నుంచి వేస్తున్నారని అభ్యంతరాలు తెలుపుతూ తహసీల్దారు శ్రీనివాస్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా కుంటలో నుంచి నీటిని వినియోగించేందుకు పైపులైన్ల నిర్మాణానికి తమ భూములలో తవ్వుతున్నారని రెండు గ్రామాల దళితులు స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. గ్రామం పక్కన మరో కెమికల్ ప్యాక్టరీ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. దీనిన ద్వారా కాలుష్యం పెరిగి పంటలకు, ప్రజలకు నష్టం జరుగుతుందని వాపోయారు. వీటి పనులు వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నాగండ్ల వెంకట్రావు, నలతోటి భానుప్రసాద్, పిచ్చయ్య, జాన్సన్, లాజరు, రమేష్, సింగయ్య, చంద్రశేఖర్, సుందరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో విద్యాప్రమాణాలు పెంచాలి

మార్టూరు, ఆగస్టు30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించే విద్యార్థుల విద్యాప్రమాణాలు పెంచేవిధంగా ఉపాధ్యాయులు కృషిచేయాలని ఎంఈవో వస్రాంనాయక్ అన్నారు. శనివారం మండలంలో మార్టూరు, ద్రోణాదుల, వలపర్ల, కోలలపూడిలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. ఈ కాంపెక్స్ సమావేశాలకు నోడల్ అధికారులుగా ఎంఈవోలు వస్రాంనాయక్, కే.ప్రేమలతలు, అదేవిదంగా బి చలపతి, ఎ.శ్రీనివాసరావులు వ్యవహరించారు ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులపట్ల పాటించవలసిన విధానాలను నోడల్ అధికారులు వారికి సూచించారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు రమేష్‌బాబు, రామారావు, శ్రీనివాసరావు, తిరుపతమ్మలు పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో దిగుబడులు మెండు



రైతులకు అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

పందిళ్లపల్లి (చీరాల), ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయంలో విత్తనశుద్ధి కషాయాలతో దిగుబడులు మెండుగా ఉంటాయని ప్రిపేర్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు తెలిపారు. శనివారం వేటపాలెం మండల పరిధిలోని పందిళ్లపల్లి గ్రామంలో చీరాల, చినగంజాం, వేటపాలెం మండలాలకు చెందిన రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆకులు, వేర్లు, కాండం నుంచి తయారు చేసిన కషాయాల విధివిధానాల పట్ల అవగాహన కల్పించారు. విత్తనశుద్ధి, కార్బన్ ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో సంస్థ సమన్వయకర్త రవిచంద్ర, ఆశ, కమ్యూనిటీ హెల్త్ సిబ్బంది శ్రీలేఖ, పావని, నాగజ్యోతి, మెర్సీ, హెబ్సిబా, చెన్నై బృందం కార్తీక, కవిప్రీత, రైతులు పాల్గొన్నారు.

పత్తిసాగులో మెళకువలు పాటించాలి



పత్తిని పరిశీలిస్తున్న శాస్త్రవేత్త రాజేష్ చౌదరి, ఏడీఏ సుదర్శనరాజు

మార్టూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సమగ్ర యజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా గులాబిరంగు పురుగును కట్టడి చేయవచ్చునని లాంఫామ్ శాస్త్రవేత్త ఎల్.రాజేష్‌చౌదరి అన్నారు. శనివారం మండలంలోని రాజుపాలెం గ్రామంలో ఆత్మ ప్రకాశం వారి సౌజన్యంతో వివిధ రకాల పంటల సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఏవో లావణ్య అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన శాస్త్రవేత్త రాజేష్ చౌదరి రైతులతో మాట్లాడుతూ కేవలం పురుగుమందులతో మనం కీటకాలను అరికట్టలేమన్నారు. పత్తి చుట్టూ రెండు వరుసల జొన్న సజ్జ లేదా మొక్కజొన్న పంటలు దడిపంటలుగా నాటుకోవాలన్నారు. ఏడీఏ సుదర్శనరాజు మాట్లాడుతూ పొగాకుకు ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, శనగ, అపరాలును సాగుచేసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలోని ప్రత్తి పంటను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ఎంటీఎల్ రాజశేఖర్, ఎంపీఈవో గుణశేఖర్ ఆత్మ ఏటీఎం అక్షర తదితరులు పాల్గొన్నారు.

ఆ ప్రచారంతో కమిటీకి సంబంధం లేదు

అద్దంకి, ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): శింగరకొండ కాకతీయ కమ్మ సత్రం సమావేశం ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు పిన్నింటి గోపీకృష్ణ అనే వ్యక్తి ప్రచారం నిర్వహించాడు. ఆటోలలో మైకుల ద్వారా ప్రచారం చేయడంపై కమ్మసత్రం కమిటీ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆదివారం ప్రకటించిన సమావేశానికి కమ్మ సత్రం కార్యవర్గానికి ఎలాంటి సంబంధం లేదని కమిటీ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సత్రంలో కమిటీ నిబంధనలకు విరుద్ధంగా సమావేశాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ రెండు విభిన్న ప్రకటనలపై సభ్యులు ఒకింత గందరగోళానికి గురవుతున్నారు.

మహిళలకు ప్రభుత్వ ప్రోత్సాహం

- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు
- స్త్రీశక్తి విజయంపై హర్షం
- డ్వాక్రా సభ్యులకు రుణాల చెక్కు అందజేత



చెక్కును విడుదల చేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

మార్టూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా ఎదిగేందుకు మహిళలకు అవకాశాలు కల్పిస్తే వారు అద్భుతాలు చేస్తారని నమ్మిన వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. శనివారం ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో స్త్రీశక్తి విజయోత్సవ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మహిళలను ఉద్దేశించి ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే మహిళల సంక్షేమం కోసం ఎన్నో అభివృద్ధి పనులను చేపట్టిందన్నారు. సూపర్ సిక్స్ పథకంలో హామీని నెరవేర్చేందుకు నెలకు ప్రభుత్వానికి రూ.162 కోట్ల భారం పడుతున్నప్పటికీ ఈ నెల 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం ప్రారంభించిందన్నారు. అంతేగాకుండా తల్లికి వందనం అంటూ బిడ్డల భవిష్యత్తు బంగారం కావాలనే ఉద్దేశ్యంతో వారి ఖాతాలో డబ్బులు జమచేసిందన్నారు. అదేవిధంగా దీపం పథకం ద్వారా ప్రతి కుటుంబానికి 3 ఎల్పీజీ సిలిండర్లను అందచేసిన ప్రభుత్వమే కూటమి ప్రభుత్వమన్నారు. తరువాత మహిళలతో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని 77 స్వయం సహాయక సంఘాలకు రూ.11.25కోట్ల విలువైన చెక్కును గ్రూపు మహిళలకు ఎమ్మెల్యే ఏలూరి అందచేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగుమహిళ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జరుగుల సంధ్య, జయమ్మ, బత్తుల కృష్ణవేణి, ఉప్పుటూరు రమాదేవి, కర్రీ నాగేంద్రమ్మ, శారద, వనజ, పద్మావతి, రావిపాటి సంధ్య,జంపని రాధ, పలువురు మహిళలు భారీగా ఈ సదస్సుకు తరలివచ్చారు.

వారంలో పొగాకు రైతుల ఖాతాలలో నగదు జమ

పొగాకు రైతుల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లడంతో తక్షణమే రూ.55 కోట్లను విడుదల చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. రైతులఖాతాలలో వారం రోజులలో ఈ డబ్బులు జమ చేస్తారని ఎమ్మెల్యే ఏలూరి సాంబ శివరావు అన్నారు. ఆయన శనివారం ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో మార్కెట్ కమిటీ, పీఏసీఎస్, డీసీలతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన వారితో మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా పొగాకు కొనుగోలు చేపట్టామని, ఈ ప్రక్రియ ఇంకా కొనసాగుతుందన్నారు. 2029 లో కూడా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేవిధంగా రైతులకు వెన్నుదన్నుగా నిలబడి పనిచేయాలన్నారు. అంతేగాకుండా రూ.100 కోట్లతో గ్రామాలలో సీసీ రోడ్ల నిర్మాణం పనులు చేపడుతున్నామన్నారు. అనంతరం కొత్తగా ఎన్నికైన సొసైటీ చైర్మన్లు, సభ్యులను, మార్కెట్ కమిటీ అధ్యక్షులను శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ గుంజి వెంకట్రావు, సొసైటీ చైర్మన్లు కంభంపాటి హనుమంతరావు, తాటి నాగార్జున, గొట్టిపాటి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని 105 మంది లబ్దిదారులకు రూ.61,12,746లను చెక్కులను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అందచేశారు.

పేదలు, కూలీల కోసమే అన్న క్యాంటీన్ ఏర్పాటు

మార్టూరు: రాష్ట్రంలో పేదలు, కూలీలు, కార్మికులు ఆకలి తీర్చడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు అన్న క్యాంటిన్లను ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. శనివారం ఉదయం మార్టూరులో నాగరాజుపల్లి కూడలి వద్ద రూ.61 లక్షలు నిధులతో మంజూరైన అన్న క్యాంటీన్ భవననిర్మాణానికి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. మార్టూరు పట్టణంలో అవసరమైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీలైనంత త్వరగా క్యాంటిన్‌ను పూర్తి చేయాలన్నారు. అంతకు ముందు మహాలక్ష్మమ్మ అమ్మవారిని దర్శించుకొని కొబ్బరికాయ కొట్టి అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం మార్టూరు గ్రామంలో తూర్పుబజారున,పడమర బజారున ఏర్పాటుచేసిన వినాయకుని మండపాల వద్ద వినాయకుని విగ్రహాన్ని దర్శించుకొని, స్వామి వారిఆశీస్సులను అందుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తస్నీరు శ్రీనివాసరావు, పార్టీనాయకులు షేక్ రజాక్, కామినేని జనార్దన్, కమ్మ శివనాగేశ్వరరావు, తేలప్రోలు సాంబశివరావు, తాటి నాగేశ్వరరావు, పోపూరి శ్రీనివాసరావు, కాకోలు వెంకటేశ్వర్లు, గొట్టిపాటి వెంకట్రావు, సకల ఆంజనేయులు, పోలూరి సింగయ్య, మిన్నెకంటి రవికుమార్, జంపని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

స్త్రీశక్తి పథకం విజయవంతం కావడంపై ర్యాలీ

చీరాలలో ఘనంగా విజయోత్సవం



ర్యాలీలో పాల్గొన్న మహిళలు, టీడీపీ నాయకులు

చీరాల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సూపర్ సిక్స్ పథకాలు సూపర్ సక్సెస్ అయినట్లు టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్ అన్నారు. ఇటీవల స్త్రీశక్తి ఉచిత బస్సు పథకం విజయవంతం నేపధ్యంలో పట్టణంలో మహేంద్రనాధ్ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రారంభమై గడియార స్తంభం వరకు సాగిన ఈ ర్యాలీలో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల హామీలు అమలు చేసే క్రమంలో ఎక్కడా కూడా వెనుకడుగు వేయలేదన్నారు. ఒకవైపు గత ప్రభుత్వంతో అన్ని రంగాలు కుదేలై రాష్ట్రం సంక్షోభంలోకి చేరిందన్నారు. అవాంతరాలు ఎన్ని ఉన్నా ఇచ్చిన మాటకు కట్టుబడి సూపర్ సిక్స్ పథకాలు గ్రాండ్ సక్సెస్ చేసినట్లు వివరించారు. సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే కొండయ్య చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. మహిళలు కోలాటం నిర్వహించారు. అంతకుమందు నియోజకవర్గంలోని నవ రాత్రులు సందర్భంగా వినాయకుని మండపాల వద్ద నిర్వహిస్తున్న ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిమజ్జన సందడి మొదలు



పొట్టిసుబ్బయ్యపాలెం తీరంలో నిమజ్జనం చేస్తున్న భక్తులు

జాండ్రపేట(చీరాల), ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : నవరాత్రులు సందర్భంగా గణనాథుని నిమజ్జనాలు ఊపకందుకున్నాయి. నియోజకవర్గంలో పెద్దఎత్తున వినాయకుని మండపాలు ఏర్పాటయ్యాయి. ఈక్రమంలో భక్తులు అంగరంగం వైభవంగా ర్యాలీలు చేస్తూ, బొజ్జ గణపయ్యను స్మరిస్తు నిమజ్జనాలు చేస్తున్నారు. మండల పరిధిలోని జాండ్రపేటలో సీనియర్ టీడీపీ నాయకులు సిద్ధి బుచ్చేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం కమిటీ ప్రతినిధులు శనివారం భారీ ఊరేగింపు చేశారు. అనంతరం వేటపాలెం పరిధిలోని పొట్టిసుబ్బయ్యపాలెం వద్ద నిమజ్జనం చేశారు. సుఖశాంతులు వర్ధిల్లాలని గణపతిని కోరుకున్నారు.

మార్టూరులో నిమజ్జనాల సందడి

మార్టూరు : మండపాల నుంచి వినాయకుని విగ్రహాలను నిమజ్జనాలకు తరలించే క్రమంలో శనివారం మార్టూరులో భక్తుల సందడి మొదలైంది. మార్టూరులో నాగరాజుపల్లి రోడ్డులోని సాయిమల్లికార్జున అపార్ట్‌మెంట్ నుంచి ప్రత్యేక వాహనంలో బయలుదేరిన వినాయకుని నిమజ్జనం కార్యక్రమానికి మహిళలు, యువకులు ప్రత్యేక అలంకరణ వస్త్రాలతో ఊరేగింపుగా నిమజ్జనానికి బయలుదేరారు. అదేవిధంగా విద్యానగర్ నుంచి వివిధ వీధులలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాలను ట్రాక్టరుపై ఊరేగిస్తూ నిమజ్జనాలకు తీసుకువెళ్లారు. కొంతమంది బొల్లాపల్లి సాగర్ కాలువలో నిమజ్జనం చేయగా, మరికొంతమంది వాగులోని చెక్ డ్యాంలో నిమజ్జనం చేశారు. దాదాపుగా పట్టణంలో ఐదుకు పైగా వినాయకుని విగ్రహాలను నిమజ్జనాలకు భక్తులు తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఊరేగింపులు, తప్పెట్లు, తాళాలు, డప్పులతో వీ ధులు కోలాహలంగా మారాయి. దారి పొడవునా వారు ప్ర సాదాలను పంపిణీ చేశారు.



నాగరాజుపల్లెలో నిమజ్జనానికి బయలుదేరుతున్న వినాయకుడు

వైభవంగా వినాయక నిమజ్జనాలు

మేదరమెట్ల : వినాయక చవితి పర్వదినం సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాలల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం మండలంలోని పలు గ్రామాలల్లో మూడు రోజులు పూజలు అందుకున్న వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలిస్తున్నారు. పలు చోట్ల అన్నదానాలు, భారీఎత్తున ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తూ, నిమజ్జన యాత్రలు చేస్తున్నారు. మండలం మొత్తం మీదగా 45 పైగా విగ్రహాలు ఏర్పాటు చేశారు. మేదరమెట్ల కూడలి లో ఆర్యవైశ్యులు ఏర్పాటు చేసిన విగ్రహం నిమజ్జనం సందర్భంగా మహిళలు కోలాటం నిర్వహించారు. రంగులు చల్లుకుంటూ ఉత్సహంగా నిమజ్జనానికి తరలారు.

స్వామిత్వ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలి



సర్వేను పరిశీలిస్తున్న ప్రభాకరరావు

బల్లికురవ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో నిర్వహిస్తున్న స్వామిత్వ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకరరావు కోరారు. శనివారం బల్లికురవ మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో డీపీవో సర్వేపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్‌లో సర్వే నమోదు వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే పూర్తి అయితే ప్రజలకు ఎంతో ఉపయెగమన్నారు. ప్రజల ఆస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ద్వారా వారికి హక్కులు కలుగుతాయన్నారు. 11 గ్రామాలలో ఈసర్వే చేపడుతున్నామని పంచాయతీ కార్యదర్శులు తెలిపారు. మిగిలిన గ్రామాలలో కూడా వెంటనే ప్రారంభించాలని కోరారు. పరిశీలనలో ఎంపీడీవో కుసుమకుమారి, పలు గ్రామాల పంచాయతీ కార్యర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న జయసింహ

అద్దంకిటౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల రాకుండా ఆయా వార్డులలో ఆరోగ్య సిబ్బంది అందరూ ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ గొట్టిపాటి జయసింహ సూచించారు. శనివారం గాజులపాలెం యూపీహెచ్‌సీ ఆరోగ్య సిబ్బందితో సీజనల్ వ్యాధులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దోమల వలన వచ్చే డెంగ్యూ, మలేరియా, వంటి వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. శానిటేషన్ చేసుకునే విధానాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. కలుషిత నీరు, ఆహారం వలన వచ్చే టైఫాయిడ్ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రెండు రోజులకు మించి జ్వరము ఉంటే స్థానిక వైద్యశాలలో రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. దోమలు కుట్టకుండా దోమ తెరల వినియోగం, కిటికీలకు, తలుపులకు మెస్‌లు, ఇంటి పరిసర ప్రాంతాలలో మురుగునీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

వైఏ కళాశాలకు వాటర్ డిస్పెన్సర్ బహూకరణ

చీరాల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు విశ్రాంత ఉపాధ్యాయులు ఫణిదపు శివాంజనేయ ప్రసాద్ వాటర్ డిస్పెన్సర్ బహుకరించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డా.మురళీ మాట్లాడుతూ కళాశాలకు తోడ్పాటు అభినందనీయమన్నారు. దాతలు 2003లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్న విషయాన్ని గుర్తు చేశారు.

గడియారస్తంభం ఏర్పాటుకు ప్రణాళిక



స్తంభం ఏర్పాటుపై సర్వే చేస్తున్న అధికారులు, సూచనలిస్తున్న చైర్మన్

చీరాల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గడియార స్తంభం ఏర్పాటుకు మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు ప్రణాళిక చేపట్టారు. పురపాలక అధికారులతో పట్టణంలో స్థలానికి సంబంధించి సర్వే నిర్వహించారు. చీరాల చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు, పర్యాటకులకు స్పష్టమైన మార్గంగా కనిపించే గడియార స్తంభాన్ని, గతంలో పలు కారణాల నేపథ్యంలో అప్పటి పాలకులు తొలగించారు. అయితే పునర్నిర్మించేందుకు ఎవ్వరూ సాహసించలేదు. చాలాకాలంగా గడియార స్తంభం కూడలిలో అసలు ఆనవాళ్లు లేకపోవడంపై పలు విమర్శలు వచ్చాయి. అయితే ప్రజాకూటమి ప్రభుత్వంలో యథాస్థానంలో గడియారస్తంభాన్ని నిర్మించేందుకు పాలకులు అడుగులు వేశారు. ఈ నేపథ్యంలోనే శనివారం చైర్మన్ మున్సిపల్ అధికారులతో సర్వే చేపట్టారు. అనంతరం నిర్మాణానికి సంబంధించి అంచనాలు, డిజైన్‌లు సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. అక్టోబర్ మొదటి వారం నాటికి పూర్తి చేసి ప్రారంభోత్సవం చేయనున్నట్లు చైర్మన్ తెలిపారు. ఆయన వెంట టీపీవో శ్రీనివాసులు, టౌన్ సర్వేయర్ గోపీ, తదతర సిబ్బంది ఉన్నారు.

కంటి విషయంలో జాగ్రత్త అవసరం : డాక్టర్ చరిత



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ చరిత

పంగులూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ప్రతివ్యక్తి కంటి సంరక్షణ విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని శంకర్ కంటివైద్యశాల నేత్రవైద్య నిపుణులు డాక్టర్ చరిత అన్నారు. పంగులూరు రోటరీక్లబ్ ప్రాంగణంలో శనివారం రోటరీక్లబ్, శంకర్ కంటివైద్యశాల పెదకాకానివారు సంయుక్తంగా నిర్వహించిన ఉచితనేత్ర వైద్యశిబిరాన్ని రోటరీక్లబ్ అధ్యక్షులు డాక్టర్ బత్తుల వీరనారాయణ ప్రారంభించారు. పంగులూరు పరిసర గ్రామాల నుంచి వచ్చిన 104 మంది రోగులకు కంటిపరీక్షలు నిర్వహించారు. వీరిలో 88 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. ఈ నెల 31న 88 మందికి శంకర్ కంటివైద్యశాల నందు ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు వీరనారాయణ తెలిపారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ కార్యదర్శి రాయిణి రామారావు, చిలుకూరి వీరరాఘవయ్య, తాటి సుబ్బారావు, కాలేషావలి, పేర్ని వీరనారాయణ, బీవీ.రామారావు, డాక్టర్ బండారు రమేష్, గుర్రం ఆంజనేయులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

చీరాల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ఇంటి సరిహద్దుల వివాదమై వ్యక్తిపై ముగ్గురు వ్యక్తులు దాడి చేయడంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మున్సిపల్ పరిధిలోని విఠల్‌నగర్‌కు చెందిన జడ విక్రమ్, పిడతల శ్యామ్ వరుసకు బంధువులు. అయితే వీరికి ఇంటి సరిహద్దు వివాదంలో గొడవలున్నాయి. దీనిపై పలుమార్లు వివాదాలు తలెత్తాయి. ఈక్రమంలోనే ఇటీవల శ్యామ్ తన కుమారుడు ఎడ్విన్, భార్యతో కలిసి తీవ్రంగా దాడిచేయగా విక్రమ్ చేయి విరిగి గాయపడ్డాడు. ఈ నేపద్యంలో నమోదైన కేసులో ముగ్గురిని శనివారం అరెస్ట్ చేసి పోలీసులు విచారిస్తున్నారు.

7న ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం మూత

అద్దంకి, ఆగస్టు30 (ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం సందర్భంగా శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయాన్ని సెప్టెంబరు 7న మధ్యాహ్నం 12-30 గంటలకు మహానివేదన అనంతరం మూసి వేయినున్నట్లు ఈవో తిమ్మానాయుడు తెలిపారు. 8న సోమవారం ఆలయశుద్ధి సంప్రోక్షణ అనంతరం ఉదయం 8-30 గంటలకు దేవాలయం తిరిగి తెరవనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలకు ప్రింటర్ అందజేత



ప్రింటర్‌ను అందజేస్తున్న ఉపాధ్యాయురాలు

బల్లికురవ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పుమాగులూరు ఉన్నత పాఠ శాలలో పనిచేసి బదిలీ పై వేరే పాఠశాలకు వెళ్లిన అదే గ్రామానికి చెందిన ఉపాధ్యాయు రాలు కక్కెర రామ తులశమ్మ శనివారం విద్యార్థులకు ఉపయెగపడేలా ప్రింటర్‌ను అందజేశారు. సుమారు రూ. 20 వేల విలువైన ప్రింటర్‌ను పాఠశాలకు అందజేయడం అభినందనీయమని హెచ్ఎం ఇస్మాయల్ అన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్ఎం ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద ఘటనపై కేసు నమోదు

బల్లికురవ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాయపాలెం సమీపంలో శుక్రవారం రాత్రి సుబాబుల్ ట్రాక్టర్‌ను లారీ ఢీకొన్న ఘటనపై శనివారం వైద్యశాల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వై.నాగరాజు తెలిపారు. బల్లికురవ ఎస్సీ కాలనీకి చెందిన నలుగురు కూలీలు సుబాబుల్ కొట్టేందుకు వెళ్లి ట్రాక్టర్‌పై వస్తుండగా వెనుక వైపు నుంచి ఢీకొట్టడంతో కూలి జొన్నలగడ్డ మేరమ్మ (55) మృతి చెందగా మరో ముగ్గురు కూలీలు గాయపడ్డారని కూలీ మృతికి కారణమైన లారీ డ్రైవర్ రాజేష్‌పై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.



త్రస్టు నిర్వాహకులతో వాగ్వివాదం చేస్తున్న గ్రామస్థులు



ట్రస్టు భూముల్లో నరికేసిన జామాయిల్ చెట్లు

ట్రస్టు భూములపై రియల్టర్ల కన్ను

- అడ్డుకున్న జిర్రావారిపాలెం గ్రామస్థులు
- ట్రస్టు నిర్వాహకులతో వాగ్వివాదం
- తహసీల్దార్‌కు వినతిపత్రం

కలిగిరి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ పరిధిలోని జిర్రావారి పాలెం వద్ద మాగుంట చారిటబుల్ ట్రస్టుకు కేటాయించిన భూమిని శనివారం పలువురు యంత్రాలతో చదును చేయడంతో గ్రామస్థులు అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళితే.. 40 ఏళ్ల క్రితం విద్యాసంస్థలను ఏర్పాటు చేస్తామనడంతో ప్రభుత్వం మాగుంట చారిటబుల్ ట్రస్టుకు 4.02 ఎకరాల భూమిని, ఎకరం నాలుగువేల చొప్పున అందచేసింది. కలిగిరి ప్రాంతంలో 1992లో మాగుంట సుబ్బరామిరెడ్డి జూనియర్ కళాశాలను ట్రస్టు ఆధ్వర్యంలో స్థాపించారు. మొదటగా పట్టణంలో స్థానిక జడ్పీ ఉన్నతపాఠశాలలో కళాశాలను ప్రారంభించారు. అనంతరం ఓ భవనాన్ని అద్దెకు తీసుకొని కొంతకాలం అక్కడ కొనసాగించారు. ఆ సమయంలో కళాశాలకు భవన నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని ప్రభుత్వానికి దరఖాస్తు చేయగా, కలిగిరి-జిర్రావారి పలెం సమీపాన రోడ్డు పక్కన 1012సర్వే నెంబరులోని పొలాన్ని ఎంపిక చేశారు. గతంలో ఆ సర్వే నెంబరును జింకల ఏడుకొండలరెడ్డికి కేటాయించిన డీ ఫారంను ప్రభుత్వం రద్దు చేసి అతనికి మరో చోట భూమిని కేటాయించింది. 1996లో సర్వే నెంబరు 1012 లో 4.02 ఎకరాల భూమిని జూనియర్ కళాశాల ఏర్పాటుకు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. శ్మశానానికి ఇబ్బంది అంటూ స్థానికుల నుంచి ఒత్తిడి రావడంతో 1012 సర్వే నెంబరును సబ్ డివిజన్ చేసి 3.22 ఎకరాల భూమిని ట్రస్టుకు, మిగిలిన 0.80 సెంట్లు భూమిని శ్మశానానికి కేటాయించారు.

నిర్మాణాలు శూన్యం

ట్రస్టుకు కేటాయించిన భూమికి కంచె వేయడంతప్ప అక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదు. కాలక్రమేణా సదరు కళాశాలను 2002లో మూసివేసి ప్రకాశం జిల్లా చీమకుర్తికి తరలించారు. అప్పటి నుంచి కళాశాలకు కేటాయించిన భూముల్లో ట్రస్టు నిర్వాహకులు జామాయిల్ సాగు చేపట్టారు.

ఆ భూమిపై రియల్టర్ల కన్ను

నాలుగేళ్ల క్రితం కావలి- దుత్తలూరు నేషనల్ హైవే మంజూరు కావడంతో స్థానికంగా ఉన్న రియల్టర్ల కన్ను ఈ భూమిపై పడింది.ఎకరం కోటిన్నరతో 3.22ఎకరాల భూమికి సుమారు 4.6 కోట్లకు బేరం కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో పొలంలోని జామాయిల్ చెట్లను తీసేసి ట్రస్టుకు కేటయించిన భూమిచుట్టూ ప్రహరీ నిర్మించి, ట్రస్టు నిర్వాహకులు రియల్టర్లకు భరోసా ఇచ్చినట్టు సమాచారం. ఈ క్రమంలో వింజమూరులోని ఎంఎస్ఆర్ డిగ్రీ కళాశాల సిబ్బంది శనివారం యంత్రాలతో ట్రస్టుకు కేటాయించిన భూములను చదును చేసే పనులు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న జిర్రావారిపాలెం వాసులు ఆ ప్రాంతానికి తరలివచ్చి పనులను అడ్డుకున్నారు. సమాచారం అందు కున్న ట్రస్టు సిబ్బంది ఒంగోలు నుంచి కలిగిరి వచ్చారు. తాము భూములను అమ్మ లేదంటూ గ్రామస్థులకు నచ్చజెప్పాలని చూశారు. అయితే ఏ పనులు చేపట్టినా పత్రికా ముఖంగా ప్రజలకు తెలియజేసి అందరి ఆమోదం మేరకు చేపట్టాలని గ్రామస్థులు తెగేసి చెప్పారు. దీంతో పనులు అక్కడ ఆపేసి ట్రస్టు సభ్యులు వెనుతిరిగారు. ఈ విషయమై గ్రామస్థులు తహసీల్దారు గిరీష్‌కు వినతిపత్రం అందించారు. తమ సిబ్బందిని పంపించి క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించి, నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని తహసీల్దారు తెలిపారు.



జడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో జేసీ సమక్షంలో లక్కీడిప్ తీస్తున్న ఎక్సైజ్ అధికారులు

ప్రశాంతంగా లక్కీడిప్

- 55 బార్లకు 21 దరఖాస్తులు
- నేటి రాత్రి నుంచి పాత బార్ల మూత
- రేపటి నుంచి కొత్తవి ప్రారంభం

నెల్లూరు(క్రైం) ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బార్ల కేటాయింపునకు లక్కీడిప్ నగరంలోని జడ్పీ కార్యాలయం సమావేశ మందిరంలో శనివారం ప్రశాంతంగా సాగింది. జేసీ కే. కార్తీక్ లక్కీడిప్ నిర్వహించి, బార్లను కేటాయించారు. జిల్లాలో ఓపెన్ కేటగిరిలో 50 బార్లు, గీతకులాలకు సంబంధించి ఐదు బార్లు కలిపి మొత్తం 55 బార్లకు ఎక్సైజ్ అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. దరఖాస్తుల గడువు ముగిసే సమయానికి 21 బార్లకు 94 దరఖాస్తులు అందాయి. ఓపెన్ కేటగిరిలో 17 బార్లకు 68, గీతకులాలకు సంబంధించి నాలుగు బార్లకు 26 దరఖాస్తులు అందాయి. దరఖాస్తుల ప్రాసెసింగ్ ఫీజు రూపేణా రూ.4,79,40,000లు, లైసెన్సు ఫీజు రూపేణా రూ.2,21,29,000లు మొత్తం రూ.7,00,69,000 ప్రభుత్వానికి ఆదాయం వచ్చింది. దరఖాస్తులు అందని బార్లకు ప్రభుత్వం రీనోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు. బార్‌లు దక్కించుకున్న వారు లైసెన్సుఫీజులో ఆరోవంతు, బ్యాంకు గ్యారెంటీలు సమర్పించాక ఎక్సైజ్ అధికారులు లైసెన్సులను మంజూరు చేయనున్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ డీసీ ఎం. శంకరయ్య, ఏసీ పీ. దయాసాగర్, ఈఎస్ ఏ. శ్రీనివాసులునాయుడు, ఏఈఎస్‌లు జే. రమేష్, ఆర్. జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటి రాత్రి నుంచి మూత

జిల్లాలోని 47 బార్లకు ఆదివారం రాత్రితో కాలపరిమితి ముగియనున్నది. సెప్టెంబరు ఒకటి నుంచి కొత్త బార్లు ప్రారంభం కానున్నాయి. దరఖాస్తులు అందని బార్లకు ఎక్సైజ్ అధికారులు ఆదివారం రాత్రి సీల్ చేయనున్నారు.



రామకృష్ణాపురం గిరిజనులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ హిమవంశీ

ఉద్యోగాలేమీ వద్దు.. మా బతుకులు మమ్మల్ని బతకనీయండి !

- సబ్‌కలెక్టర్‌తో రామకృష్ణాపురం గిరిజనులు

ఉలవపాడు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : 'మాకు ఉద్యోగాలు వద్దు... మమ్మల్ని మీరు ఏమీ ఆదుకోవద్దు... మా బతుకులు మమ్మల్ని బతకనీయండి' అంటూ కరేడు శివారు గ్రామం రామకృష్ణాపురం యానాదులు కందుకూరు సబ్‌కలెక్టర్ దామెర హిమవంశీకి తేల్చిచెప్పారు. శనివారం తహసీల్దార్ శ్రీనివాసులు, రెవెన్యూ, పంచాయతీ సిబ్బందితో ఆయన రామకృష్ణాపురంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా ఉద్యోగ, ఉపాధి సౌకర్యాలు కల్పిస్తామని, అందుకు సహకరించి వివరాలు అందిస్తే ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. ఇండోసోల్ కంపెనీకి తప్ప... మీ ప్రభుత్వం మాకు మేలు చేయదని, మా ఇళ్లు, భూములు ఇచ్చేది లేదు. ఉద్యోగాలు కూడా మాకు అవసరం లేదు. మా బతుకులు మమ్మల్ని బతకనీయండని కాలనీవాసులు అన్నారు. మీ ఇళ్లు, భూములు తీసుకోవడానికి రాలేదు, ఉద్యోగ ఉపాధి విషయంలో విద్యావంతులకు మేలు చేసే ఉద్దేశ్యంతో వచ్చినట్లు సబ్‌కలెక్టర్ వివరణ ఇచ్చారు. ఎంత నచ్చచెప్పినా వారు ససేమిరా అనడంతో అధికారుల బృందం వెనుతిరిగింది.

అధికారుల తీరు దుర్మార్గం

కందుకూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): 167బీ హైవే భూసేకరణ విషయంలో అధికారులు వ్యవహరిస్తున్న తీరు దుర్మార్గమని మండలంలోని ఓగూరు, పలుకూరు గ్రామాల రైతులు సబ్‌కలెక్టరు హిమవంశీ వద్ద వాపోయారు. భూసేకరణ అభ్యంతరాలపై విచారణ కోసం శనివారం సాయంత్రం ఆయన ఓగూరు సచివాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. బలవంతపు భూసేకరణకు ప్రభుత్వం సిద్ధపడితే మా శవాలను చూడాల్సి వస్తుందని రైతులు హెచ్చరించారు. ఈ సమస్యపై సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులకు అర్జీలు సమర్పించినా ఫలితం లేద న్నారు. న్యాయమైన ధర చెల్లించకుండా మా భూమిని తీసుకోవాలని చూస్తే సహించేది లేదని వారు స్పష్టంచేశారు. ఇక్కడి పరిస్థితులను ఉన్నతాధికారులకు నివేదించి న్యాయం చేస్తానని సబ్ కలెక్టరు వారికి హామీ ఇచ్చారు.

ముగిసిన కి'లేడి' విచారణ

పరిశీలించిన ఎస్పీ కృష్ణకాంత్ ● సరైన సమాధానాలు రానందున మళ్లీ కస్టడీ కోరే అవకాశం

కోవూరు, ఆగస్టు 30,(ఆంధ్రజ్యోతి): రౌడీషీటరు శ్రీకాంత్ పెరోల్ ఉత్తర్వుల విషయమై, అపార్టుమెంట్ ఆక్రమణ కేసులో ఒంగోలు జైలులో రిమాండులో ఉన్న నిడిగుంట అరుణ పోలీసు కస్టడీ శనివారం ముగిసింది. విచారణ తుదిదశకు చేరుకున్న సమయంలో ఎస్పీ కృష్ణకాంత్ అకస్మాత్తుగా కోవూరు పోలీసుస్టేషన్‌కు చేరుకున్నారు. అరుణను ఉదయం పదిగంటలకు నెల్లూరు జైలు నుంచి పోలీసుస్టేషన్‌కు తీసుకవచ్చారు. ఏఎస్పీ సౌజన్య ఆధ్వర్యంలో డీఎస్పీ జీ. శ్రీనివాసరావు, సీఐ కే సుధాకరరెడ్డి మూడోరోజులపాటు పలు ప్రశ్నలు వేసి ఆమె నుంచి సమాధానం రాబట్టారు. చాలా ప్రశ్నలకు ఆమె తెలియదనీ, మరచిపోయానని చెప్పినట్లు తెలిసింది. పలువురు ప్రముఖులతో పరిచయాలున్నాయని ఒప్పుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. పడుగుపాడులోని సాయి ఎన్‌క్లేవ్ అపార్టుమెంటు ప్లాటు ఆక్రమణకు సంబంధించి వివరాల గురించి ఆమెను ఎక్కువ ప్రశ్నలు అడిగినట్లు తెలిసింది. సుమారు 90 ప్రశ్నలు అడిగినట్లు విశ్వసనీయ సమాచారం. రిమాండులో ఉన్న కేసుకు సంబంధించి కాకుండా ఆమెను ఇతర ప్రశ్నలు వేయగా సమాధానాల్ని దాట వేసినట్లు తెలిసింది. అనుకున్న మేరకు సమాచారం పొందలేకపోయినందున తిరిగి ఆమెను కస్టడీకి తీసుకునే అవకాశముందని తెలిసింది. సాయంత్రం 6గంటలు కావడంతో ఆమెకు వైద్యపరీక్షలు చేయించి జైలుకు తరలించారు.



కోవూరు స్టేషన్‌లో అరుణను విచారించి బయటకు వస్తున్న ఎస్పీ కృష్ణకాంత్, తదితరులు

కొన్ని వివరాలే చెప్పారు...

బిల్డర్ వెంకట మురళీ మోహన్‌కృష్ణ పెట్టిన కేసు వివరాలు, ఆమె కుటుంబ, ఆర్థిక నేపథ్యం, వేర్వేరు వ్యక్తులతో పరిచయం గురించి అరుణను అడిగాం. మొత్తం 94 ప్రశ్నలు వేయగా కొన్నింటికే సమాధానం చెప్పారు. ఆమె చెప్పిన సమాధానాల్ని పరిశీలించి తిరిగి కస్టడీకి కోరాలా... లేదా..? అనేది పరిశీలిస్తాం. పరిచయాలనేవి వ్యక్తిగతం. వాటి గురించి అడగలేం. కస్టడీ విచారణలోని అన్ని విషయాలు చెప్పేందుకు వీలుకాదు.

- డీఎస్పీ జీ శ్రీనివాసరావు

శ్రీధర్‌రెడ్డి వ్యవహారంలో లోతుగా విచారణ

- లాడ్జిలో మద్యం సేవిస్తూ వీడియో రికార్డ్
- ఎనిమిది మంది గుర్తింపు
- పోలీసుల అదుపులో ఐదుగురు

నెల్లూరు(క్రైం), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని లేపేస్తే డబ్బే డబ్బు.. అంటూ కొందరు రౌడీషీటర్లు చేసిన వివాదాస్పద వ్యాఖ్యల వ్యవహారంపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. నగరంలోని మద్రాసు బస్టాండు సమీపంలో ఉన్న ఓ లాడ్జి రూమ్‌లో రెండు నెలల క్రితం సెల్‌ఫోన్‌లో వీడియోను చిత్రీకరించినట్లు సమాచారం. ఆ గదిలో ఎనిమిది మంది ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వారిలో ఇప్పటికే రౌడీషీటర్ జగదీష్ గంజాయి కేసులో జైలులో ఉండగా, మహేష్, వినీత్, రౌడీషీటర్లు రాజారెడ్డి, జాకీర్, మల్లి, ఫైరోజ్, సాయి గదిలో ఉన్నారు. వారిలో ఐదు గురిని పోలీసులు అదు పులోకి తీసుకొని విచారిస్తున్నారు.

ఎవరున్నారో నిగ్గు తేల్చాలి ?

వైసీపీ రౌడీమూకలు బరితెగించి ప్రవర్తిస్తున్నారని, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వ్యవహారంలో ఎవరున్నారో నిగ్గు తేల్చాలని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. మూడుసార్లు గెలిచిన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిపై హత్యాయత్నానికి కుట్ర చేయడం సామాన్యులను సైతం భయభ్రాంతులకు గురిచేస్తున్నదన్నారు. రౌడీషీటర్లపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నా, ఇలాంటి చిల్లర రౌడీలు ప్రజలను భయపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

యూరియా కొరతతో సతమతం

- కందుకూరు సబ్‌డివిజన్‌కు సరిగాలేని కేటాయింపులు

కందుకూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): సబ్ డివిజన్‌లో తీవ్రమైన యూరియా కొరతతో రైతులు సతమతం అవుతున్నారు. వారంక్రితం ఉన్న నిల్వలు కూడా పూర్తిగా అయిపోవడంతో బ్లాక్ మార్కెట్‌లో యూరియా కొనలేక రైతులు ఆందోళన చెందుతున్నారు. సబ్ డివిజన్‌లో వేలాది ఎకరాల జామాయిల్, సరుగుడు తోటలతోపాటు వందలాది ఎకరాల్లో పండ్ల తోటలు సాగులో ఉన్నాయి. ఇటీవలి కురుస్తున్న వర్షాలతో భూములు పదును కావటంతో అన్నిరకాల పంటల్లో అంతర్ సేద్యాలు చేసి ఎరువులు వేసేందుకు సిద్ధపడిన రైతులు యూరియాకోసం వ్యాపారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సబ్ డివిజన్ వ్యాప్తంగా 50 టన్నులు కూడా నిల్వలు లేవు. దీంతో ఉన్నతస్థాయిలో సిఫార్సు చేయించిన వారికే యూరియా దొరుకుతున్న పరిస్థితి. అది కూడా బ్లాక్ మార్కెట్‌లోనే అంటే... రైతులు ఎంత దయనీయ స్థితిని ఎదుర్కొంటున్నారో అర్థం చేసుకోవచ్చు. వ్యవసాయశాఖ అధికారులు ప్రస్తుతం పంటలకు యూరియా అవసరం లేదన్న పలాయనవాదంతో బాధ్యతల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారులు కందుకూరు నియోజకవర్గానికి కేటాయింపుల్లో అన్యాయం చేస్తున్నారన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	123
స్కిన్ చికెన్	220
స్కిన్‌లెస్	242
కోడిగుడ్ల ధర (100): 560	

సబ్ కలెక్టరును మర్యాద పూర్వకంగా కలిసిన ఎమ్మెల్యేలు

కందుకూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కందుకూరు సబ్ కలెక్టరు దామెర హిమవంశీని ఉదయగిరి, కందుకూరు ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, ఇంటూరి నాగేశ్వరరావులు శనివారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పరిశ్రమల భూసేకరణతో పాటు రెండు నియోజకవర్గాలలోని పలు సమస్యలపై వారు సబ్ కలెక్టరుతో చర్చించారు.


సబ్ కలెక్టరు హిమవంశీతో చర్చిస్తున్న కందుకూరు, ఉదయగిరి ఎమ్మెల్యేలు ఇంటూరి నాగేశ్వరరావు, కాకర్ల సురేష్

ప్రజల దాహార్తి తీరేనా...?

- నత్తతో పోటీపడుతున్న ఎస్ఎస్ ట్యాంకు పనులు
- 2007లో నిర్మాణానికి శంకుస్థాపన
- ఇప్పటి వరకు రూ.20 కోట్ల వ్యయం
- ఎప్పటికి పూర్తయ్యేనో...?
- జలదంకి వాసుల కల నెరవేరేనా?

జలదంకి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి దాహార్తితో తజలదంకి మండల వాసులు కోరుతున్నారు. ప్రజల దాహార్తి తీర్చేందుకు తలపెట్టిన సమ్మర్ స్టోరేజీ (ఎస్ఎస్) ట్యాంకు పనులు నత్తనడకన నడుస్తున్నాయి. ఈ ట్యాంకు పనులను వేగవంతం చేసి, ఈ ఏడాదైనా మండల ప్రజల దాహార్తి తీర్చాలని వారు వేడుకుంటున్నారు.

● పూర్తికాని ఎస్ఎస్ ట్యాంకు

2007లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండగా, అప్పటి కావలి ఎమ్మెల్యే దివంగత మాగుంట పార్వతమ్మ మండలానికి ఎస్ఎస్ ట్యాంకును మంజూరు చేయించారు. దీని నిర్మాణానికి చినక్రాక గ్రామ పరిధిలోని 14వమైలు సీజేఎఫ్ఎస్ భూములు 52ఎకరాలను 52 మంది లబ్ధిదారుల నుంచి సేకరించారు. సోమశిల ప్రాజెక్ట్ నుంచి నీటిని తరలించేందుకు వీలుగా ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ ఎస్ఎస్ ట్యాంకు పూర్తయి ఉంటే మండలంలోని అన్ని గ్రామాల్లోని ఇంటింటికి శుద్ధి జలాలు చేరేవి. ప్రజల దాహార్తి తీరేది.

● ఏళ్లు గడుస్తున్నా...

పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా, నేటికీ పూర్తికాలేదు. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఎస్ఎస్ ట్యాంకు పనులు మాత్రం అసంపూర్తిగానే ఉన్నాయి. ఇప్పటి వరకు దీని నిర్మాణానికి రూ.20కోట్లు మంజూరయ్యాయి. కానీ లక్ష్యం మాత్రం నెరవేరలేదు.


చినక్రాక గ్రామ పరిధిలోని 14వమైలు వద్ద నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకు


కావలి కాలువ నుంచి పైపులైను ద్వారా సోమశిల జలాలను చేర్చే సంపు

ట్యాంకు అంతా కంపచెట్లతో నిండి ఉంది.దీంతో ట్యాంకు వద్ద జరిగిన సివిల్ పనులు నిరుపయోగంగా మారాయి.మోటార్లు తుప్పు పట్టిపోయాయి.


కర్రతుమ్మ చెట్లతో నిండిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు

● పూర్తయిన పైపులైను

ఎస్ఎస్ ట్యాంకుకు కావలి కాలువ ద్వారా సోమశిల జలాలు తరలించేందుకు పైపులైను పనులు కూడా పూర్తయ్యాయి. కాలువకు మోటార్లు ఏర్పాటు చేసేందుకు కూడా సిద్ధ చేశారు. కానీ మధ్యలో పనులు ఆగాయి. దీంతో చేసిన పనులన్నీ వృథా అయ్యాయి. ఈ ప్రాజెక్ట్ మధ్యలోనే నిలిచిపోవడంతో మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వంలోనైనా లక్ష్యం నెరవేరేనా..? అని వారు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఈ ట్యాంకు పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని మండల వాసులు కోరుతున్నారు.

రైతులకు శిక్షణ తరగతులు

అల్లూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : రైతులకు వ్యవసాయ రంగంపై పటిష్ట అవగాహన కల్పించేందుకు 'ఆత్మ' ఆధ్వర్యంలో శనివారం శిక్షణ తరగతులు నిర్వహించారు. అల్లూరు మండలం పురిణి కొత్తపాలెంలో జరిగిన శిక్షణా తరగతుల్లో వ్యవసాయాధికారి వేంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటించాలన్నారు. సాగులో మెళకువలు, ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ పెంచల వీరేంద్ర, ఆర్‌డబ్ల్యూయస్ ఏఈ పురుషోత్తం, ఆత్మ ప్రతినిధులు, వీఏఏలు పాల్గొన్నారు.

జిల్లా వైసీపీ ఐటీ జనరల్ సెక్రటరీగా బ్రహ్మారెడ్డి

లింగసముద్రం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మారెడ్డిపాలెం గ్రామానికి చెందిన కేసంరెడ్డి బ్రహ్మారెడ్డిని జిల్లా వైసీపీ ఐటీ విభాగం జనరల్ సెక్రటరీగా నియమించారు. ఈమేరకు జిల్లా పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయని ఆయన శనివారం తెలిపారు. పార్టీలో తన సేవలను గుర్తించి తనను ఈ పదవిలో నియమించేలా ఆదేశించిన వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుర్రా మధుసూదన్‌యాదవ్‌కు, ఈ పదవి తనకు వచ్చేలా సహకరించిన మండల వైసీపీ అధ్యక్షుడు నోటి వెంకటేశ్వరరెడ్డి, ఎంపీపీ పెన్నా కృష్ణయ్య ఇతర వైసీపీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్చాలి

వలేటివారిపాలెం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ మల్లికార్జునరావు తెలిపారు. మండలంలోని పోకూరులో బడి ఈడు పిల్లలను గుర్తించి ఎంఈఓ, ఉపాధ్యాయులు వారి ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలలో చేర్పేలా కృషిచేశారు. అనంతరం పాఠశాలలోని విద్యార్థులకు పర్రె రామారావు, నాగభూషణం నోట్‌పుస్తకాలు, పాఠశాలకు నాలుగు కుర్చీలు అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

బార్‌లకు ఆదరణ కరువు

● నాలుగు బార్లలో మూడింటికే లాటరీ

కందుకూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కందుకూరు మున్సిపాలిటీ పరిధిలో నూతన బార్ పాలసీకి అనుగుణంగా ప్రభుత్వం నాలుగు బార్‌లకు అనుమతి ఇవ్వగా ఔత్సాహికుల నుంచి ఆశించిన డిమాండ్ రాలేదు. బార్ లైసెన్సుల కోసం తొలుత ఇచ్చిన గడువులోగా ఎవరూ డీడీలు చెల్లించకపోవటంతో మరో మూడురోజులు సమయం ఇచ్చినప్పటికీ ఆశించిన స్పందన రాలేదు. నాలుగు బార్‌లలో ఒక్క బార్‌కు ఒక్కటే దరఖాస్తు రావటంతో దానిని శనివారం కూడా లాటరీ నుంచి మినహాయించారు. మిగిలిన మూడింటిలో ఒకటి గీతకార్మికుల కోటాలో 50శాతం లైసెన్సు ఫీజు రాయితీ ఉండటంతో ఆ షాపుకోసం వ్యాపారులు పోటీపడ్డారు. దీనికి ఐదు దరఖాస్తులు రాగా లాటరీలో నెల్లూరుకు చెందిన మద్యం వ్యాపారి బి. జనార్ధన్ అనే గీతకార్మికుడి పేరుతో సంపాదించుకున్నట్లు తెలిసింది. ఇక మిగిలిన రెండు బార్‌లలో ఒకటి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ప్రస్తుతం బార్ నిర్వహిస్తున్న హనుమారెడ్డి దక్కించుకోగా మరో బార్‌ను కొండముడుసుపాలెంకు చెందిన శ్రీకాంత్ అనే యువకుడు దక్కించు కున్నట్లు తెలిసింది. ఈ రెండు బార్‌లకు కూడా తగినన్ని దరఖాస్తులు రాకపోవటంతో ఒక్కరే నాలుగేసి దరఖాస్తులు వేసి లాటరీకి మార్గం సుగమం చేసుకోవటం ద్వారా దక్కించుకున్నట్లు తెలిసింది. మిగిలిన మరో బార్‌కు మరింత సమయం ఇవ్వటంతో దీనిని కనిగిరి రోడ్డులో ఇప్పటికే ఈ వ్యాపారంలో ఉన్న టీడీపీ నేత పోటీలేకుండా స్వంతం చేసుకునేందుకు సిద్ధపడుతున్నట్లు సమాచారం.

నాసిరకంగా పనులు చేస్తే రైతులకు నష్టం

దగదర్తి (బిట్రగుంట): నాసిరకంగా కాలువ పనులు చేస్తే రైతులు తీవ్రంగా నష్టపోతారని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు అన్నారు. దగదర్తి మండలంలోని డీఆర్ ఛానల్ పనులను ఆయన శనివారం పరిశీలించారు. పనులలో నాణ్యత కొరవడిందని, ఇలాగైతే డీఆర్ ఛానల్‌పై ఆధారపడిన 23 వేల ఎకరాల్లో రైతులు నష్టపోతారని తెలిపారు. సాగునీటి కోసం రైతులు పడుతున్న కష్టాలను చూసి సీఎం చంద్రబాబు నిధులు మంజూరు చేస్తే, వైసీపీ ప్రభుత్వంలో కాలువను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. ఆయన వెంట స్థానికులు, రైతులు ఉన్నారు.

అదుపు తప్పి లారీ బోల్తా : తప్పిన ప్రమాదం

వలేటివారిపాలెం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకుటూరు సమీపంలోని జాతీ య రహదారి మార్జిన్‌లో శుక్రవారం తెల్లవారుజామున అదుపుతప్పి లారీ బోల్తా పడింది. డ్రైవర్ నిద్రమత్తులో డ్రైవింగ్ చేయడంతో ప్రమాదం జరిగింది. ఈప్రమాదంలో డ్రైవర్‌కు, క్లీనర్‌కు ఎలాంటి గాయాలు కాకపోవ డంతో దీంతో ఘోర ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొంటున్నారు.

వినాయకస్వామికి ఎమ్మెల్యే ఇంటూరి ప్రత్యేక పూజలు

లింగసముద్రం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదపవని గ్రామంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు చేశారు. శనివారం సాయంత్రం గ్రామంలోని వినాయకస్వామి మండపం కమిటీ ఆహ్వానం మేరకు గ్రామానికి వెళ్లి స్వామి వారికి పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం మండపం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని స్వయంగా భక్తులకు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావును నిర్వాహకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు గొర్రెపాటి సాంబయ్య, కేపీ నరసింహారావు, మలిశెట్టి నాగేశ్వరరావు, సయ్యద్ నాయబ్‌రసూల్, శ్రీనివాసులు, సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.


పెదపవనిలో వినాయకస్వామి మండపం వద్ద భక్తులకు భోజనాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

రైతులకు మేలు చేసేందుకే ఏఎంసీలు : ఎమ్మెల్యే

● కావలి మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం

కావలి, ఆగస్టు30 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయదారులకు అండగా నిలిచి పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకే ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో ఒక వ్యవసాయమార్కెట్ కమిటీని ఏర్పాటు చేసిందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని మద్దూరుపాడు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఆవరణలో శనివారం కావలి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకారం జరిగింది. చైర్‌పర్సన్‌గా పోతుగంటి అలేఖ్య, వైస్‌చైర్మన్‌గా చంచంగారి శ్రీనివాసులు, 12 మంది డైరెక్టర్లుగా ఎమ్మెల్యే సమక్షంలో వ్యవసాయ మార్కెట్‌కమిటీ కార్యదర్శి ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణస్వీకారం చేసిన డైరెక్టర్లలో తుమ్మల రమణమ్మ, కొప్పోలు లక్ష్మీ, లేళ్లపల్లి సుధీర్ కుమార్, మొగిలి విజయకుమార్, డీఎం పవన్‌కుమార్, సూరే జయశ్రీ, దద్దాల ప్రభాకర్, గణేశం రమేష్ రెడ్డి, జమ్ముల యల్లమ్మ, భూక్యా ప్రసాద్‌నాయక్, తాళ్లూరు విజయమ్మ, హెప్సిబా ఉపిరేంతి, పెనుమల్లి శ్రీనివాసులు రెడ్డి ఉన్నారు. వీరందరినీ ఎమ్మెల్యే సత్కరించారు. ముఖ్యఅతి థిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన పాలక వర్గం వ్యవసాయ మార్కెట్ కమిటీ సేవలపై రైతులకు తరచూ అవగా హన కల్పిస్తూ అండగా నిలవాలన్నారు. కావలి వ్యవసాయ మార్కెట్‌కు ఏటా సెస్ ద్వారా రూ.7 కోట్ల వరకు ఆదాయం వస్తోందన్నారు. ప్రస్తుతం మార్కెట్ కమిటీలో రూ.16 కోట్లు నిధులు ఉన్నాయని, వాటిలో రూ.6 కోట్ల వరకు అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపించామన్నారు. చైర్‌పర్సన్ అలేఖ్య ప్రభుత్వం నుంచి నిధులు తెప్పించి అభివృద్ధి పనులు జరిగేలా చూడాలన్నారు. దగదర్తి, అల్లూరు మండలాల్లో మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో గోదాముల నిర్మాణం చేపట్టేందుకు కృషి చేస్తానని చెప్పారు. చైర్‌పర్సన్ అలేఖ్య మాట్లాడుతూ రైతుల ప్రయోజనాల కోసం కృషి చేస్తానన్నారు.



ఏఎంసీ చైర్‌పర్సన్ అలేఖ్యను సత్కరిస్తున్న ఎమ్మెల్యే

మద్దూరుపాడు సొసైటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం

కావలి రూరల్ మండలం మద్దూరుపాడు సొసైటీ నూతన చైర్మన్‌గా గుంటూరు మల్లి కార్జున, సభ్యులుగా పాపనబోయిన సుబ్బారావు, కొమరా వెంకటేశ్వర్లు చేత ఆ సొసైటీ సీఈవో ప్రమాణ స్వీకారం చేయించారు. వ్యవసాయమార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో శనివారం జరిగిన ఈ ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి పాల్గొని సొసైటీ ద్వారా రైతులకు సేవలు అందించాలని నూతన సభ్యులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో కావలి డీఎస్పీ పీ. శ్రీధర్ టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్, జ్యోతి బాబూరావు, మలిశెట్టి వెంకటేశ్వర్లు, కండ్లగుంట మధుబాబు నాయుడు. బీతా గిరిదర్, పొట్లూరి శ్రీనివాసులు, మొగిలి కల్లయ్య, తటవర్తి రమేష్, పాలిశెట్టి, మాలేపాటి నాగేశ్వరరావు, ఆవుల రామక్రిష్ణ, బీజేపీ నేతలు కందుకూరి వెంకటసత్యనారాయణ, భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'కొతలోక' చిత్రం పేరు.. తెలుగు భాషకు అవమానం!

కావలి(టౌన్) ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) తెలుగు భాషా దినోత్సవం రోజే విడుదలైన తెలుగు సినిమా 'కొతలోక' తెలుగు భాషను ఖూనీ చేసేలా ఉందని తెలుగు భాషాభిమానులు నిరసన తెలిపారు. శనివారం వేంకటేశ్వర థియేటర్ వద్ద తెలుగు భాషాభిమానులు 'కొతలోక' సినిమా పోస్టర్ కు పూలమాల వేసి, మేనేజర్‌కు పూలబొకే అందించి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఇతర భాషల సినిమాలైతే ఎటువంటి పేర్లు పెట్టుకున్నా తమకు అభ్యంతరం లేదని, అర్థమే లేని పేరు పెట్టడం తెలుగు భాషను అవమానపర్చడమేనన్నారు. తమ ఆవేదనను దర్శక, నిర్మాతలకు తెలపాలని థియేటర్ మేనేజర్‌ను కోరారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ ఎస్ జయ ప్రతాప్‌రెడ్డి, 'అమ్మ' ఆదరణ సంస్థ అధ్యక్షులు నున్నా మురళి, బీసీ ఐక్యభవన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్, వరప్రసాద్ పాల్గొన్నారు.


మేనేజర్‌కు పుష్పగుచ్ఛం అందించి నిరసన తెలుపుతున్న తెలుగు భాషాభిమానులు

ఏఎంసీ డైరెక్టర్‌గా తాళ్లూరు విజయమ్మ

దగదర్తి (బిట్రగుంట) ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం కాట్రాయిపాడుకు చెందిన టీడీపీ రైతునేత తాళ్లూరు సుధాకర్‌నాయుడు సతీమణి తాళ్లూరు విజయమ్మను కావలి ఏఎంసీ డైరెక్టర్‌గా ఎంపిక చేయడం పట్ల పలువురు నేతలు శనివారం హర్షం వ్యక్తం చేశారు. ప్రమాణ స్వీకారం అనంతరం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి శాలువా కప్పి ఆమెను అభినందించారు. మండల టీడీపీ కన్వీనర్ అల్లం హనుమంతరావు, నెల్లూరు పార్లమెంట్ రైతు కార్యదర్శి జలదంకి శ్రీహరినాయుడు, చవటపుత్తేడు సర్పంచు పులిశేనయ్య, కాట్రాయిపాడు నీటిసంఘం అధ్యక్షుడు మోహన్‌రావు, యువనేత వడ్డే వినయ్‌కుమార్ తదితరులు విజయమ్మ ఎంపిక పట్ల హర్షం వ్యక్తం చేశారు. బోగోలు మండలం విశ్వనాథరావుపేటకు చెందిన టీడీపీ నేత లేల్లపల్లి సుధీర్‌బాబు, ఏనుగులబావి పంచాయతీ జడగోగులకు చెందిన జే ఎల్లమ్మలను కావలి ఏఎంసీ డైరెక్టర్లుగా ఎంపిక చేయడంతో పలువురు టీడీపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు.


తాళ్లూరు విజయమ్మను సన్మానిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

ముగిసిన ఇన్ఫోసిస్ సాఫ్ట్ స్కిల్స్ శిక్షణ శిబిరం

బిట్రగుంట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కడనూతల ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల్లో ఇన్ఫోసిస్ సాఫ్ట్ స్కిల్స్ శిక్షణా శిబిరం శనివారం ముగిసింది. ఇన్ఫో సిస్ ఫౌండేషన్, ఐసీటీ అకాడమీ ఆధ్వర్యంలో ప్రసిద్ధ ట్రైనర్ చంద్రవదన 20 గంటలపాటు విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పీవీఎస్ రెడ్డి మాట్లాడుతూ ఫినిషింగ్ స్కూల్ ఆఫ్ ఎంప్లాయబిలిటీ కార్యక్రమం కింద ఇన్ఫోసిస్ ఫౌండేషన్, ఐసీటీ అకాడమీ శిక్షణ కార్యక్రమం నిర్వహించారన్నారు. కమ్యూనికేషన్, టైమ్ మేనేజ్‌మెంట్, సమస్య పరిష్కార నైపుణ్యాలు వంటి కీలక అంశాలను విద్యార్థులకు తెలియజేశారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కే. రాజారెడ్డి, ఏవో ఆర్వీ రమణారెడ్డి, ఎస్‌పీవోసీ డాక్టర్ సత్యనారాయణరెడ్డి, పీ బృందావని తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో ట్రైనర్ చంద్రవదన

నా జోలికి వస్తే కాకాణి, పర్వతరెడ్డి అవినీతి చిట్టా విప్పుతా!

● విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి

కావలి, ఆగసు 30 (ఆంధ్రజ్యోతి) 'నా జోలికి వస్తే మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిల అవినీతి బాగోతం చిట్టా విప్పుతాను' అని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం సాయంత్రం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనపై ఇప్పటివరకు ఒక్క కేసు కూడా లేదన్నారు. క్రిష్ణపట్నం పోర్టు టోల్‌గేట్ నుంచి పోర్టరీ సంతకాలు, కోర్టులో ఫైళ్ల మాయం వరకు కాకాణి అవినీతి చిట్టా అంతా బయటకు తీస్తానన్నారు. అలాగే పర్వతరెడ్డి నెల్లూరు నడిబొడ్డులో అక్రమంగా కూడకట్టుకున్న ఆస్తులు, ఆయన విద్యాసంస్థల లెక్కలు, పదో తరగతి పేపర్‌లీక్ వరకు ఆయన బాగోతం బయటపెడతానన్నారు. వైసీపీ ప్రభుత్వంలో తన క్రషర్ సీజ్‌చేసి 147 కోట్లు పెనాల్టీ విధిస్తే తాను కోర్టుకు వెళ్లగా, ఆ ప్రభుత్వంలోనే తనకు క్లీన్‌చిట్ ఇచ్చారన్నారు. కావలిలో తాను చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకపోతున్నారన్నారు. ప్రతాప్‌రెడ్డి తన క్రషర్, మామిడి తోటలపై డ్రోన్ చిత్రీకరించి, తనను హత్య చేయించటానికే తన అనుచరులైన రౌడీషీటర్లు, మరికొంత మంది గుర్తు తెలియని వ్యక్తులను తన క్రషర్ వద్దకు పంపారన్నారు.

టీఆర్ఆర్‌లో తెలుగుభాష, క్రీడాదినోత్సవం

కందుకూరు, (ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం తెలుగుభాష, జాతీయ క్రీడాదినోత్సవం ఘనంగా నిర్వహించారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటానికి ప్రిన్సిపాల్ డాక్టరు ఎం రవికుమార్ పూలమాలవేసి నివాళులర్పించారు. జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని రెండు రోజులుగా పీడీ కేఆర్ కరుణకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ ఏడుకొండలు నరేంద్ర, అధ్యాపకులు పీ. రాజగోపాలబాబు, ఎన్వీ శ్రీహరి, కే. నరేష్‌రాజా పాల్గొన్నారు.

వైభవంగా గణపయ్యల నిమజ్జనం


నిమజ్జనానికి వెళ్తున్న గణపయ్య

కావలి రూరల్: కావలి మండల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం వినాయక నిమజ్జన వేడుకలు ఘనంగా జరిగాయి. వినాయక మండపాల్లో పూజల అనంతరం గణనాథులను తుమ్మల పెంట, కొత్తసత్రం, చెన్నాయి పాలెం తీర ప్రాంతాలకు నిమజ్జనానికి తరలించారు. తీరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా రూరల్ పోలీసులతోపాటు మెరైన్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

లింగసముద్రం : మండలంలో గణనాథుని నిమజ్జనోత్సవం వైభవంగా జరిగింది. శనివారం మధ్యాహ్నం మండలంలోని వాకమళ్లవారిపాలెం, లింగసముద్రం, తిమ్మారెడ్డిపాలెం గ్రామాలలో వినాయకుని విగ్రహాలను ట్రాక్టర్లలో ఊరేగించారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


● గణనాథుడి సన్నిధిలో అన్నదానం

అల్లూరు: వినాయక చవితిని పురస్కరించుకొని స్థానిక కోనేటిసత్రం గణపతి విగ్రహ సన్నిధిలో శనివారం అన్నదానం నిర్వహించారు. నాలుగోరోజు ప్రత్యేక పూజలతోపాటుఅన్నదానం చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

కమనీయంగా కల్యాణం

రాపూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పెంచలకోనలో శ్రీవారి కల్యాణాన్ని ఆలయ అర్చకులు శనివారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున శ్రీవారికి అభిషేకాలు నిర్వహించి చందనాలంకార సేవ చేశారు. అనంతరం భక్తులు శ్రీవారి నిజరూపాన్ని దర్శించుకున్నారు. సాయంత్రం ఊంజల్‌సేవ, క్షేత్రోత్సవం నిర్వహించారు.

నగర గణపతులు వినూత్నం



నెల్లూరు బట్వాడిపాళెంలో ప్రతిష్ఠించిన అశ్వవాహన గణపతి



బీవీనగర్‌లో ఏర్పాటు చేసిన వినూత్న గణపతి



పెన్నానదీ జలాల కలశాలతో ఊరేగింపుగా వస్తున్న నేతాజీనగర్ గణేష్ భక్తులు

నెల్లూరు నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన వినాయక ప్రతిమలకు ప్రజలు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం పూజలు చేస్తున్నారు. కొంతమంది మూడో రోజైన శుక్రవారం విగ్రహాలను నిమజ్జనం చేయగా, మరికొందరు శనివారం కూడా నిర్వహించారు. నగరంలోని వినాయక మండపాల్లో మధ్యాహ్నం అన్నదానం, రాత్రికి సాంస్కృతిక కార్యక్ర మాలు నిర్వహిస్తున్నారు. రాజకీయ, ఇతర రంగాల ప్రముఖులు మండపాల్లోని విగ్రహాలను దర్శించి, ప్రత్యేక పూజలు చేస్తున్నారు.



గణేశ్ ఘాట్‌లో క్రేన్‌తో నిమజ్జనం చేస్తున్న వినాయక ప్రతిమ

కావలిలో గుట్టుగా

గంజాయి విక్రయాలు

పట్టణ శివార్లు, అటవీ ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలు

మత్తుకు బానిసవుతున్న యువత, విద్యార్థులు ● భయాందోళనలో తల్లిదండ్రులు

● పట్టించుకోని పోలీసులు

కావలి రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కావలిని కనకపట్నంగా తీర్చి దిద్దుతామంటున్న నేతల మాటలు నీటిపై రాతలుగా మారుతున్నాయి. గుట్టుగా సాగుతున్న గంజాయి, ఇతర మత్తుపదార్థాల అమ్మకాలకు మాత్రం కావలి కేంద్రంగా మారిందని పట్టణ వాసులు విమర్శిస్తున్నారు. విద్యార్థులను, యువతను లక్ష్యంగా చేసుకుని పట్టణ శివారును అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చారని, దీంతో ప్రజల కంటిమీద కునుకు లేకుండా పోతున్నది. పట్టణంలోని బాలక్రిష్ణారెడ్డినగర్ లోని ఒడిస్సా కాలనీ, పెద్దపవని రోడ్డులోని పీజీసెంటర్ ప్రాంతం, రైల్వేస్టేషన్ పరిసరాలు, ఇందిరానగర్, ముసునూరు ఇందిరమ్మ కాలనీ, జెండాచెట్టు సెంటర్ తదితర ప్రాంతాల్లో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి, మత్తుపదార్థాల పొట్లాల అమ్మకాలు జరుగుతున్నాయని స్థానికులు భయాందోళనలు చెందుతున్నారు. అలాగే మత్తువినియోగానికి పట్టణ శివారులోని సుచేతానగర్, పీజీ సెంటర్ ఎదురుగా ఉన్న ఫారెస్ట్ జామాయిల్ తోటలు, అటవీప్రాంతం, ముసునూరు ఇందిరమ్మకాలనీ, జగనన్న లేఅవుట్, కొత్త శివాలయం వెనుక జామాయిల్ తోటలు, తుమ్మలపెంట రోడ్డులోని సుకుమార్ రెడ్డి లేఅవుట్ శివారు లోని పంట కాలువ సమీపం, కావలి చెరువు దగ్గర ఉన్న బ్రంహ్మం గారి గుడి సమీపంలోని అటవీ ప్రాంతం తదితర ప్రాంతాల్లో యువత, విద్యార్థులు నిత్యం మత్తులో ఉంటున్నారు. పట్టణ శివారుపై పోలీస్ నిఘా అంతంత మాత్రంగా ఉండటం, బహిరంగంగానే మద్యం సేవిస్తూ, మత్తులో చిందులు వేస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారని సుచేతానగర్, శివరామసుబ్బయ్య కాలనీ వాసులు వాపోతున్నారు.



వైకుంఠపురం ఆర్వోబీ వంతెన సమీపంలో ఇటీవల జీఆర్పీ పోలీసులకు పట్టుబడ్డ గంజాయి(ఫైల్)

● జోరుగా ప్యాకెట్ల అమ్మకాలు

విశాఖ తదితర ఏజెన్సీ ప్రాంతాల నుంచి రైళ్లు, బస్సుల్లో కిలోల కొద్ది తెచ్చి సరఫరా చేసే ముఠా ఒకటైతే, వాటిని కొనుగోలు చేసి చిన్నచిన్న ప్యాకెట్లుగా అమ్ముకునే ముఠా మరొకటిగా తయారైంది. వీరు కాలేజీ విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని అమ్మకాలు సాగిస్తున్నారు. మత్తు సరఫరాలో ఆటంకం ఎదురైనప్పుడు పంచర్‌లు వేసే సెల్యూషన్, వైట్‌నర్‌ల వినియోగం ఎక్కువైంది. కానీ మందుల సరఫరా ఏజెన్సీల్లో, దుకాణాల్లో స్పిరిట్, ప్రెమో డాల్ వంటి మత్తుమాత్రలు ఎక్కువగా నిల్వచేసి గుట్టు చప్పుడు కాకుండా కొన్ని మందుల దుకాణాలకు మాత్రమే సరఫరా చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

● పట్టుబడుతున్నా ఆగని గంజాయి సరఫరా

వైకుంఠపురం ఆర్వోబీ వం తెన సమీపంలో బిహార్‌కు చెందిన సూరజ్ కుమార్‌తో పాటు తమిళనాడుకు చెందిన తవామణి బ్యాగులతో జూన్ 23న అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో జీఆర్పీ పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. బ్యాగులు తనిఖీ చేయగా 8 ప్యాకెట్లలో ఉంచిన రూ.3 లక్షల విలువ చేసే 15.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకు న్నారు. ఇలా పట్టుబడుతున్నా మత్తు పదార్థాల సరఫరా మాత్రం ఆగటం లేదు.

మత్తుపదార్థాల అమ్మకాలు, వినియోగంపై నిఘా

పట్టణ శివారు ప్రాంతాలు, కళాశాలల పరిసరాలపై దృష్టి పెట్టాం. శివార్లల్లో డ్రోన్‌తో నిఘా ఏర్పాటు చేస్తున్నాం. ఎక్కడైనా మత్తుపదార్థాల అమ్మకం, వినియోగం చేపడుతుంటే డైల్ 100కి సమాచారమివ్వాలి.

- డీఎస్పీ శ్రీధర్



వైకుంఠపురం ఆర్వోబీ వంతెన కింద మత్తులో పడుకుని ఉన్న యువకుడు

● దాడులకు పాల్పడిన సంఘటనలు అనేకం

కావలి వెంగళరావునగర్‌కి చెందిన ఓ బాలిక పై తుఫాన్ నగర్‌కు చెందిన ఖాదర్ బాషా బ్లేడుతో గొంతు దగ్గర కోయగా త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకుంది. కొత్తశివాలయం వెనుక జామాయిల్ తోటలో ముగ్గురు యువకులు గంజాయి సేవించి అక్కడ జరిగిన చిన్న గొడవలో ఒకరి మర్మాంగాలపై పెట్రోల్ పోసి నిప్పంటించగా త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. కోపరేటివ్ కాలనీలో ఉంటున్న తాళ్లూరు వెంకట సత్యన్నారాయణ రాత్రి సమయంలో రైలు దిగి ఇంటికి వెళ్తుండగా, ముగ్గురు యువకులు స్కూటీ పై వచ్చి దాడి చేసి రూ.9000 విలువ గల సెల్‌ఫోన్ తీసుకెళ్లారు. ఇలా అనేక సంఘటనలు వెలుగు చూడటంతో పట్టణ వాసులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి.

చిన్నారులకు

న్యాయం చేయాలి

ఉదయగిరి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గణనాథుడి నిమజ్జనోత్సవంలో బాణసంచా పేలి తీవ్ర గాయాలపాలైన తొమ్మిది మంది చిన్నారులకు న్యాయం చేయడంతోపాటు అందుకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని శనివారం మండలంలోని అప్పసముద్రంలో గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ శుక్రవారం నిమజ్జనానికి వెళుతున్న తమ వాహనం పక్కనే నడింపల్లి వాహనాన్ని ఉంచి బాణసంచా పేల్చడం దారుణమన్నారు. చెబుతున్నా వినకుండా మద్యం మత్తులో విచక్షణారహితంగా బాణసంచా పేల్చి తొమ్మిది మంది చిన్నారులు తీవ్ర గాయాలపాలయ్యేలా చేశారన్నారు. నలుగురు చిన్నారులకు శరీరంపై తీవ్ర గాయాలు కావడంతో వారిని చెన్నై తరలించి ప్లాస్టిక్ సర్జరీ చేయించాలని వైద్యులు సూచించారన్నారు. బాణసంచా పేల్చి చిన్నారులను గాయాల పాల్జేసిన పృథ్వీరాజ్, విష్ణులపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయడంతోపాటు చిన్నారులకు ప్రభుత్వం ఆర్థికసాయం అందజేయాలని వారు డిమాండ్ చేశారు. అలా చేయకపోతే పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేయడంతోపాటు జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళతామని గ్రామస్థులు హెచ్చరించారు.

క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే కాకర్ల

బాణసంచా పేలి గాయాలపాలై ఆత్మకూరు, వింజమూరు వైద్యశాలలో చికిత్స పొందుతున్న చిన్నారులను శనివారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించడంతోపాటు అవసరమైన వారిని నెల్లూరు తరలించాలని వైద్యులకు సూచించారు. కొంతమంది చిన్నారుల వైద్యఖర్చులకు ఆర్థికసాయం అందజేశారు. అలాగే రాష్ట్ర దేవదాయ శాఖా మంత్రి ఆనంకి సైతం ఫోన్ చేసి సమస్యను వివరించి మెరుగైన వైద్యసేవలు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న తదితరులు పాల్గొన్నారు.



అప్పసముద్రంలో ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

మాలకొండను దర్శించుకున్న ఎమ్మెల్యేలు

వలేటివారిపాలెం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ లక్ష్మీన్రసింహస్వామిని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌లు శనివారం దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఘనంగా సత్కరించారు. స్వామివారి ప్రసాదం స్వీకరించారు అనంతరం కేశఖండన శాల, లడ్డు కౌంటర్, తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆలయ పరసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. ఆలయంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. దాతలను ప్రోత్సహించి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని, ఆలయ అభివృద్ధికి తోడ్పాటందించే భక్తులకు ప్రత్యేక పూజలు చేయించాలని తెలిపారు. ఎమ్మెల్యేల వెంట ఆలయ డీసీ చంద్రశేఖర్, నాయకులు మాదాల లక్ష్మీనరసింహం, కాకుమాను హర్షకుమార్, మాదాల మాల్యాద్రి తదితరులు ఉన్నారు.



మాలకొండలో దర్శనానికి వెళ్తున్న ఎమ్మెల్యేలు ఇంటూరి నాగేశ్వరరావు, కాకర్ల సురేష్

మాలకొండ ఆదాయం రూ. 10,91,095

మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనృసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ. 10,91,095 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్ చంద్రశేఖర్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. అష్టోత్తరం టిక్కెట్‌ల ద్వారా రూ. 8,900, కుంకుమార్చన ద్వారా రూ. 22 వేలు, వివాహముల ద్వారా రూ. 3 వేలు, తలనీలాలు ద్వారా రూ. 47,325, వాహన పూజలు ద్వారా రూ. 4,660, ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 3,10,900, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 280, రూము అద్దెల ద్వారా రూ. 30,990, కవర్లు ద్వారా రూ. 7,400, లడ్డుప్రసాదం ద్వారా రూ. 1,79,820, అన్నదానం ద్వారా రూ. 4,45,820, విరాళముల ద్వారా రూ. 30 వేలు ఆదాయం లభించినట్లు ఆలయ డీసీ చంద్రశేఖర్ తెలియజేశారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ముందడుగు

● మంత్రి పొంగూరు నారాయణ ● కంటైనర్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన

నెల్లూరు(జడ్పీ), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వ్యవస్థలో మార్పులు తెచ్చి నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ముందడుగు వేస్తున్నట్లు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. నగరంలోని గాంధీబొమ్మ కూడలిలో శనివారం ఆయన కంటైనర్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెల్లూరులో మొట్టమొదటి కంటైనర్ సబ్‌స్టేషన్ ఏర్పాటు అవుతుండడం గర్వంగా ఉందన్నారు. సీఎం చంద్రబాబు ఎల్లప్పుడూ ఆధునిక సాంకేతికతను ప్రోత్సహిస్తున్నారన్నారు. ఆధునిక టెక్నాలజీ వినియోగం ద్వారా విద్యుత్ లోపాలు తగ్గి, నిరంతరం సరఫరా సాధ్యమవుతుందన్నారు. ఈ సబ్‌స్టేషన్ వల్ల వాణిజ్య సముదాయాలు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, గృహాలు కలిపి దాదాపు 5 వేల విద్యుత్ కనెక్షన్లకు మెరుగైన విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. ఇలాంటి ప్రాజెక్టులు నగర అభివృద్ధికి దోహదపడుతాయన్నారు. ప్రజలకు తక్షణ ప్రయోజనం చేకూర్చేలా అధికారులు త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. భవిష్యత్‌లో మరిన్ని ఇలాంటి సబ్‌స్టేషన్లు నెల్లూరులోనే కాకుండా జిల్లాలోని ఇతర పట్టణాల్లో కూడా నిర్మించాలనే ప్రణాళిక ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్‌యాదవ్, విద్యుత్ ఎస్ఈ వీ.విజయన్, టౌన్ ఈఈ ఎం.శ్రీధర్, ఈఈలు పరంధామయ్య, బాలచంద్ర తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న మంత్రి నారాయణ, పక్కన నుడా చైర్మన్ శ్రీనివాసులురెడ్డి, తదితరులు

నేలటూరును త్వరలోనే తరలిస్తాం!

● మెరుగైన పునరావాసానికి కృషి ● గ్రామస్థులతో కలెక్టర్ ఆనంద్ ముఖాముఖి

ముత్తుకూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : థర్మల్ కేంద్ర ప్రభావిత గ్రామాలైన నేలటూరు, దళితవాడ పట్టపుపాలెంలను త్వరలోనే తరలి స్తామని జిల్లా కలెక్టర్ ఆనంద్ తెలిపారు. శనివారం ఆయన నేలటూరు, పైనంపురం, కృష్ణపట్నం పంచాయతీల్లో పర్యటించారు. నేలటూరు గిరిజన కాలనీ, పైనంపురం దేవరదిబ్బ గిరిజన కాలనీ, గోపాలపురం ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నేలటూరు, పైనంపురం పంచాయతీల్లో తమకు పరిశ్రమల స్థాపన సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రధానంగా తమకు సరైన ఉద్యోగావకాశాలు కల్పించలేదన్నారు. గ్రామాల్లో వసతులు, ఇతర సమస్యలపైన కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. త్వరలోనే నేలటూరు పంచాయతీని తరలించి మెరుగైన పునరావాసం కల్పిస్తామని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు. జెన్‌కో థర్మల్ కేంద్రం ఎస్ఈఐఎల్ ఎనర్జీస్ యాజమాన్యంతో చర్చిస్తామన్నారు. అనంతరం పట్నం పంచాయతీ గోపాలపురంలో పర్యటించారు. కృష్ణపట్నం పోర్టు నుంచి వచ్చే కాలుష్యం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తమ గ్రామాన్ని కూడా తరలించాలని స్థానికులు కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో నాగఅనూష, తహసీల్దారు స్వప్న, ఎంపీడీవో నాగమణి, సర్పంచ్‌లు కనకయ్య, కావలి విజయ్‌కుమార్, నాయకులు యానాటి శ్రీనివాసులు రెడ్డి, సాయి శశిధర్ రెడ్డి, గిరిధర్ రెడ్డి, శివకృష్ణ, మోహన్‌రావు, శోభన్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

జడ్పీలో పదోన్నతులు, కారుణ్య నియామకాలు



ఉత్తర్వులను అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జడ్పీ సీఈవో మోహన్‌రావు

నెల్లూరు(జడ్పీ), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రజా పరిషత్ యాజమాన్యం పరిధిలో 22 మందికి పదోన్నతులు, ఒకరికి కారుణ్య నియామకపు ఉత్తర్వులను శనివారం జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అందజేశారు. ఆ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జడ్పీలో 22 మందికి ఆఫీసు సబార్డినేట్ల నుంచి రికార్డు, ల్యాబ్, లైబ్రరీ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించినట్లు తెలిపారు. ఒకరికి కారుణ్య నియామకపు ఉత్తర్వులను అందజేసినట్లు పేర్కొన్నారు. 2021 నుంచి ఇప్పటి వరకు 155 మంది ఉద్యోగులకు వివిధ హోదాల్లో పదోన్నతులు, 84 మందికి కారుణ్య నియామకపు ఉత్తర్వులు అందించినట్లు తెలిపారు. జడ్పీలో ఎప్పటికప్పుడు పదోన్నతులు, కారుణ్య నియామకాలు త్వరితగతిన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రంగడి పవిత్రోత్సవాలు

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో సెప్టెంబరు 1 నుంచి 7వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ఆళ్ల శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు ఉదయం నుంచి రాత్రి వరకు హోమాలు, తిరుమంజనంలు, గోపురోత్సవాలు జరుగుతాయని భక్తులు అందరూ తరలిరావాలని పేర్కొన్నారు.

తెలుగు భాష వికాసానికి కృషి చేయండి

● మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ● ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రానికి రూ. 5లక్షల విరాళం

వెంకటాచలం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : తెలుగు భాషా వికాసానికి కలిసికట్టుగా అందరూ కృషి చేయాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని చవటపాళెం పంచాయతీ సరస్వతి నగర్ వద్ద ఉన్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాడభూషి సంపత్ కుమార్ రచించిన కృష్ణ రాయల కీర్తి పుస్తకాన్ని ఆవిష్కరించారు. తనకు ఉపరాష్ట్రపతి పదవి అనంతరం వస్తున్న పింఛనులో ఈ కేంద్రానికి రూ. 5 లక్షల నగదును విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించారు. తెలుగువాడిగా పుట్టినందుకు, తెలుగు మాట్లాడుతున్నందుకు, తెలుగువాడిగా వెలుగులోకి వచ్చినందుకు ఎంతో గర్వపడుతున్నానన్నారు. ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రాన్ని అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమిష్టి కృషి ఇందుకు అవసరమన్నారు. నెల్లూరు జిల్లాలో ఈ కేంద్రం ఏర్పాటుకు తాను ఎంతో కృషి చేశానన్నారు. కార్యక్రమంలో ప్రాచీన తెలుగువిశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు మాడభూషి సంపత్‌కుమార్, వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, ఆల్ ఇండియా రేడియో డైరెక్టర్ అనంత పద్మనాభరావు తదితరులు పాల్గొన్నారు.



కృష్ణరాయల కీర్తి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వెంకయ్యనాయుడు

● వృత్తి విద్యా కోర్సులను సద్వినియోగం చేసుకోండి

మండలంలోని చవటపాళెం పంచాయతీ సరస్వతి నగర్ వద్ద అక్షర విద్యాలయంలోని సోమా సాంకేతిక శిక్షణా కేంద్రాన్ని శనివారం మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సందర్శించారు. స్వర్ణభారత్ - సోమా సాంకేతిక శిక్షణా కేంద్రం ద్వారా నిరుద్యోగ యువతకు వృత్తి విద్యా కోర్సుల్లో ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. యువత వృత్తి విద్యా కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు.



సోమా సాంకేతిక శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న యువతను పలకరిస్తున్న వెంకయ్యనాయుడు

6న గిరిజనుల కోసం ప్రత్యేక పీజీఆర్ఎస్: కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గిరిజనుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని సెప్టెంబరు 6వ తేదీన నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి సూచనల మేరకు డివిజన్ స్థాయిలో పీజీఆర్ఎస్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. కందుకూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం, నెల్లూరు, కావలి, ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయాల్లో గిరిజనుల సమస్యలు స్వీకరించి పరిష్కరిస్తామని తెలిపారు.

అట్రాసిటీ కేసు నమోదు

ఉలవపాడు, (ఆంధ్రజ్యోతి): బీరు సీసాతో దాడి చేసి గాయపరిచి, కులం పేరుతో దూషించిన ముగ్గురు యువకులపై ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై అంకమ్మ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆత్మకూరు గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన చిరితోటి సతీష్‌కుమార్, యశ్వంత్‌లు శుక్రవారం రాత్రి ఉలవపాడులోని అంబేడ్కర్ విగ్రహం సెంటర్ వద్ద బైక్‌పై వస్తుండగా ఉలవపాడు గ్రామానికి చెందిన మధు అతని మరో ఇద్దరు స్నేహితులు అడ్డువచ్చి గొడవకు దిగారు. ఆసమయంలో మధు అతని స్నేహితులు బీరు సీసాలతో సతీష్‌కుమార్, యశ్వంతలను కొట్టి గాయపరిచారు. గాయపడిన వారికి స్థానిక సీహెచ్‌సీలో చికిత్స అందించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురు యువకు లపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సోమశిలకు 21,078 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



అనంతసాగరం ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల నుంచి సోమశిల జలాశయానికి శనివారం 21,078 క్యూసెక్కులు వస్తుండగా, 60.716 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలువకు 400, కండలేరుకు 10,500, డెల్టాకు 1,850 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని తెలిపారు.

● కండలేరులో 35.990 టీఎంసీల నిల్వ

రాపూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కండలేరు డ్యాం నీటి నిల్వ సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటిమట్టం 35.990 క్యూసెక్కులు ఉన్నదని ఏఈ అనీల్‌కుమార్ తెలిపారు. సోమశిల నుంచి 10,600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 1325 క్యూసెక్కుల నీరు అవుట్‌ఫ్లో ఉందని పేర్కొన్నారు.